19-05Pg1exHMNWJQE 1 GNT_19-05Pg1exHMNWJQE.qxd 20/May/26 12:22 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-5-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 109 పేజీలు: 12 వెల: 6.50

పెను ఆర్థిక తుఫాను వస్తోంది: రాహుల్

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు 9లో

# బోటూ మనదే.. వేటా మనదే

- చేపల వేటకు సబ్సిడీపై 200 యాంత్రిక పడవలు
- మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడుతాం
- సీవీడ్ సాగుతో మహిళలకూ ఉపాధి అవకాశాలు
- 'మత్స్యకారుల సేవ'లో రూ. 262 కోట్లు పంపిణీ చేసిన సిఎం చంద్రబాబు
- కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ



మంగళవారం తుమ్మలపెంట గ్రామంలో 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

కృష్ణా నదిలో మత్స్యకారుల భారీ ర్యాలీ 2లో



మంగళవారం జరిగిన సభకు హాజరైన మత్స్యకార కుటుంబాలు

**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సిఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్య కార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్యకారుల కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. సిఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి >>2




## మళ్లీ పెట్రో షాక్

### పెట్రోలు, డీజిల్‌పై 90 పైసలు పెంపు

విజయవాడలో పెట్రోలు రూ. 113.88, డీజిల్ రూ. 101.57

హైదరాబాద్‌లో పెట్రోలు రూ. 110.88, డీజిల్ రూ. 98.99

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. దీంతో వాహనదారులకు మరోసారి భారీ షాక్ తగిలింది. ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు మంగళవారం మరోసారి ఇంధన ధరలను పెంచడంతో వారంలోనే రెండోసారి ధరలు పెరిగిన పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్, డీజిల్ ధరలు సగటున లీటరుకు 0.90 పైసల మేర పెంచుతూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. >>2


మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

## పల్లె ప్రగతికే పారదర్శక సర్వే

### గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల గుర్తింపు

### గిరిజన ప్రాంతాలకు మ్యాజిక్ డ్రెయిన్ల విస్తరణ: డి.సిఎం పవన్

**విజయవాడ.మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం అత్యంత పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిత్వశాఖలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు ఏమిటి? ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయనే వివరాలతోపాటు పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, స్మశానవాటికల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వే నివేదికలు ఆధారంగా గ్రామాల్లో భూములకు రక్షణ కల్పించడంతోపాటు ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా నూతన ఆదాయ వనరులను సృష్టించవచ్చని అన్నారు. పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందన్నారు. పల్లె పండుగ తొలి విడతలో అనుకున్నట్లుగానే పూర్తిగా 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయింది. అలాగే 2వ విడతలో 2,750 కిలోమీటర్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకంటే ఎక్కువగా 3,580 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాం అన్నారు. మొదటి విడతలో 22,500 గోకులాలు నిర్మించాలనే లక్ష్యానికి గానూ 22,514 పూర్తి చేశాం. రెండవ విడతలో 15 వేల లక్ష్యానికి గానూ 15,303 గోకులాలు నిర్మించాం. పశువుల తాగునీటి అవసరాల కోసం 15 వేల లక్ష్యానికి గానూ 15,188 నీటి తొట్టెలు నిర్మించాం. మొదటి విడతలో 20 వేల ఫార్మ్ పాండ్స్ లక్ష్యానికి గానూ 21 వేలు పూర్తి చేశాం. రెండవ విడతలో ఈ పనులను భారీగా పెంచి, 81 వేలు లక్ష్యానికి గానూ 86 వేలు ఫార్మ్ పాండ్స్ కుంటలను తవ్వించాం. గ్రామాల్లో మురుగునీటి సమస్య నివారణకు పల్లె పండుగ 2.0 కింద సరికొత్తగా 59 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు.

**మ్యాజిక్ డ్రెయిన్లు విస్తరించాలి**

గ్రామాల్లో మురుగునీటి సమస్యను శాశ్వతంగా అరికట్టేందుకు మ్యాజిక్ డ్రెయిన్స్ విధానాన్ని మరింత ఎక్కువ గ్రామాల్లో ప్రవేశపెట్టాలి. నల్లరేగడి నేలలు, డెల్టా ఏరియాల్లో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుంది కాబట్టి, అక్కడి భూములకు తగినట్లుగా ఈ మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మించాలి. కొండలు, గుట్టలతో కూడిన మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా పరిశుభ్రతను పెంచేందుకు ఈ సరికొత్త డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ పనులు చాలాకాలం మన్నేలా, శాస్త్రీయంగా ఉండటం కోసం నిపుణులైన ఇంజనీర్లు, పారిశుధ్యం ప్రజారోగ్య నిపుణులు సలహాలు, సూచనలు కచ్చి >>2

## ఆదరణ 3.0తో శాశ్వత ఉపాధి

### - మంత్రి సవిత

**విజయవాడ మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదరణ 3.0 పథకం ద్వారా బిసిలకు శావ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిసిలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఆదునిక పనిముట్లు అందజేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో బిసి సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తులకు ఎటువంటి ఆధునిక పరికరాలు ఇవ్వనున్నారో వివరించారు. యువతకు కూడా ఉపాధి లభించేలా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ బిసిలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గతంలో ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను సిఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆదరణ 3.0 పతకానికి శ్రీకారం చుడుతున్నారని, ఇందుకోసం రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నారని వెల్లడించారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగా లబ్ధి కలిగేలా ఆదరణ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.


మంగళవారం గ్రామసభలో సిఆర్‌డిఎ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న తుళ్లూరు రైతులు

## గ్రామసభ రసాభాస

### సిఆర్‌డిఎ కమిషనర్ తీరుపై రాజధాని రైతులు అసంతృప్తి

### అధికారులు సమయం ఎందుకు పాటించరంటూ ఆగ్రహం

**సచివాలయం,మే 19,ప్రభాతవార్త :** భూసేకరణకై రాజధాని అమరావతి పరిధిలోని తుళ్ళూరులో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభాసగా మారింది. ఇటీవల కొత్తగా సిఆర్డిఎ కమీషనర్‌గా నియమితులైన విజయరామరాజు గ్రామ సభకు వస్తే తమ సమస్యలు చెప్పుకుందామని పలువురు రైతులు రాగా కమిషనర్ రాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం 9గంటలకే గ్రామసభ ప్రారంభమవుతుందని >>2

## రాష్ట్రంలో 'సర్'కు రెడీ




### జూన్ 5 నుంచి సిబ్బందికి శిక్షణ

### తర్వాత ఇంటింటికి ఓటర్ల గణన ఫారాలు పంపిణీ

### షెడ్యూలు విడుదలచేసిన సిఇసి

**విజయవాడ, మే 19 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ లోనూ ఓటర్ల సమగ్ర సవరణ (సర్) అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఏపి ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. ఓటర్ల గణన సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ఓటర్ల నుంచి సమాచారాన్ని సేకరించి అనంతరం ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. విచారణకు సహకరిం చని వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. ఓటర్ల సమగ్ర సవరణ (సర్)పై జూన్ నెల 5వ తేదీ నుంచి జూన్ నె14వ తేదీ వరకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. జూన్ నెల 15వ తేదీ నుంచి జూలై నెల 14వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు)ఇంటింటికి వెళ్లి ముందుగా ప్రచురించిన ఓటర్ల గణన ఫారాలను పంపిణీ చేస్తారు. ఓటర్లు వారి సమాచారమును నింపిన తర్వాత ఆ ఫారములను సేకరిస్తారు. ఈ సమయంలో ఓటర్ల నుండి ఎటువంటి పత్రాలు సేకరించరు. ఓటర్లు తమ లేదా తమ బంధువుల 2002 ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు రికార్డులతో వారి వివరాలను అనుసంధానం చేసుకోవచ్చు. 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల జాబితాలో ఓటు కలిగియున్నవారు, వారి ఓటు ఎక్కడ ఉన్నదో ఈ లింక్ (https://voters.eci.gov.in/searchInSIR/ S2UA4DPDF-JK4QWODSE)ద్వారా తెలుసుకోవచ్చు. ఆన్లైన్ ద్వారా సమర్పించబడి, అనంతరం బిఎల్‌ఓ ద్వారా ధృవీకరించబడినవి, వివరాలు పూర్తి చేసి సమర్పించిన ఎన్యూమరేషన్ ఫారముల ఆధారంగా ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం చేస్తారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారములు సమర్పించక పోతే వారి పేర్లు ఓటర్ల ముసాయిదా జాబితాలో చేర్చరు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం, 2002 ఓటరు జాబితాలతో అనుసంధానం కాని లేదా అనుసంధానంలో వ్యత్యాసాలు ఉన్న వ్యక్తులకు ఎన్నికల నమోదు అధికారి (ఇఆర్‌ఓ) నోటీసులు జారీ చేస్తారు. నోటీసులు జారీ చేసిన వ్యక్తుల జాబితాను ఎన్నికల నమోదు అధికారి >>2



## వీధి కుక్కలను తరలించాల్సిందే!

### గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించడానికి సుప్రీంకోర్టు నిరాకరణ

### పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా జంతు జనన నియంత్రణ (ఎబిసి) నిబంధనలను మరింత కఠినంగా అమలు చేసేలా చూసేందుకు, ప్రజా ప్రదేశాలలో వీధి కుక్కల నిర్వహణపై తాను గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. గత ఏడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలలో మార్పులు కోరుతూ కుక్కల ప్రేమికులు, జంతు హక్కుల సంఘాలు దాఖలు చేసిన పలు దరఖాస్తులను జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పాఠశాలలు,ఆసుపత్రులు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌ల వంటి సున్నితమైన ప్రజా ప్రదేశాల నుండి పట్టుకున్న వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స, టీకాలు వేయించిన తర్వాత వాటిని తిరిగి అదే ప్రదేశాలలో వదిలిపెట్టకూడదని ఆ ఆదేశాలలో నిర్దేశించారు. తీర్పును ప్రకటిస్తూ, జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం, "గౌరవప్రదమైన జీవిత హక్కు"లో ప్రజా ప్రదేశాలలో కుక్కల దాడుల భయం లేకుండా జీవించే హక్కు కూడా ఉంటుందని నొక్కి చెప్పింది. వీధి కుక్కల కాటు ముప్పు పెరుగుతున్నప్పటికీ, దానిని సమర్థవంతంగా పరిష్కరించడంలో విఫలమైనందుకు అధికారులను మందలించింది. దాడులకు సంబంధించిన పలు నివేదికలను ప్రస్తావిస్తూ, ఈ సమస్య "దిగ్భ్రాంతికరమైన పరిమాణాలను" సంతరించుకుందని, ఇప్పటికే ఉన్న ఆదేశాలు, చట్టబద్ధమైన నిబంధనల అమలులో తీవ్రమైన లోపాలను ఇది ప్రతిబింబిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యే తప్పు చేసిన అధికారులు కోర్టు ధిక్కరణ, క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారని జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం హెచ్చరించింది. సమగ్ర ఆదేశాలు జారీ చేస్తూ, ఎబిసి నిబంధనల కింద మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు >>2



మంగళవారం విశాఖలో తీర భద్రతా భవనాన్ని ప్రారంభిస్తున్న డిజిపి హరీష్ గుప్తా

## తీరభద్రతా పోలీసు భవనం

### ప్రారంభించిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా

**విశాఖపట్నం మే 19 ప్రభాతవార్త :** రాష్ట్ర సముద్ర భద్రతా కోసం పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా, నగరంలో నిర్మితమైన నూతన తీర భద్రతా పోలీస్ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. ఈ ఆధునిక సదుపాయాలతో కూడిన భవనం, రాష్ట్ర విస్తృత తీర ప్రాంతాలపై పర్యవేక్షణ, గూఢ చారి సమాచార సేకరణతో పాటు అత్యవసర ప్రతిస్పందన కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేయడానికి ఈ భవనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధునిక సదుపాయాలతో కూడిన భవనం, రాష్ట్ర విస్తృత తీర ప్రాంతాలపై పర్యవేక్షణ, గూఢచారి సమాచార సేకరణ అత్యవసర ప్రతిస్పందన కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా పనిచేయడానికి రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. తీర >>2

## కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో రామ్మోహన్ నాయుడు, శ్రీకృష్ణదేవరాయలు భేటీ

**విజయవాడ,.మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో రామ్మోహన్ నాయుడు, శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఏపీలో టెక్స్‌టైల్స్, ఆక్వా, పొగాకు రంగాలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చర్చించారు. పత్తి ధర స్థిరత్వానికి 11 శాతం దిగుమతి సుంకం రద్దు చేయాలని ఏపీ నేతలు కోరారు. అమెరికా సుంకాలతో ఆక్వా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు టెక్స్‌టైల్స్, ఆక్వా, పొగాకు రంగాలు కీలకమని తెలిపారు. దేశీయ మార్కెట్‌లో నాణ్యమైన పత్తి లభ్యత సవాళ్లను వివరించారు. అక్టోబర్ 31 వరకు పత్తి ఎగుమతులపై తాత్కాలిక నియంత్రణ విధించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సీసీఐ నిల్వలను నేరుగా ఉత్పత్తిదారులకే వెళ్లేలా చూడాలని కోరారు. లక్షలమంది ఉపాధికి ఇబ్బంది వచ్చిందని పీయూష్ గోయల్‌కు వివరించారు.

## రాష్ట్రంలో మినీ మార్ట్‌ల ఏర్పాటు


మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన మంత్రి నాదెండ్ల

### కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషితో మంత్రి నాదెండ్ల భేటీ

### విశాఖ, విజయవాడలో సిబిడిసి ప్రక్రియకు అనుమతి

**విజయవాడ, మే 19, ప్రభాతవార్త ప్రతినిధి:** రాబోయే రోజుల్లో ఏపిలో మినీ మార్టులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఏపికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. విశాఖ, విజయవాడలో సిబిడిసి ప్రక్రియకు అనుమతి వచ్చిందని కేంద్ర మంత్రులతో నిర్వహించిన సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. మరో నెల రోజుల్లోనే సిబిడిసికి సాంకేతికత, డేటా సేకరించుకొని ప్రారంభిస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

అదే విధంగా రాబోయే రోజుల్లో వెయ్యి మినీ మార్టుల ఏర్పాటుకు అధికారులు ముందుకొచ్చారని తెలియజేశారు. కంది, మినప వారే సరఫరా చేసి మార్కెట్ కంటే తక్కువ ధరలో ఉండేలా ఏర్పాట్లు చేస్తారని నాదెండ్ల పేర్కొన్నారు. >>2

## నేడు మెడికల్ షాపుల బంద్

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఈ నెల 20న మందుల దుకాణాల బంద్ జరగనుంది. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆన్‌లైన్‌లో నకిలీ, ప్రమాదకర మందుల సరఫరా అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసనను చేపట్టనుండటం గమనార్హం. దీని ఫలితంగా రాష్ట్రంలో 40వేలకు పైగా ఉన్న మందుల దుకాణాలు మూతపడనున్నాయి. దీనికి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వెల్లడించారు.

19-5pg2exHMNWJQE 2_19-5pg2exHMNWJQE.qxd 20/May/26 12:20 AM Page 1





మంగళవారం తుమ్మలపెంటలో ఓ మత్స్యకార కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు

# స్వచ్ఛరథం సానుకూలం

## అభివృద్ధి పనులు తెలిపేలా డాష్‌బోర్డు : డి.సిఎం పవన్

**విజయవాడ,మే 19, ప్రభాతవార్త ప్రతినిధి:** ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా అమలు చేస్తున్న స్వచ్ఛ రథం కార్యక్రమం సానుకూల ఫలితాలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పౌరులు తమ వద్ద ఉన్న పొడి వ్యర్థాలను ఈ స్వచ్ఛ రథాలకు అప్పగించి, వాటికి బదులుగా నిత్యావసర వస్తువులను పొందే ఈ విధానాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా తిరుపతి జిల్లాలో ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టుగా ప్రారంభించిన గ్రీన్ షాప్‌నమూనాను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయా లని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రాలవద్ద పొడి వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర వస్తువులను పొందవచ్చనే విషయంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు. ఏప్రిల్ నెలలో స్వచ్ఛ రథాల ద్వారా 18.86 లక్షల కిలోల వ్యర్థాలు సేకరించినట్లు ఆయన వివరించారు. ఈ సేకరించిన వ్యర్థాల విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



మంగళవారం 'మత్స్యకార సేవలో' సందర్భంగా ఇంటికి వచ్చిన మత్స్యకారులతో మంత్రి లోకేష్

# బోటూ మనదే.. వేటా మనదే

>> నిధులు జమ అయ్యాయి. దీంతో తమకు డబ్బులు జమ అయ్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్ధిదారులు చూపించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మ వద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్ట్రం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం. మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్ లా వ్యవహరిస్తా**

"రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్ల నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్య కారులకే అప్పగించాం. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్‌ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్య కారులకు అందుబాటులోకి తెస్తాం. మన రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంతంలో నివసించే మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతున్నాం. టెక్నాలజీతోపాటు... వినూత్న పద్దతుల ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా ఆదుకుంటాం. చేపల వేటకు వెళ్లే మత్స్య కారులకు అండగా నిలబడడమే కాకుండా... మత్స్యకార మహిళలకు ఉపాధి కల్పించి.. ఆర్థిక సాధికారత కల్పిస్తాం. సీవీడ్ కల్చర్ ద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం. మత్స్యకార మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు సముద్రపు నాచు పెంపకం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేస్తాం. చేపలు మంచి పౌష్టికాహారం. ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రోటీన్ ఉన్న ఈ ఆహారానికి అన్ని చోట్లా గిరాకీ ఉంది. మత్స్య ఉత్పత్తులకు గిరాకీ సృష్టించేలా మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తాను."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**మత్స్య కారుల సేవలో ఉంటాం... అండగా నిలుస్తాం**

"దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇది కొనసాగాలంటే... మత్స్య కారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి... వారికి అండగా నిలవాలి. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మత్స్య కారులకు మేం అండగా ఉంటాం. మెకనైజ్డ్, మోటరైజ్డ్ డీజిల్ పడవలకు లీటరుకు రూ.9 మేర డీజిల్ సబ్సిడీ ఇస్తున్నాం. 2026-27లో రూ.50 కోట్ల విలువైన డీజిల్ సబ్సిడీని మత్స్య కార బోట్లకు అందించాం. రూ.3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. మత్స్య కారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. పడవలు, వలలు, పరిహారం సకాలంలోనే ప్రభుత్వం అందిస్తోంది. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారుల కోసం శాంక్షన్ చేస్తాం. 60 శాతం సబ్సీడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తాం. మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ లభ్యం అవుతాయో అనే సమాచారాన్ని కూడా ఇస్తున్నాం. మెకనైజ్డ్ బోట్లతో సులువుగా చేపల వేట చేసేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఆక్వా కల్చర్ కు అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్ కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మన రాష్ట్రానికి ఏ రంగంలో ఆదాయం వస్తుందో దానిపై శ్రద్ధ పెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. చేపల వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సేవలో పేరిట రూ.20 వేల చొప్పున చేయూత అందిస్తున్నాం. రాష్ట్రంలో మత్స్య కారుల సంక్షేమం గురించి నిరంతరం ఆలోచిస్తూ వారిని ఆదుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతీ మత్స్య కార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇచ్చి సాయం చేశాం. 201419 మధ్యలోనూ చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల వరకూ ఆర్థిక సాయం చేసి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**మత్స్యకార మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ**

మత్స్య కారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి తిలకించారు. అలాగే సీవీడ్, తీర ప్రాంత నిఘా కేంద్రాన్ని సందర్శించారు. తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగు చేసేలా మత్స్య కార మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మత్స్యకార మహిళలు అదనపు ఆదాయం పొందేలా సీవీడ్ కల్చర్ చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. తీరప్రాంతాల్లో మహిళలు సముద్రంలో సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు మత్స్యకార మహిళల శిక్షణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్య కారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక వ్యవస్థను అధికారులు సిఎం ఎదుట ప్రదర్శించారు. ఏపి సరిహద్దుల్లోని సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో హెచ్చరికలు జారీ చేసేలా డ్రోన్లను వినియోగిస్తున్నట్టు అధికారులు సిఎంకు వివరించారు. స్థానిక మత్స్య కార బోట్లు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు హెచ్చరికలు వచ్చే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. ఇక స్థానికంగా పండిన మామిడి కాయలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతును అభినందించారు. డీఆర్డీఓ, వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మార్ట్‌ల ఏర్పాటు

>> మిల్లెట్స్‌నూ మినీ మార్టుల ద్వారా అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ చేపడతా మని మంత్రి నాదెండ్ల అన్నారు. నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకు అందించేలా ఏర్పాట్లు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. అదే విధంగా రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ప్రజ లకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే విధానాలు, సరఫరా వ్యవస్థలో సమన్వయం పెంపు వంటి అంశాలపై మంత్రి నాదెండ్ల విస్తృతంగా చర్చించారు.

## మరోమారు వాయిదా పడ్డ కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం మరోమారు వాయిదా పడింది. ఈ నెల 14న జరగాల్సిన సమావేశం 21వ తేదీకి గతంలో వాయిదా పడగా ఇప్పుడు మళ్లీ ఈ నెల 21న కేబినెట్ భేటీదృష్ట్యా వాయిదా మరలా వేయా లని తెలంగాణ ప్రభుత్వం కోరింది. దాంతో తెలంగాణ విజ్ఞప్తి మేరకు 21న జరగాల్సిన భేటీని కెఆర్ఎంబి వాయిదా వేసింది. సమావేశం తేదీని త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా కృష్ణా బోర్డు వెల్లడించింది.

## దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** దేవాదా యశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి జ్యుడీషియల్ రిమాండ్ జూన్ 2 వరకు పొడి గిస్తూ సిబిఐ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అవినీతి ఆరోపణల కేసులో సస్పెండైన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని ఎసిబి అధికారులు సిబిఐ కోర్టులో ఎసిబి పోలీ సులు హాజరు పరిచారు. ఎసిబి జడ్జి వేసవి సెలవుల కారణంగా సిబిఐ కోర్టులో శాంతిని ప్రవేశపెట్టారు,. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విజయవాడలోని జిల్లా జైలులో ఉన్న శాంతికి జ్యుడీషియల్ రిమాండ్ ముగిసింది. ఈ కేసులో ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది.

# మాటమీద నిలబడేది మత్స్యకారులే

## వారినుంచి చాలా నేర్చుకోవాలి: మంత్రి లోకేష్

## 100 బోట్లలో సిఎం ఇంటికి వచ్చిన మత్స్యకారులు

## వారికి ఆత్మీయ విందు ఇచ్చిన మంత్రి లోకేష్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** మత్స్యకారుల నుంచే మాట మీద నిలబడే తత్వం అందరం అలవర్చుకోవాలి అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'మత్స్యకారుల సేవలో' రెండో యేడాది నిధుల విడుదల సందర్భంగా వంద బోట్లపై వచ్చిన మత్స్యకారులు సిఎం, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల నుంచే మాట మీద నిలబడే తత్వాన్ని అందరూ అలవర్చుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు."మత్స్యకారుల సేవలో" కార్యక్రమం కింద రెండో ఏడాది నిధులు విడుదల చేసిన సందర్భంగా వెంకటపాలెం, తుమ్మలపాలెం, సీతానగరం, కుమ్మరపాలెంలకు చెందిన మత్స్యకారులు వంద బోట్లతో కృష్ణా నదిలో ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రికి, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం బోట్లపై వచ్చిన మత్స్యకారులను ఇంట్లో నుంచి చూసిన మంత్రి లోకేష్ వారికి అభివాదం చేస్తూ ఇంటికి రమ్మని ఆప్యాయంగా ఆహ్వానించారు. అంతా కలిసి ఒక్క మాట అనుకుంటే, దానిపై మత్స్యకారులు నిలబడతారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పాదయాత్రలో మీరు చూపించిన క్రమశిక్షణ ఎన్నటికీ మర్చిపోలేను. మాట మీదే నిలబడుతారు. మీలో ఐక్యత చాలా గొప్పగా ఉంటుంది. మీ నుంచి మేము చాలా నేర్చుకోవాలి. మత్స్యకారుల కోసం ప్రభుత్వం మెరుగైన సేవలందిస్తుంది. మత్స్యకారుల పట్టుదలే వేరు. యువగళం మీకేం కావాలన్నా ధైర్యంగా అడగొచ్చు. ఇది మన ప్రభుత్వం, ఏ సమస్య వచ్చినా మీరు ఇక్కడికి రావచ్చు. ఎలాంటి సహాయమైనా అడగొచ్చు వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రం ఎంత ధ్వంసమైందో అందరూ చూశారని, అయినా మత్స్యకారులు ఎన్ని కష్టాలు పడినా పిల్లలను బాగా చదివిస్తున్నారని ప్రశంసించారు. మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య అయినా ఎప్పుడూ తమ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని మంత్రి హామీ ఇచ్చారు. పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఈ నిధులు అందిస్తున్నారు. తీరప్రాంత భద్రతతో పాటు సముద్ర జాలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. డ్రోన్లు, పెట్రోలింగ్ బోట్లతో అక్రమ వేటను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇంట్లో కూర్చోబెట్టుకుని మత్స్యకారులందరితోనూ ఆప్యాయంగా మాట్లాడి ఫొటోలు దిగారు. తాము సిఎంకు కృతజ్ఞతలు చెప్పడానికి వస్తే మంత్రి లోకేష్ తమకు ఆత్మీయ ఆతిథ్యం అందించారని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

# తీరభద్రతా పోలీసు భవనం

>> భద్రతా పోలీస్‌ను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. తీర భద్రతా పోలీస్ శాఖ పనితీరును సమీక్షించి, బీచ్‌ల వద్ద తీసుకుంటున్న నివారణ చర్యల పై ప్రశంసలు కురిపించారు. అలాగే బీచ్ పెట్రోలింగ్ వివరాలు, ప్రాణ రక్షణ చర్యలు, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాలు, గ్రామ విజిలెన్స్ కమిటీల పనితీరు వాటి ప్రభావం, తీర భద్రతా విభాగంలో ప్రత్యేక ఇంటెలిజెన్స్ యూనిట్ పనితీరు, అందుబాటులో ఉన్న పరికరాలు, వాహనాలు, వాటి అభివృద్ధి అవసరాలు, ఇప్పటివరకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎపిఎస్పీకు చెందిన 3 ప్లాటూన్ల ప్రవేశపెట్టడం, పర్యావరణ పరిరక్షణపై (ఆలివ్ రిడ్లీ తాబేళ్లు) అవగాహన కార్యక్రమాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు, నైట్ హాల్ట్స్, దీవుల్లో జాతీయ పతాకఆవిష్కరణ, నావల్ ఎన్‌సిసి కార్యక్రమాలను పరిశీలించి, తీర భద్రతా పోలీస్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో తీర భద్రతా పోలీస్, ఆంధ్రప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టి, ఇతర పోలీస్ అధికారులు హాజరయ్యారు.

# పల్లె ప్రగతికే పారదర్శక సర్వే

>> తంగా తీసుకోవాలని చెప్పారు.

**గ్రామీణ రోడ్ల నాణ్యతపై రాజీపడొద్దు**

గ్రామాల్లో నిర్మించే సిసి రోడ్లు దీర్ఘకాలం మన్నేలా ఉండాలి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి. నాణ్యత లోపిస్తే సహించేది లేదు. సిసి రోడ్డు వేసిన తర్వాత ఇరువైపులా అలాగే వదిలేయకుండా, మట్టితో పక్కాగా వాలు చేయాలి. వాలు చేయకుండా వదిలేస్తే వాహన ప్రమాదాలు జరిగే అవకాశంతోపాటు వర్షాకాలంలో నీరు నిలిచిపోయి రోడ్డు అంచులు త్వరగా పాడైపోతాయి. పల్లె ప్రజలకు నాణ్యమైన, దీర్ఘకాలం మన్నే రహదారులను అందించడమే లక్ష్యంగా రోడ్లకు జియో మానిటరింగ్ సిస్టమ్‌ను తీసుకొచ్చాం. రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్‌కు చెక్ పెట్టేందుకు ఈ డిజిటల్ పద్ధతి సహాయపడుతుంది. ఏ గ్రామంలో, ఏ ప్రాంతంలో ఎంతవరకు రోడ్డు పనులు జరిగాయో శాటిలైట్, జియో ట్యాగింగ్ ద్వారా క్షేత్రస్థాయిలో కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ సాంకేతికత ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా, ఆయా గ్రామాల్లోని రోడ్లను ఇతర ముఖ్య ప్రాంతాల రోడ్లతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. ప్రజలు కూడా రోడ్ల యొక్క ప్రస్తుత స్థితిగతులను ఆన్‌లైన్ ద్వారా నేరుగా తెలుసుకునే

# మళ్లీ పెట్రో షాక్

>> ఇప్పటికే గత శుక్రవారం పెట్రోల్‌పై లీటర్‌కు రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 పెరగగా తాజాగా మరోసారి పెట్రోల్, డీజిల్‌పై అదనంగా 0.90 పైసలు చొప్పున పెరగడంతో వాహనదారులపై అదనపు భారం పడినట్లయింది. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.0.87 పైసల మేర పెరిగి రూ.97.77 నుంచి రూ.98.64కు పెరిగింది. అలాగే లీటర్ డీజిల్ ధర 0.91 పైసలు మేర పెరగడంతో రూ.90.67 నుంచి రూ.91.58కి చేరింది. ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రాంతంలో లీటర్ పెట్రోల్‌పై 0.91 పైసలు పెంచారు. దీంతో లీటర్ పెట్రోల్ రూ.107.59కి చేరింది. అలాగే లీటర్ డీజిల్‌పై 0.94 పైసలు పెంచారు. దీంతో డీజిల్ లీటరుకు రూ.94.08కు ఎగబాకింది. మరోవైపు కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర 0.96 పైసల మేర పెరిగింది. దీంతో ఇప్పుడు లీటర్ పెట్రోల్ రేటు రూ.109.70కి చేరింది. ఇక లీటర్ డీజిల్ ధరను 0.94 పైసలు పెంచారు. దీంతో కోల్‌కతాలో డీజిల్ లీటరుకు రూ.96.07కు చేరింది. దక్షిణాదిన చెన్నై ప్రాంతంలో లీటర్ పెట్రోల్ రేటును 0.82 పైసలు పెంచడంతో రూ.104.49 స్థాయికి చేరింది. లీటర్ డీజిల్ పై రూ.86 పైసలు పెంచడంతో రూ.96.11 స్థాయికి ఎగబాకింది. ధరల పెంపు తర్వాత హైదరాబాద్ నగరంలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.110.88కు చేరుకుంది. ఇక డీజిల్ ధర రూ.98.99కు పెరిగింది. ప్రస్తుతం విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.88గా ఉండగా లీటర్ డీజిల్ ధర రూ.101.57కు పెరిగింది. విశాఖపట్టణంలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.48గా ఉండగా డిజిల్ ధర రూ.96.22గా ఉంది. ఇక వరంగల్ నగరంలో పెట్రోల్ లీటరు ధర రూ.110.53కు చేరగా డిజిల్ ధర రూ.98.65కు పెరిగింది.

గత శుక్రవారం కూడా చమురు కంపెనీలు లీటరుకు దాదాపు రూ.3 మేర ధరలను పెంచిన నేపథ్యంలో తాజా పెంపుతో కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు సుమారు రూ.4 వరకు పెరిగాయి. పెట్రో ధరల పెరుగుదలకు అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్‌లో నెలకొన్న అస్థిర పరిస్థితులే ప్రధాన కారణమని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి.

మరోవైపు ప్రపంచ పరిస్థితులు త్వరలో సాధారణ స్థితికి రాకపోతే, రాబోయే రోజుల్లో మరిన్ని విడతలుగా పెట్రో ధరలు పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో వారం రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగబోతున్నాయని తెలుస్తోంది. డీజిల్‌పై లీటకు రూ.11.40, పెట్రోల్‌పై లీటరుకు రూ.14.30 మేర పెరిగే అవకాశం ఉందని, అయితే, ప్రస్తుతం నష్టాలను పూర్తిగా పూడ్చడానికి పెట్రోల్, డీజిల్ పై లీటరకు రూ.13 నుంచి రూ.17 వరకు అవసరం కావచ్చునని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంచనా వేసింది.

# కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారుల భారీ ర్యాలీ



మంగళవారం విజయవాడ కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారుల భారీ ర్యాలీ దృశ్యం

**విజయవాడ, మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మత్స్యకారులు బోట్ల ప్రదర్శన చేశారు. వరుసగా రెండో ఏడాది మత్స్యకారుల సేవలో పథకం కింద నిధుల విడుదల చేయడంపై మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. తమ సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కృష్ణా నదిలో బోట్ల ర్యాలీతో ప్రభుత్వానికి మత్స్యకారులు మద్దతు తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇబ్బంది పడకుండా ఒక్కో మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం 20 వేల రూపాయల ఆర్థిక భరోసాఇస్తోంది. గత ఏడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందచేయగా నేడు మత్స్యకార కుటుంబాలకు సిఎం చంద్రబాబు రూ.262 కోట్ల ఆర్థిక సహాయం అందించారు.

# రాష్ట్రంలో 'సర్'కు రెడీ

>> ప్రచురిస్తారు. ఈ జాబితాలు స్థానిక సంస్థల కార్యాలయాల నోటీస్ బోర్డులపై, అలాగే ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ), జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) వెబ్ సైట్లలో ప్రదర్శిస్తారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం, క్లెయిమ్లు మరియు అభ్యంతరాల కాలంలో ఎన్యూమరేషన్ ఫారమ్ నందు వివరాలు అన్ని పూర్తి చేసి, బిఎల్ఓకి మరియు ఆన్లైన్ ద్వారా సమర్పించిన ఫారములపై విచారించి తగు నిర్ణయాలను తీసుకుంటారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉన్న వ్యక్తికి సముచిత విచారణ జరపకుండా మరియు న్యాయసమ్మతమైన అవకాశం ఇవ్వకుండా, ఎన్నికల నమోదు అధికారి ఆ పేరును తొలగించరని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్యూమరేషన్ సమయంలో 18 సం.ల వయస్సు ఉన్నవారు కొత్తగా ఓటు నమోదు కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా ఫారం6లో వివరాలు పూర్తి చేసి తగు డాక్యుమెంట్లు జతపరచి బిఎల్ఓకి లేదా సంబంధిత తహశీల్దారు వారి కార్యాలయములో ఇవ్వవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి పోలింగు కేంద్రానికి బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది. ప్రతి పోలింగు కేంద్రంలో బూత్ లెవెల్ ఏజెంట్లు, బిఎల్ఓలు పూర్తి సమన్వయముతో పనిచేసి ప్రత్యేక సమగ్ర సవరణ అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## వారం - వర్జ్యం

20-05-2026, అధికజ్యేష్ఠ బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణీ కార్తె
చవితి ఉ.11.10
ఆరుద్ర ఉ.6.12, పునర్వసు తె.4.13
వర్జ్యం : సా.5.12-సా.6.40
దు. ఉ.11.38-మ.12.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** లౌక్యం లోపిస్తుంది. ఇందువలన నష్టమేర్పడక పోయినా సమాజంలో మీ పై కొంత దుష్ప్రచారం జరుగుతుంది. బంధువుల కలయిక.

**వృషభం:** నిర్వహించలేక పారిపోతారని ఇతరుల అంచనాలు తలక్రిందులు చే-స్తారు. విశ్రాంతికి సమయం ఉండదు.

**మిథునం:** ఇష్టం లేకపోయినా, నమ్మకం లేకపోయినా కొందరిని తాత్కాలికంగా నమ్మాల్సిన స్థితి తప్పదు. వస్త్రలాభం.

**కర్కాటకం :** ఉద్యోగంలో ఇబ్బందులు కలిగించే వర్గం మళ్ళీ పుంజుకుంటారు. ఆర్థికపరమైన అంశాలు అనుకూలంగా ఉంటాయి.

**సింహం:** కుటుంబపరమైన విషయాలు నిర్లక్ష్యం చేశారని విమర్శలు చేస్తారు. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలు సానుకూల పడతాయి.

**కన్య :** నిర్మాణ సంబంధమైన విషయాలలో లోపాలు కనిపెడతారు. సంఘంలో గౌరవం పెరుగుతాయి. నూతన విద్యావకాశాలు.

**తుల :** అధిక మొత్తములో ధనం ఖర్చయినా ఎందుకు లెక్కలు చూపడం లేదో మీకు అర్థమవుతుంది. కొత్తమిత్రులు పరిచయం.

**వృశ్చికం:** మీ వ్యక్తిగత విషయాలను ఆసరగా తీసుకొని మీకు అన్నివిధాలుగా నష్టం తెస్తున్నారని గుర్తిస్తారు.

**ధనుస్సు:** సంతాన పురోగతి బాగుంటుంది. వాళ్ళకు మంచి అవకాశాలు వస్తాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** సాంకేతిక కారణాల వల్ల ముఖ్యమైన విషయాలు వాయిదా పడతాయి. ఇది మీ అభివృద్ధికి పరోక్షంగా కారణం అవుతుంది.

**కుంభం:** మీరు ఊహించిన వ్యయం అధికం అవుతుంది. బ్యాంకు ఋణాలు సాధించుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** మీకు రావలసిన ధనం, బిల్లులు, పెట్టుబడులు సమయానికి అదుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వీధి కుక్కలను తరలించాల్సిందే!

>> (యుటిలు) కాలపరిమితితో కూడిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతి జిల్లాలో శస్త్రచికిత్స సౌకర్యాలు, శిక్షణ పొందిన సిబ్బంది, తగిన లాజిస్టిక్స్ మద్దతుతో కూడిన కనీసం ఒక పూర్తిస్థాయి ఎబిసి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అది తప్పనిసరి చేసింది.

**పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణానికి అనుమతి**

మానవ ప్రాణాలకు ముప్పును అరికట్టడానికి, తగిన సందర్భాలలో, చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా, పిచ్చికుక్కలు, ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణం (యుథనేషియా) చేపట్టేందుకు అధికారులకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది.

"వీధి కుక్కల జనాభా ఆందోళనకర స్థాయికి చేరిన ప్రాంతాలలో, కుక్క కాట్లు లేదా దూకుడు దాడుల ఘటనలు తరచుగా జరుగుతూ, ప్రజా భద్రతకు నిరంతర ముప్పును కలిగిస్తున్న చోట, సంబంధిత అధికారులు, అర్హత కలిగిన పశువైద్య నిపుణులచే సరైన అంచనాకు లోబడి, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం 1960, జంతు జనన నియంత్రణ నియమాలు 2023, ఇతర వర్తించే చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా, పిచ్చికుక్కలు, నయంకాని వ్యాధితో ఉన్న, లేదా స్పష్టంగా ప్రమాదకరమైన/ దూకుడు స్వభావం గల కుక్కల విషయంలో, మానవ ప్రాణాలకు, భద్రతకు ఎదురయ్యే ముప్పును సమర్థవంతంగా అరికట్టడానికి, కారుణ్య మరణంతో సహా చట్టబద్ధంగా అనుమతించబడిన చర్యలను తీసుకోవచ్చు" అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

# గ్రామసభ రసాభాస

>> చెప్పి 11 గంటల వరకు కూడా అధికారులు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.భూ సమీకరణ చేసి 10సంవత్సరాలు గడిచిన ఇంతవరకు గ్రామ కంఠాల సమస్య తీర్చలేదని సిఆర్డిఎ తీరుపై మండిపడ్డారు.ఎండ తీవ్రత ఉక్కపోతగా ఉన్నప్పటికీ టెంట్లో గంటలు తరబడి రైతులు వేచి యున్నా కమిషనర్ రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులకు మాత్రం ఫ్యాన్లు కూలర్లు ఏర్పాటు చేసి రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడంపై మండి పడ్డారు.రాష్ట్రానికి రాజధాని లేదంటూ సిఎం చంద్రబాబు రైతులకు విజ్ఞప్తి చేయడంతో 33వేల ఎకరాలు రైతులు అందజేసినట్లు తెలిపారు.అమరావతిని అభివృద్ధి చేసే భాగంలో సిఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతూ సమయపాలన పాటిస్తుంటే అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా పనిచేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.దేవుడు కరుణించినా పూజారి కరుణించని సామెతగా రైతుల పరిస్థితి ఉందని విమర్శించారు.రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్లలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం అంచనాల విషయంలో కూడా అధికారులు సక్రమంగా స్పందించడం లేదని ఈ విషయాన్ని పలుమార్లు పలువురు సిఆర్డిఎ కమిషనర్లకు విన్నవించినా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. రైతుల విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయాలను ప్రజాప్రతినిధులు గమనించాలని అవసరమైతే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వార్త

ఏదైనా మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం, విమర్శలను భరించే సహనం ఉండాలి.

- షేక్స్పియర్

# ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో!

పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగే వాతావరణ పరిస్థితే 'ఎల్‌నినో' 2026లో ఎల్‌నినో చుట్టుముట్టి అసమశీతోష్ణస్థితి వాతావరణంలో వడదెబ్బ, వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్తాయని వస్తున్న హెచ్చరికలు మానవాళిని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. ఇప్పటికే 'ఎల్‌నినో' పరిస్థితులున్నాయి. అది సూపర్ ఎల్‌నినోగా మారబోతున్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. నేడోరేపో 'సూపర్ ఎల్‌నినో' తప్పదనిపిస్తోంది. ప్రపంచ వాతావరణంలో ఎల్‌నినో మామూలుగా వచ్చే పరిస్థితి. కాగా సూపర్ ఎల్‌నినో ప్రత్యేక పరిస్థితులలో చూస్తాము. 1982-83లో, 1997-98 లోనూ ఆ తరువాత 2015-16లలో ఈ వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ ఉష్ణోగ్రత రెండు డిగ్రీల సెంటీగ్రేడ్కు పెరిగితే దానిని సూపర్ ఎల్‌నినోగా భావిస్తారు. ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినో ఇప్పుడు తరచూ వినిపిస్తున్న మాటలు. ఏటా మహాసముద్రాలు ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. అయితే ఉష్ణ మండలాలు మీదుగా వీచే తూర్పుగాలులకు ఈ అత్యధిక ఉష్ణోగ్రతలు ప్రత్యేక అనుభూతులు కల్పిస్తాయి. ఇవి తట్టుకోలేనివి. ఈ గాలులు బలహీన పడినప్పుడు మహా సాగరాల ఉపరితల ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి. ఫలితంగా భూమ్యుపరితల వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. దీంతో కొన్నిచోట్ల వరదలు సంభవిస్తాయి. మరి కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతాయి. ఇటువంటి పరిస్థితినే ఎల్ నినో అంటారు. సముద్రపు ఉష్ణోగ్రతలు సగటు కంటే 0.5 డిగ్రీల సెల్సియస్ పెరగుతాయన్నమాట. అయితే సూపర్ ఎల్‌నినో స్థితిలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్ కన్నా అధికం అవుతాయి. ఫలితంగా అకస్మాత్తుగా వరదలు వస్తాయి. అడవులు తగలపడతాయి. ఈ నేపథ్యంలోనే సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ప్రపంచాన్నే భయపెడుతున్నాయి. 1997-98లో ఒకసారి భారత్‌లో సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండి వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దక్షిణాసియాలో నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ఈసారి బలహీనంగా ఉండి సగటు కన్నాతక్కువ వర్షపాతాన్ని నమోదుచేస్తాయి. సాధారణ వర్షపాతం ఉండే చోట కరువు, వర్షాభావం ఉన్నచోట భారీ వర్షాలు కురవడమే దీని ప్రత్యేకత. వర్షాధార పంటలు ఎక్కువగా దెబ్బతింటాయి. మన ప్రాంతంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మహారాష్ట్రలో అధికంగా ఉంటుంది. తీర ప్రాంతాల్లో అస్థిర వర్షాలు తప్పవు. మునుపెన్నడూ లేనంత అసాధారణమైన వాతావరణ పరిస్థితులు రాబోతున్నాయి. మొదటిసారిగా 'సూపర్ ఎల్ నినో' బలంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని పరిశోధకులు చెప్పే విషయాలు గుబులు పుట్టిస్తున్నాయి. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో కరవులు ఏర్పడితే, మరికొన్ని చోట్ల వరదలు ఏర్పడతాయి. ఈ సంవత్సరాన్ని అత్యంత వేడిమి సంవత్సరంగా పేర్కొంటున్నారు. నైరుతి రుతుపవనాలు ముందేవచ్చినా, అత్యంత ఉష్ణోగ్రతల మధ్యవర్షపాతం కూడా తగినంతగా ఉండదని అంచనా వేస్తున్నారు. అత్యధికస్థాయిసముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలను చవిచూస్తామని ఈసీఎండబ్ల్యూఎఫ్ అధికారిక వాతావరణ పర్యవేక్షకకార్యక్రమం కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ తెలిపిన వివరాల ప్రకారం 2026ఏప్రిల్లో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరినట్లు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు ఆత్యధికంగా నమోదైన విషయం తెలిసిందే!ఇది గతం కన్నా 1.43 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడమనే ప్రక్రియ తరచు గమనిస్తున్నదే!. 'ఎల్‌నినో' కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఎదురౌతాయి. తాజా అంచనాలను బట్టివివిధ వాతావరణ పరిశోధనా సంస్థలు 'సూపర్ ఎల్‌నినో' హెచ్చరికలు చేస్తున్నాయి. ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో పడమటి గాలులు మధ్య, తూర్పు పసిఫిక్ ప్రాంతాలకు బలంగా కదులుతున్నాయి. ఈఏడాది సెప్టెంబర్ నాటికల్లా ఉష్ణోగ్రతలో తేడా రెండు డిగ్రీలసెంటీగ్రేడ్ స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువ. అదే జరిగితే 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. పరిశోధకులు చెబుతున్న హెచ్చరికలను బట్టితీవ్ర ఉష్ణోగ్రత మార్పులను గమనిస్తామని, వేడిమి మరో మూడు డిగ్రీల సెంటీ గ్రేడుకు చేరినా ఆశ్చర్యపడనక్కర్లేదు. ఈసారి ఎల్ నినో తీరు ఎన్నడూ లేనంత బలంగా ఉంటుంది. జూన్ మాసార్థంలో సూపర్ ఎల్‌నినోప్రభావం గురించి మరింత విస్తృతంగా చర్చించుకోగలుగుతాము. ప్రపంచమంతా శీతోష్ణ స్థితులు బాగా మారిపోనున్నాయి. దీని ఫలితమే పంటలు సమృద్ధిగా పండకపోవడం, సముద్ర తీరాలలోని పగడపు కొండలు బ్లీచ్ అవడం కూడా చూడవచ్చు. కొన్ని ప్రాంతాలలో ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. భారతదేశంలో పొడి వాతావరణం బాగా పెరిగి కరవులు, హీట్ వేవ్ ప్రభావాన్ని చూస్తాము. వేసవి వేడిమి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలా అత్యధిక వేడి పౌరులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పంటల దిగుబడులు తగ్గుతాయి. చలికాలంలోనూ తేమ ఎక్కువగా నమోదవుతుంది. అననుకూల పరిస్థితులు ఎదురుకావచ్చు. సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పటికే గరిష్టానికి చేరాయి. వాతావరణ హెచ్చరికలను పాటించాలి. ఈ సంవత్సరం నైరుతి రుతు పవనాలు ముందే వచ్చినా, సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశాలున్నాయని ఐఎండీ అంచనా వేసింది. భూగర్భజలాలు తగ్గిపోయి నీటి ఎద్దడి ఏర్పడవచ్చు. ఫలితంగా ఈ ఏడాది రైతాంగానికి గడ్డు కాలం నుంచి తప్పుకోవడానికి అప్రమత్తంగా ఉండడమొక్కటే శరణ్యం.

# భారత్, ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్ ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో అసాధారణ వేగంతో విస్తరిస్తూ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపాంతరం చెందాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన మార్పిడి నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజాశ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాలమధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త సంకల్పాల సాకారానికి, పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా, వైవిధ్యభరితంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. ఇటలీ డిజైన్, తయారీ నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్లతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,లక్షల అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజినీరింగ్ ప్రతిభ విస్తృతి, ఆవిష్కరణ వ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకు గల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేం నిర్దేశించుకున్నాం. ఇది ఓ సాధారణ ఏకీకరణకు పరిమితం కాదు. మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువ వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణ ఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయనఔషధ, జౌళి, వ్యవసాయ ఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. 'మేడ్ ఇన్ ఇటలీ' అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం. మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమమేధ, (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో అసాధారణ పరిధిగల సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈక్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంతో వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల అత్యధునాతన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం సహజసిద్ధమైనదిగా, వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది. కృత్రిమ మేధ రంగం మా రెండు దేశాలతోపాటుముఖ్యంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్రవేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రకంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ చాలాకాలం నుంచీ పరస్పర సహకారంతో కృషి చేస్తున్నాయి. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రకంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక



భారత్, ఇటలీ ప్రధానమంత్రులు నరేంద్ర మోడీ, జార్జియా మెలోనీ

విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాదసంప్రదాయంలో పాదుకున్న మానవకేంద్రక అల్గార్ఎథిక్స్‌ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతికపారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం. డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదాన ప్రదానం ద్వారా ప్రతి దేశం ఏఐని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జీ7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే. ప్రపంచం నానాటికీ పరస్పర సంధానితం అవుతున్న పరిస్థితులలో సరిగ్గా ఈ సమస్యను పరిష్కరించడంపైనే మానవ స్వేచ్ఛను, గౌరవాన్ని పరిరక్షించాలనే మా విధానం ఆధారపడి ఉంటుంది. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భవిష్యత్తరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు గణనీయ అవకాశాలు అందివస్తాయి. ప్రపంచ దేశాల శ్రేయస్సుకు భరోసాలభించాలంటే జాతీయ భద్రతస్థిరత్వం అత్యావశ్యకం. కాబట్టే రక్షణభద్రత, వ్యూహాత్మక సాంకేతికతలు వంటి రంగాల్లో సహకార బలోపేతానికి ఇటలీ, భారత్ సంకల్పించాయి. కీలక సముద్ర మార్గాల భద్రతకు భరోసాతోపాటు ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర నెట్‌వర్క్‌లు, మాదకద్రవ్యాల దొంగ రవాణా, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను ఎదుర్కొనగల సామర్థ్యాన్ని పటిష్ఠం చేయడంలో ఈ సహకారం దోహదం చేస్తుంది. మా భాగస్వామ్యానికి ఇంధన రంగం మరో మూలస్తంభం. వైవిధ్య భరిత ఇంధన వనరుల దిశగా ప్రపంచ ప్రస్థానంలో ఆవిష్కరణ, పెట్టుబడులు, సహకారం అత్యావశ్యకాలు. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనాల నుంచి హైడ్రోజన్ సాంకేతికతల దాకా, స్మార్ట్ గ్రిడ్‌ల నుంచి పునరుత్థాన మౌలిక సదుపాయాల వరకూ భారత్, ఇటలీ ఇప్పటికే సహకారం కొనసాగిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతుల కూడలిగా మారడం కోసం భారత్ కృషి ఫలితంగా మా భాగస్వామ్యానికి అసాధారణ సామర్థ్యం సమకూరుతోంది. ఈ నేపథ్యంలో భారత్ నేతృత్వాన ఏర్పడిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), విపత్తు పునరుత్థాన మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవఇంధన కూటమి (జీబీఏ) వంటి సంకీర్ణ సంస్థల కృషిలో ఇతర దేశాలతోపాటు మా సహకారం కూడా కీలకం. భౌతిక, డిజిటల్, మానవ అనుసంధానమే మా భాగస్వామ్యాన్ని మరింతగా పెనవేసిన సూత్రం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రాలైన ఇండోపసిఫిక్, మధ్యధరా ప్రాంతాల నడిబొడ్డున భారత్, ఇటలీ ఉన్నాయి. కాబట్టి, ఈ ప్రాంతాలను వేర్వేరు పరిధులుగా కాకుండా అంతకంతకూ పరస్పర సంధానితం అవుతున్న ప్రదేశాలుగా పరిగణించాలి. వాస్తవానికి హిందూ మహాసముద్రాన్ని ఐరోపాతో ముడిపెట్టే వాణిజ్య, సాంకేతిక, ఇంధన, డేటా సహా సమాలోచనలకు కీలక మార్గమైన భారత మధ్యధరా ప్రాంతం ఆవిర్భావానికి మా రెండు దేశాలే ప్రత్యక్ష సాక్షులు. సరిగ్గా ఈ పరస్పర సంధాన క్రమంలోనే మన స్నేహబంధం సహజ రీతిలో ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిఢవిల్లుతూ రెండు ఖండాలను కలిపి, కొత్త ప్రపంచ గమనానికి రూపుదిద్దుతుంది. ఈ పరిస్థితుల నడుమ ఆధునిక రవాణా, మౌలిక సదుపాయాలు, డిజిటల్ నెట్‌వర్క్‌లు, ఇంధన వ్యవస్థలు, పటిష్ఠ సరఫరా వ్యవస్థలతో మన ప్రాంతాలను అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్న దార్శనికతకు భారత్ మధ్యప్రాచ్య ఐరోపా ఆర్థిక కారిడార్ (ఐఎంఈసీ) ఒక ప్రతీక. ఈ దృక్కోణానికి వాస్తవికతను ఆపాదించడంలో ఇతర భాగస్వాములతో సమష్టిగా కృషి చేసేందుకు భారత్, ఇటలీల నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాయి. భారతీయ సంస్కృతి ప్రబోధించే ధర్మం అనే ఉదాత్త భావన మా చర్యలకు మార్గనిర్దేశం చేసే బాధ్యతా స్ఫూర్తిని ఉత్తేజితం చేస్తుంది. ఆ క్రమంలో నేటి పరస్పర సంధాన డిజిటల్ యుగంలోనూ వసుధైక కుటుంబకం(యావత్ ప్రపంచం ఒకే కుటుంబం) సూత్రం మానవాళి మొత్తాన్నీ ముడివేయడంలో శక్తిమంతంగా పనిచేస్తుంది. పునరుజ్జీవన పథంలో పయనించే ఇటలీ మానవతావాద సంప్రదాయం కూడా ఈ విలువలను సహజంగా ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి గౌరవాన్ని, ప్రజలను, సమాజాలను ఏకం చేసే సంస్కృతికిగల అపార శక్తిని ఇది తేటతెల్లం చేస్తుంది. అందుకే, రెండు దేశాల ప్రజలకు కేంద్ర స్థానమిస్తూ బలమైన, భవిష్యత్ దృక్కోణ సహిత భారత్‌ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వేయాలని మా సంయుక్త దార్శనికత లక్ష్యనిర్దేశం చేసుకుంది. ●

- ప్రధాన మంత్రి నరేంద్రమోడీ



అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.

రామకృష్ణ పరమహంస



అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.

శ్రీ రమణ మహర్షి

# రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

తరిగోపుల నారాయణస్వామి

దేశ నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనది. ప్రభుత్వ పాలనను గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నడిపించే శక్తి ఉద్యోగ వ్యవస్థ. విద్యావ్యవస్థను నిలబెట్టేది ఉపాధ్యాయ వర్గం. జీవితాంతం సేవలందించిన తరువాత కూడా సమాజానికి మార్గదర్శకులుగా నిలిచేవారు రిటైర్డ్ ఉద్యోగులు. అయితే ఇటువంటి వర్గాల పట్ల కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం బాధాకరం. ముఖ్యంగా కరువుభత్యం సకాలంలో చెల్లించకపోవడం, వేతన సవరణలను ఆలస్యం చేయడం వంటి అంశాలు ఉద్యోగకుటుంబాల ఆర్థిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా ఉద్యోగుల ఆదాయం మాత్రం అదేస్థాయిలో ఉండిపోవడం అన్యాయం. కరవు భత్యం అనేది ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యం కాదు. అది వారి జీవన వ్యయాలను తట్టుకునేందుకు ఆర్థికరక్షణ. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఆ లోటును భర్తీ చేయడానికే కరవు భత్యం ప్రవేశపెట్టబడింది. కానీ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ భత్యాన్ని ఆలస్యంగా అమలు చేస్తున్నాయి. కొన్నిసార్లు ప్రకటించిన డీఏ బకాయిలను కూడా సంవత్సరాల తరబడి నిలిపివేస్తున్నారు. దీని వలన ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారు. పెన్షనర్లు మరింతకష్టాల్లో పడుతున్నారు. ముఖ్యంగా వైద్య ఖర్చులు అధికమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రిటైర్డ్ ఉద్యోగుల జీవితం భారంగా మారుతోంది. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న ప్రతి దశలో కరవు భత్యం సమయానికి పెరగాలి. ఉద్యోగుల జీవన ప్రమాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ అనేక రాష్ట్రాల్లో రాజకీయ కారణాలు, ఆర్థిక క్రమశిక్షణ పేరిట ఉద్యోగుల హక్కులను వాయిదా వేస్తున్నారు. చాలాసందర్భాల్లో ఉపాధ్యాయులు తమ కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సమాజానికి మంచిది కాదు. ఉపాధ్యాయుని ఆర్థిక భద్రతే విద్యావ్యవస్థకు బలమైన పునాది. వేతన సవరణ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరగాలి. జీవనవ్యయ సూచికలు, ధరల పెరుగుదల, సామాజిక పరిస్థితులు, ఆర్థిక మార్పులు అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఉద్యోగుల వేతనాలను పునఃసమీక్షించాలి. కానీ చాలా రాష్ట్ర ప్రభుత్వాలు వేతన సవరణలను సంవత్సరాల తరబడివాయిదా వేస్తున్నాయి. ఒకవైపు ఇంధన ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు విద్యుత్ ఛార్జీలు, వైద్య ఖర్చులు, విద్య ఖర్చులు అమాంతం పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాత వేతనాలతో జీవించడం ఉద్యోగులకు అసాధ్యమవుతోంది. మధ్యతరగతి కుటుంబాల జీవనం తీవ్ర సంక్షోభంలో పడుతోంది. వేతన సవరణ ఆలస్యం కావడం వల్ల ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. దీని ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా పడుతోంది. ఉద్యోగుల వినియోగ శక్తి తగ్గితే మార్కెట్‌లో వ్యాపారాలు కూడా మందగిస్తాయి. కాబట్టి ఉద్యోగుల వేతనపెంపు అనేది కేవలం వారిప్రయోజనం మాత్రమే కాదు, ఆర్థిక వ్యవస్థకు కూడా అవసరం. పెన్షనర్లు జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించినవారు. కానీ చాలా చోట్ల పెన్షన్ సవరణలు కూడా ఆలస్యమవుతున్నాయి. డీఏ బకాయిలు ఇవ్వకుండా వాయిదా వేయడం అనేది వృద్ధులపట్ల అన్యాయం. వృద్ధాప్యంలో వైద్యసేవలు, మందులు, జీవన ఖర్చులు పెరుగుతున్నాయి. అలాంటి సమయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం పెన్షనర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిబంధనలు పాటించిన వారు రిటైర్మెంట్ తర్వాత తమ హక్కుల కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరం. ●

# పాఠశాలలోనే ఇంటర్.. వరమా, భారమా?

తిప్పర్తి శ్రీనివాస్

ఇటీవలి కాలంలో భారతదేశ విద్యావ్యవస్థలో జరుగుతున్న మార్పులు, సంస్కరణలు సమాజంలో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో కలపాలనే ప్రతిపాదన విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఆసక్తికరమైన చర్చకు కారణమైంది. ప్రస్తుతం పదోతరగతి తర్వాత రెండు సంవత్సరాల పాటు జూనియర్ కాలేజీల్లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యను పాఠశాలల పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన జాతీయ విద్యా విధానం-2020 నేపథ్యంలో మరింత ప్రాధాన్యం పొందింది. ఈ మార్పు విద్యార్థులకు మేలు చేస్తుందా? లేక ఇప్పటికే సమస్యలతో ఉన్న విద్యా వ్యవస్థపై మరింత ఒత్తిడిని పెంచుతుందా? అనే ప్రశ్నలు సహజంగానే ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు పూర్తిగా భిన్నమైన వాతావరణంలోకి వెళ్లాల్సి వస్తోంది. స్కూల్ జీవితం నుంచి ఒక్కసారిగా జూనియర్ కాలేజీ వాతావరణంలోకి మారడం వల్ల చాలామంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొత్త వాతావరణానికి అలవాటు పడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే పాఠశాలలో 12వ తరగతి వరకు విద్యను కొనసాగించే అవకాశం ఉంటే విద్యార్థుల్లో భయం తగ్గి, ఆత్మవిశ్వాసం పెరిగే అవకాశం ఉంటుంది. విద్యలో నిరంతరత ఉండటం వల్ల వారి చదువుపై ఆసక్తి కూడా పెరుగుతుంది. ఇంటర్మీడియట్ వ్యవస్థపై ప్రస్తుతం ఉన్న ప్రధాన విమర్శ ఏమిటంటే అదిపూర్తిగా మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షల చుట్టూ తిరుగుతోంది. ఐఐటిజేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పరీక్షల కోసం విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కోచింగ్ సెంటర్లలో గడిపే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సృజనాత్మకత, సామాజిక అవగాహన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలు వెనుకబడుతున్నాయి. పాఠశాల విద్యలో విలీనం చేస్తే విద్యను మరింత సమగ్రంగా రూపొందించే అవకాశం ఉంటుంది. కేవలం మార్కుల కోసం కాకుండా విద్యార్థుల ఆలోచనా శక్తి, సృజనాత్మకత, నైతిక విలువలు పెంపొందించే విధంగా విద్యా విధానాన్ని మార్చుకోవచ్చు. ఈ మార్పు వల్ల గ్రామీణప్రాంతాల విద్యార్థులకు కూడా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మంచి జూనియర్ కాలేజీలు ఎక్కువగా పట్టణాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. దీంతో గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇది వారి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది. పాఠశాలలలోనే ఇంటర్మీడియట్ విద్య అందుబాటులో ఉంటే ఈ సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పదో తరగతి తర్వాత



చదువును మధ్యలోనే వదిలేసే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గవచ్చు. ఆర్థిక ఇబ్బందులు, ప్రయాణ సమస్యలు, సదుపాయాల లేమి వంటి కారణాలతో చాలామంది విద్యార్థులు చదువు కొనసాగించలేకపోతున్నారు. సమీప పాఠశాలలోనే ఉన్నత తరగతులు ఉంటే వారికి చదువు సులభంగా కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ఈ మార్పుకు అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే మౌలిక వసతుల కొరత స్పష్టంగా కనిపిస్తుంది. చాలాచోట్ల సరిపడా తరగతి గదులు లేవు. ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ సదుపాయాలు కూడా తగిన స్థాయిలో లేవు. ఈ పరిస్థితుల్లో ఇంటర్మీడియట్‌ను కూడా అదే వ్యవస్థలో కలపడం వల్ల విద్యా నాణ్యత తగ్గిపోవచ్చనే భయం వ్యక్తమవుతోంది. ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేకమైన అకడమిక్ ప్రణాళిక అవసరం. సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్టులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు అవసరం. అన్నిపాఠశాలల్లో ఈ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వానికి పెద్దసవాలుగా మారుతుంది. ఇంకోముఖ్యమైన సమస్య విద్యా ప్రమాణాల అసమానత. పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలు ఈ మార్పును సులభంగా స్వీకరించే అవకాశం ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడే ప్రమాదం ఉంది. ఫలితంగా విద్యార్థుల మధ్య అసమానతలు మరింతపెరిగే అవకాశముంది. ఇప్పటికేప్రభుత్వ, ప్రైవేట్ విద్య మధ్య పెద్ద అంతరం ఉంది. ఈ సంస్కరణ సరైన ప్రణాళిక లేకుండా అమలు చేస్తే ఆ అంతరంమరింత విస్తరించవచ్చు. అలాగే ప్రస్తుతం ఉన్న జూనియర్ కాలేజీల భవిష్యత్తుపై కూడా అనేక సందేహాలు ఉన్నాయి. వేలాది మంది అధ్యాపకులు, సిబ్బంది ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉంది. విద్యా సంస్కరణలు చేపట్టేటప్పుడు ఈ అంశాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. కేవలం వ్యవస్థను మార్చడంద్వారా మాత్రమే విద్యా సమస్యలు పరిష్కారం కావు. ఉపాధ్యాయుల శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నేటి పరిస్థితుల్లో విద్య అంటే కేవలం ఉద్యోగం పొందడానికి అవసరమైన సాధనం మాత్రమే కాకుండా మంచి పౌరులను తయారుచేసే ప్రక్రియ కూడా కావాలి. కానీ ప్రస్తుతం ఉన్న ఇంటర్మీడియట్ వ్యవస్థ విద్యార్థులను యంత్రాల్లా మార్చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కుల కోసం మాత్రమే చదివే పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి కారణంగా ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యతో విలీనం చేయడం ద్వారా విద్యనుమరింత మానవీయంగా మార్చేఅవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఏ సంస్కరణ అయినా విజయవంతం కావాలంటే దాని అమలు విధానం చాలాముఖ్యమైంది. సరైన ప్రణాళిక లేకుండా తీసుకునే నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల ప్రభుత్వం విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో విస్తృతచర్చలు జరిపి సమగ్ర నిర్ణయం తీసుకోవాలి. విద్యావ్యవస్థలో మార్పులుఅవసరమే. కానీ ఆ మార్పులు విద్యార్థుల భవిష్యత్తును మరింత మెరుగుపరిచేలా ఉండాలి గానీ కొత్త సమస్యలకు దారితీయకూడదు. ●

## ప్రజావాక్కు

### పునరుత్పాదక ఇంధన వనరులు అవసరం

ప్రస్తుతం ప్రపంచం తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. శిలాజఇంధనాల నిల్వలు తరిగిపోతుండటం, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు చమురు సరఫరాపై ప్రతికూలప్రభావాన్ని చూపుతున్నాయి. భారత్ తన చమురు అవసరాల కోసం అధిక శాతం ఇతర దేశాల దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఈకారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగిన ప్రతిసారీ మన ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడుతోంది. రూపాయి విలువ క్షీణించడం, రవాణా ఖర్చులు పెరగడం వల్ల సామాన్యుడిపై ధరల భారం అపరిమితంగా పెరుగుతోంది. ఈ ఇంధన విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే దేశ ప్రజలు మిత వ్యయాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలి. అనవసరమైన వాహన ప్రయాణాలను తగ్గించుకోవడం, ప్రజారవాణావ్యవస్థను (బస్సులు, రైళ్లు)ఎక్కువగా వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించడంతో వనరులను కాపాడుకోవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భారత్‌కు కొత్త సవాళ్లు

భారతదేశం శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, భిన్న ప్రజల సమ్మేళనంగా నిలిచింది. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభం వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో ఆశ్రయం కల్పించిన దేశంగా భారత్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఇటీవల ఈశాన్య భారతంలో మయన్మార్, మణిపూర్ప్రాంతాలనుంచి వచ్చిన శరణార్థుల పరిస్థితి మాత్రం అనిశ్చితితో నిండినదిగామారింది. వారిజీవితం భవి ష్యత్తు ఏమిటన్నప్రశ్నమధ్యలో నిలిచిపోయినట్లుగా కనిపిస్తోంది. మయన్మార్‌లో రాజకీయ అస్థిరత, సైనిక పాలన, అంతర్గతఘర్షణలు తీవ్రంగా పెరగడంతో వేలాదిమంది ప్రజలు సురక్షితమైన ఆశ్రయం కోసం తరలివచ్చారు.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### గురుకులాల్లో సీట్లు భర్తీ చేయాలి

గురుకులాలలో ప్రతి తరగతిలో అన్నిసీట్లు భర్తీ చేయాలి. గ్యాప్ ఉన్న విద్యార్థులకు కూడా మార్కులను చూసి సీట్లు ఇవ్వాలి. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో రిజర్వేషన్ విధానం తప్పనిసరిగా పాటించాలి. ప్రతి సెక్షన్‌లో 40సీట్లు భర్తీ చేయాలి. ప్రతి విద్యార్థికి టెస్టు బుక్కులు ఉండాలి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### చట్టం అందరికీ సమానం కాదా!

దొంగస్వాములు ప్రభుత్వ భూములు ఆక్రమించి , ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటే, తన్ని తరిమేసి భూములను స్వాధీనం చేసుకోకుండా ఎందుకీ ప్రభుత్వం? ప్రకాశం ,తిరుపతి జిల్లా అధికారులుగత 20,25 సంవత్సరాలుగా దొంగబాబాల ఆశ్రమ నిర్వాహకులతో డ్రామాలు ఆడుతున్నారు. క్విడ్ ప్రోకో జరుగుతుందా అన్న అనుమానం వస్తుంది. మాకు వచ్చేది ఏమిలేదు. ప్రభుత్వ భూములు దొంగలపాలు కాకూడదు అన్నతపన అంతే! ప్రకాశం జిల్లా దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకొండి అని 2021 లోనే ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించింది. ఇంతవరకు అతీ గతీ లేదు. తిరుపతి జిల్లాలో కల్కి ఫిర్యాదును హైకోర్టు కొట్టేసింది. దళితుల భూములను వారికి కలెక్టరు స్వాధీనం చెయ్యలేదు. ఈ విషయాన్ని పత్రికలకు, ముఖ్యమంత్రులకు, సీసీ ఎల్ఏకు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు లెటర్లు రాశారు ఇంత బాధ్యతారాహిత్యమా? ముఖ్యమంత్రి ఐన వెంటనే స్వరూపానంద ఆక్రమించాడని విశాఖపట్నం దగ్గర భూములను ఎందుకుస్వాధీన చేసుకున్నారు? ఒకరికి ఒక న్యాయం ఇంకొకరికి అన్యాయమా!

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### సామాన్యుడి బతుకు భారం

రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, బంగారం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన పేదవాడి బతుకు బండి ముందుకు సాగాలంటే అప్పులు జేయాల్సిన పరిస్థితి. ఎప్పుడూ ఏ ధర ఎంత మేరకు పెరుగుతుందో తెలియని అమాయక స్థితిలో కుమిలిపోతున్నడు. కంపెనీల నష్టాలు అధిగమించడం కొరకు సామాన్యుడి పై ఈ ధరలు పెంచి పేదవాడి నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు కలిసికట్టుగా పోరాటం చేస్తేనే కొద్దిమైన మార్పులు సంభవించే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### వాటర్ షెడ్ అమలు చేయాలి

వాటర్‌షెడ్ అనేది తెలంగాణ రాష్ట్రానికి దానితో పాటు భూపరివేష్టిత రాష్ట్రాలకు వరం లాంటిది. అంత మాత్రమే కాదు భూపరివేష్టిత రాష్ట్రాలలో భూమి ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల నీటిని ముఖ్యంగా వాన నీటిని ఆపి నీటిని భూమిలోకి ఇంకెట్టు చేసే సామర్థ్యం వీటికి ఉన్నది కాబట్టి భూపరివేష్టిత రాష్ట్రాలకు అది ఒక వరం. అంత మాత్రమే కాదు తెలంగాణ లాంటి రాష్ట్రాలలో ఉన్నఎర్ర చెక్క భూములు కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికి ఉపయోగపడుతాయి. ప్రభుత్వం ఒక మిషన్ మోడ్‌లో వాటర్ షెడ్‌ను అమలు చేయాలి.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## నేడు అవగాహన...లో హాస్యవల్లరి

గుంటూరు కల్చరల్,మే 19,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 16సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న హాస్యవల్లరి కార్యక్రమం బుధవారం సాయంత్రం 6.30గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించబడుతుందని సంస్థ కార్యదర్శి తెలిపారు.'హాస్యమే దివ్యఔషధం అంటున్న వివిధ రంగాల ప్రముఖుల మాటల ప్రకారం ప్రతినెలా నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమంలో జోక్స్,కామెడీ స్కిట్స్,మిమిక్రి,మ్యాజిక్,హాస్య,వ్యంగ్య కవితలు తదితరాలతో హాస్యప్రియులందర్ని ఆనందింపచేస్తారు.నవ్వునవ్వించే పేరుతో నిర్వహించబడే ఈ 140వ హాస్యవల్లరి కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.

## నిష్కళంక దేశభక్తుడు ప్రజా సేవా దురంధరుడు పుచ్చలపల్లి



గుంటూరు కల్చరల్,మే 19,ప్రభాతవార్త :ప్రజాక్షేమమే పరమావధిగా ఉద్యమమే ఊపిరిగా ప్రజాసేవకు అంకితమై ఆడంబరాలకు ఆర్బాటాలకు దూరంగా ఉంటూ సుమారు 6దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని గడిపిన నిష్కళంక దేశభక్తుడు,అసాధారణ వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.అవగాహన సంస్థ కార్యాలయంలో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీ,నిరాడంబర త్యాగశీలతతో ప్రజా జీవితంలో నూతన ఒరవడిని పుచ్చలపల్లి సృష్టించారన్నారు.ఇంజనీర్ విశ్లేషకులు ఎన్.సదాశివం మాట్లాడుతూ సంపన్నుల కుటుంబంలో పుట్టినా పిత్రార్జితం అంతా ప్రజా ఉద్యమాలకోసం వెచ్చించిన నిస్వార్థజీవి సుందరయ్య అన్నారు.కమ్యూనిస్టు పార్టీ తరుపున తొలి పార్లమెంట్ సభ్యునిగా,శాసనసభ్యునిగా ప్రజాభిమానం చూరగొన్నారన్నారు.కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ నాయకులు వెంకటరత్నం,జనార్ధనరావు తదితరులు నివాళులర్పించారు.

## ముద్దాయిపై పిడి యాక్ట్

గుంటూరు క్రైమ్,మే19,ప్రభాతవార్త:గడచిన రెండు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో సుమారు 112 ఆస్తి దొంగతనాలకు పాల్పడిన చిల్లర సురేష్ చల్లా సురేష్ పై గుంటూరు జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.ఎన్ని సార్లు జైలుకు వెళ్లినా తన నేరప్రవృత్తిని మార్చుకోకుండా పదేపదే దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న ముద్దాయి చిల్లర సురేష్ పై గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సస్పెక్ట్ షీట్ ను తెరిచి నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరిగింది.అయినప్పటికీ తన ప్రవర్తన మార్చుకోకుండా వరుస నేరాలకు పాల్పడుతున్నందున ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తిగా గుర్తించి, ముద్దాయిపై పీడీ యాక్ట్ ప్రయోగించాల్సిందిగా జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సి.ఎం. సాయికాంత్ వర్మకి సిఫార్సు చేశారు.జిల్లా ఎస్పీ నివేదికలు, ముద్దాయి నేర చరిత్ర, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సి.ఎం. సాయికాంత్ వర్మ, ఐఏఎస్ ముద్దాయిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా,ఆ ఉత్తర్వుల మేరకు ముద్దాయి చిల్లర సురేష్ చల్లా సురేష్ ను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. గుంటూరు గోరంట్ల కు చెందిన చిల్లర సురేష్ చల్లా సురేష్,అనే ముద్దాయి పై ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 2024 నుండి 2026 వరకు సుమారు 112 దొంగతనం కేసులు నమోదయ్యాయి.

## జీఎంసీ పునర్విభజన ప్రతిపాదిత ముసాయిదాపై అభ్యంతరాలు స్వీకరణ

**నేరుగా లేదంటే మెయిల్ కు ఫిర్యాదు చేసే అవకాశం**

**నగర కమిషనర్ కే మయూర్ అశోక్**



గుంటూరు కార్పొరేషన్, మే 19 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న 57 ఎన్నికల వార్డులను 76 వార్డులుగా పెంపుదల చేసిన పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను సోమవారం ప్రచురించామని, అందులో ఏమైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ప్రతి రోజు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు, ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సిటి ప్లానర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏసిపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌంటర్ లో వ్రాత పూర్వకంగా లేదా మెయిల్ కి ఆన్ లైన్ ద్వారా కూడా అందించవచ్చని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్డుల సరిహద్దులతో కూడిన ప్రతిపాదిత ముసాయిదాను అధికారికంగా ప్రచురించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు , ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించినున్నట్లు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ వెబ్ సైట్ లో కూడ అప్ లోడ్ చేశామని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 7,43,354ని 76 వార్డ్ లకు డివైడ్ చేయగా సరాసరి 9,780 వచ్చిందని, అందుకు 10 శాతం హెచ్చు, తగ్గులతో సహజసిద్దమైన బౌండరీలు వచ్చేలా శాస్త్రీయ పద్దతిలో వార్డ్ ల విభజన చేసి ముసాయిదాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగానికి వ్రాతపూర్వకంగా సమర్పించాలని కోరారు.

## నగరంలో ప్రధాన రహదారులను ఆధునికమైన మౌలిక వసతులతో అభివృద్ధికి కృషి

**గుంటూరు కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ సిఎం.సాయికాంత్ వర్మ**



గుంటూరు కార్పొరేషన్, మే 19 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులను ఆధునికమైన మౌలిక వసతులతో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తో కలిసి నగరంలోని కాకాని రోడ్, విఐపి రోడ్, ఆర్టీసి బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ సర్కిల్ నుండి కంకర గుంట ఆర్ఓబీ వరకు, విద్యా నగర్ రోడ్ లను పరిశీలించి, అభివృద్ధి పనులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తొలుత రోడ్ల అభివృద్ధికి, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ (ఏపియుఐఎయంయల్) ప్రతినిధులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను పరిశీలించారు. నగరంలోని ప్రధాన రహదారులను అంతర్జాతీయ ప్రమాణాలతో పచ్చని ల్యాండ్ స్కేపింగ్, వాహనాల పార్కింగ్, వెండింగ్ జోన్స్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్ తో డివైడర్స్, సైన్ బోర్డ్స్, బస్టాప్స్, సోలార్ బ్లింకర్స్, వివిధ ఆకృతులతో స్ట్రీట్ లైట్లు వంటి అంశాలతో సమగ్రమైన డిపిఆర్ సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ఏపియుఐఎయంయల్ ప్రతినిధులతో కలిసి నగరంలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించిన రోడ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారి సూచించిన అంశాలతో డిపిఆర్ త్వరగా చేయాలని ఏపియుఐఎయంయల్ వారిని ఆదేశించారు. ఈ పర్యటనలో జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఏపియుఐఎయంయల్ ప్రతినిధులు శ్రీ కమల్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఫైర్



గుంటూరు, మే 19,ప్రభాతవార్త :గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ ప్రక్రియ సరైన పద్ధతిలో జరగలేదని, రోడ్డు దాటిన తర్వాత రెండు లైన్లు ఒకవైపు, నాలుగు లైన్లు మరోవైపు కలిపి వార్డులు రూపొందించడం సరికాదన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత కమిషనర్, సీపీ సమక్షంలో సమీక్ష నిర్వహించి సరైన విధి విధానాలతో ముందుకు వెళ్తామని తెలిపారు.వైసీపీ నేత అంబటి రాంబాబు పై విమర్శలు గుప్పిస్తూ...ఆయన దగ్గర వెకిలితనం, అవహేళన, అపవాదులు మోపే తత్వం తప్ప మరేదీ లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న గల్ఫ్ యుద్ధాల కారణంగా పెట్రోల్ ధరలు స్వల్పంగా పెరిగినా, దానికీ కూటమి ప్రభుత్వాన్నే కారణమంటూ వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్ ధరలు భారీగా పెరిగినప్పుడు స్పందించని నాయకులు, ఇప్పుడు మూడు రూపాయల పెరుగుదల పై నిరసన కార్యక్రమాలు చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రజా సమస్యలను సానుకూలంగా ఆలోచించే బదులు, ఎప్పుడూ బురదజల్లే రాజకీయాలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు.

అమరావతి వార్త

## డ్రైన్‌లు పరిశీలిస్తున్న ఆర్డీవో



తిరువూరు, మే 19, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టౌన్ 1వ వార్డు కొత్త కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన ఆర్డీవో నగర పంచాయతీ ప్రత్యేక అధికారి ఎ.కుమార్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎందుకు మొదలు పెట్టలేదన్న వివరణ కాంట్రాక్టర్ దగ్గర నుండి తీసుకున్న ఆర్డీవో ఎ.కుమార్ వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన ఆర్డీవో ఎ.కుమార్ వెంట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మోదుగు వెంకటేశ్వరరావు వార్డులోని నాయకులు ఉన్నారు.

# జనాభా గణనలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

**జన గణనను క్షేత్ర స్థాయిలో తనిఖీ**
**జన గణన వేగవంతం పూర్తి కి**
**జీఎంసీ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ .యం.సాయి కాంత్ వర్మ పిలుపు**



గుంటూరు కార్పొరేషన్, మే 19 ( ప్రభాత వార్త ) : జనాభా గణనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని గుంటూరు నగర కార్పొరేషన్ ప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ పిలుపునిచ్చారు. గుంటూరు మండలం బుడంపాడులో జన గణనను జిల్లా కలెక్టర్ మంగళ వారం తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో చేపడుతున్న ప్రక్రియ, వేగవంతం చేయుటకు అవకాశాలు పరిశీలించారు. ఇళ్ళ వద్ద ఆయా యజమానులతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు మే 1వ తేదీన తమకు కేటాయించిన ఇళ్లను తమ ఎన్యూమరేషన్ కి సంబంధించి హద్దులు సరి చూసుకుని మే 30వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి, మ్యాప్ ఆధారంగా సరిహద్దులను గుర్తించి వారి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షి తంగా ఉంటుందన్నారు. సరైన సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితర ప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందన్నారు. జనాభా గణనలో వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు కోల్పోవడం జరగదని, ప్రజలందరూ ధైర్యంగా, ఖచ్చితమైన సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, తహసీల్దార్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**మత్స్యకార సేవ్వ లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ**
**జిల్లాలో 14,447 కుటుంబాలకు రూ. 28.89 కోట్ల సాయం**
**హాజరైన శాసనసభ్యులు నరేంద్ర వర్మ, మాలకొండయ్య**




బాపట్ల.మే19. ప్రభాతవార్త ప్రతినిధి:నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు ?చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాల్లో"మత్స్యకార సేవ్వ పథకం అమలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంటలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ రాష్ట్ర స్థాయి కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ హాల్‌లో వీక్షి ంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సముద్రంలో వేట నిషేధ కాలంలో (ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు) మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం నేరుగా"డిబిటి పద్ధతిలో భృతిని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. రాష్ట్రంలో దాదాపు 1000 కిలోమీటర్ల తీర ప్రాంతంలో మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా మత్స్య సంపద ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉందన్నారు.202526 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,73,957 మెట్రిక్ టన్నుల చేపలు, 1,90,187 మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో వేట నిషేధ భృతి కింద 14,447 మత్స్యకార కుటుంబాలకు రూ. 28.89 కోట్లను నేరుగా ఖాతాల్లోకి పంపటం జరిగిందన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 2,841 సముద్ర వేట బోట్లకు రూ. 1.89 కోట్ల ఆయిల్ సబ్సిడీ అందించానన్నారు విద్యుత్ సబ్సిడీ: ఆక్వా రైతులకు 9,340 కనెక్షన్లు ఇవ్వగా, అందులో 5,141 కనెక్షన్లకు రూ. 1.50 పైసలకే విద్యుత్ అందిస్తున్నారు. దీనిని నాన్‌ఆక్వా జోన్‌కు కూడా వర్తింపజేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆయన తెలిపారు. రూ. 450 కోట్లతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ఫేస్2 పనులు ప్రారంభమవగా, ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. సముద్ర నాచు సాగు: రాష్ట్రంలో ఎంపిక చేసిన 8 ప్రాంతాలలో ఒకటైన చిన్నగంజాం మండలం ఏటిమొగ గ్రామంలో సముద్ర నాచు మొక్కల పెంపకం జరుగుతోందని, దీనిపై మత్స్యకారులకు త్వరలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జిల్లాలో పర్యాటక రంగాన్ని దినదినాభివృద్ధి చేస్తున్నామన్నారు.త్వరలోనే కోస్టల్ రెగ్యులారిటీ జోన్ పరిధిలో అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మత్స్యకారులపై ప్రత్యేక ప్రేమతో అండగా నిలుస్తుందన్నారు. రేపల్లె, చీరాల, బాపట్ల ప్రాంతాల్లో సముద్రపు ఆటుపోట్లను తట్టుకుంటూ ప్రాణాలకు తెగించి వేట సాగించే మత్స్యకారులకు ఈ భృతి ఎంతో ఊరటనిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా రేపల్లె నియోజకవర్గంలో 8,339 మంది, బాపట్లలో 1,855 మంది, చీరాలలో 3,032 మంది, పర్చూరులో 1,221 మంది లబ్ధిదారులకు ఈ నిధులు అందుతున్నాయన్నారు. కోస్టల్ ఏరియాలో కొత్త కారిడార్, రీఫిల్డ్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. చీరాల శాసనసభ్యులు ఎం.ఎం. మాలకొండయ్య మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు సముద్రంలో ప్రాణాలు కోల్పోతే"చంద్రన్న బీమా కింద ప్రభుత్వం రూ. 10 లక్షల భారీ నష్టపరిహారం అందిస్తోందన్నారు. బోట్ల నిలుపుదలకు స్థలాలు కేటాయిస్తున్నామని, నియోజకవర్గాల్లో కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్ల ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు మాట్లాడుతూ.మత్స్యకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని, అధికారులు పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం వేట నిషేధ భృతికి సంబంధించిన రూ. 28,89,40,000 భారీ చెక్కును కలెక్టర్, శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, నాయకులు అనగాని శివప్రసాద్, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ రామకృష్ణ, నగేష్, డెల్టా ప్రాజెక్ట్ మేనేజర్ పంతాని మురళి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ గాలి దేవుడు, ఇతర అధికారులు మరియు మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వ్యర్థాల నిర్వహణపై ఉత్తమ విధానాలనను ప్రదర్శించిన మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర




విజయవాడ కార్పొరేషన్,మే 18,ప్రభాతవార్త:జాతీయ స్థాయిలో వ్యర్థాల నిర్వహణపై ఉత్తమ విధానాలను మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ప్రదర్శించారు. మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ అధ్వర్యంలో స్వచ్ఛ బారత్ మిషన్‌పై నిర్వహించిన జాతీయ స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. గత సమావేశంలో వ్యర్థపదార్థాల నిర్వహణలో విజయవాడ నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను జాతీయ స్థాయిలో ప్రదర్శించాలని కేంద్రమంత్రిత్వ శాఖ సూచించిన నేపథ్యంలో ఈ సమావేశంలో కమీషనర్ నగరంలో అమలు చేస్తున్న పారిశుద్ధ్య,చెత్త సేకరణ,తడి పొడి వ్యర్థాల వేరు నిర్వహణ, సేంద్రీయ ఎరువుల తయారీ,శాస్త్రీయ వ్యర్థాల ప్రాసెసింగ్ విధానాలను సమగ్రంగా వివరించారు. ప్రత్యేకంగా మూల స్థాయిలోనే వ్యర్థాల వేరు సేకరణ,తడి చెత్తను వర్మీ కంపోస్ట్ రూపంలో మార్చడం,నగర పార్కులు,హరిత ప్రదేశాల్లో ఆ సేంద్రీయ ఎరువుల వినియోగం,నిర్మాణ వ్యర్థాలతో నిర్మాణ వస్తువుల తయారీ,కొబ్బరి వ్యర్థాలతో కోకోఫిట్,కొబ్బరిపీచు,ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. నగరాన్ని పరిశుభ్రంగా పర్యావరణహితంగా తీర్చిదిద్దే దిశగా విజయవాడ నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలకు సంబంధించి అధికారులు ప్రశంసలు వ్యక్తం చేసినట్లు సమాచారం.అదే విధంగా దేశ వ్యాప్తంగా ఉత్తమ పారిశుధ్య నిర్వహణ పద్ధతులను అమలు చేస్తున్న వివిధ స్థానిక సంస్థలు తమ అనుభవాలు,వినూత్న విధానాలను ఈ సమావేశంలో పంచుకున్నాయి. వాటిని అధ్యయనం చేసి విజయవాడలో కూడా మరింత సమర్థవంతంగా విధానాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కమీషనర్లు డాక్టర్ డి.చంద్రశేఖర్,ఏ.రవీంద్రరావు,చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు,చీఫ్ ఇంజనీర్ (ఇంఛార్జి) పి.సత్యకుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం..

**మౌలిక వసతులకు కల్పనకు అధిక ప్రాధాన్యం**
**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**
**రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



గుంటూరు, మే 19,ప్రభాతవార్త :గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి వేగవంతం చేస్తున్నామని, ప్రధాన రహదారులను సైతం తీర్చిదిద్దుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక కాకుమాను వారి తోట 4/1 లైన్లో రూ.80 లక్షలతో సీసీ డ్రెయిన్, పొన్నూరు రోడ్డు లాల్ జాన్ బాషా పార్కు వద్ద రూ. 60 లక్షలతో డయా పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు మెయిన్ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మణిపురం బ్రిడ్జి నుంచి మారుతీ షోరూమ్ వరకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. రైల్వే అధికారులు నెహ్రూనగర్ నుంచి మోతీలాల్ నగర్ మీదుగా రామిరెడ్డి తోట వరకు చేపట్టిన డ్రెయిన్ ఇక్కడ కలుస్తుందని అన్నారు. గత పదేళ్లుగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి దూరమైన అన్ని ప్రాంతాలను ప్రగతి పథంలోకి తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అక్కడక్కడా ఇబ్బందులు వచ్చినా తాత్కాలికమేనని స్పష్టం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఇటు అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. యువత భవిత కోసం రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలతో పెట్టుబడులు తీసుకొస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలను ఎల్లప్పుడూ తాము అందుబాటులో ఉంటామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దళితుల పేరుతో ఓట్లు వేయించుకోని, వారినే వైసీపీ నాయకులు రాబందుల్లా పీక్కుతిన్నారు" ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యానికి**

**కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరిగింది - ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు, మే 19,ప్రభాతవార్త :దళితుల పేరుతో ఓట్లు వేయించుకోని, వారినే వైసీపీ నాయకులు రాబందుల్లా పీక్కుతిన్నారని, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యానికి కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరిగిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డి హయాంలో హత్యకు గురైన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డా.బీఆర్ అంబేద్కర్, వీధి సుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగావకాశాల దిశగా అద్భుతంగా ముందుకు సాగుతోందని అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతోందని, రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలు మరచిపోకూడదని, ముఖ్యంగా డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యను ఎలా వక్రీకరించారో, ఎలా కప్పిపుచ్చే ప్రయత్నం చేశారో ప్రజలందరూ చూశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు న్యాయం కోసం ఎన్నో సంవత్సరాలు పోరాడారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆ కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు.అధికార దర్పంతో నిండు ప్రాణాన్ని బలిగొని కూడా ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా వ్యవహరించిన తీరు ప్రజలు ప్రత్యక్షంగా చూశారని విమర్శించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను"నా ఆత్మబంధువులు" అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే వర్గాలపై దాష్టికాలకు పాల్పడ్డారని ఆరోపించారు.దళితులను ముందుకు తీసుకెళ్తామని చెప్పి ఓట్లు వేయించుకుని, చివరకు వారినే రాబందుల్లా పీక్కుతిన్నారు" అని ఎమ్మెల్యే తీవ్రంగా విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం ఉన్న నిధులను దారి మళ్లించారని, ఐదేళ్ల పాలనలో అణగారిన వర్గాలకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయలేదన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం జరిగిందని, వారి కుటుంబ సభ్యుడికి ఉద్యోగం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా దళిత సోదరులు ఇకపై మోసపూరిత నాయకత్వాన్ని నమ్మకూడదని సూచించారు. నాయకత్వం అంటే ప్రజలను గౌరవప్రదమైన స్థాయికి తీసుకెళ్లేదై ఉండాలని, కులాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు కోసం విభజించే రాజకీయాలు రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు.రాష్ట్రంలో ప్రజలందరినీ సమానంగా చూడాల్సిన అవసరం ఉందని, కేవలం కులాల పేరుతో రాజకీయాలు చేసి ప్రజలను వాడుకునే నాయకత్వం వల్లే రాష్ట్రం ఐదేళ్లు నష్టపోయిందన్నారు.

## లాసెట్ టాపర్ స్నేహను అభినందించిన భాష్యం చైర్మన్ రామకృష్ణ..

గుంటూరు విద్య మే 19 ప్రభాతవార్త: భాష్యం విద్యార్థులు సాధిస్తున్న విజయాలు భావితరాలకు ప్రేరణాత్మకంగా నిలుస్తున్నాయని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. మంగళవారం మెయిన్ క్యాంపస్ లో భాష్యం విద్యాసంస్థలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి లాసెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించిన ముప్పా స్నేహను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ న్యాయ విద్య కళాశాలల్లో ప్రవేశాలకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన లాసెట్, పీజీ లాసెట్2026 ప్రవేశ పరీక్షలో స్నేహ మొదటి ర్యాంకు సాధించడం గుంటూరు జిల్లాకే గర్వకారణమన్నారు. భవిష్యత్ లో యూపీఎస్సీ ద్వారా స్నేహ లక్ష్యం నెరవేరి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రామకృష్ణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహ తల్లిదండ్రులు ప్రదీప్ రావు దంపతులను భాష్యం ఐఐటి అకాడమీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం డీసీఓ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

6MN 6 PG-GNT_6MN 6 PG-GNT.qxd 5/20/2026 1:14 AM Page 1



## పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర ధరలను తగ్గించాలని నిరసన

కంచికచర్ల మే 19 ప్రభాతవార్త ప్రతినిధి: పెరిగిన పెట్రోల్, డీజిల్ గ్యాస్, నిత్యవసరాల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం కంచికచర్ల మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఐ యప్ టి యు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలపై భారం మోపే పెట్రోల్ డీజిల్గ్యాస్ నిత్స వసరాల ధరలను తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎప్టియు కంచికచర్ల మండల ప్రధాన కార్యదర్శి జి హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కితే ప్రజలపై పడిన భారాలు తగ్గుతాయా అని ప్రశ్నించారు. యుద్దం కారణంగా వచ్చిన సంక్షోభాన్ని నివారణ చర్యలు చేపట్టలేని కూటమి ప్రభుత్వం ప్రజలను మాత్రం పొదుపు కొనసాగించాలని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఇంధన ధరల పెంపు రాబోయే రోజుల్లో అన్ని రకాల నిత్యావసరాలు ధరలు పెరిగి సామాన్యులపై పెను భారం పడుతుందని అన్నారు. భారతదేశంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజల మౌలిక సౌకర్యాలను విస్మరించి, కార్పొరేట్ సామ్రాజ్య వాదులకు లాభాలు చేకూర్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రజా ప్రతినిధులను ప్రజలే ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం రెవిన్యూ ఆర్ ఐ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మండల ఐ ఎఫ్ టి యు అధ్యక్ష కార్యదర్శులు లక్కిశెట్టి ఆంజనేయులు, జి హరికృష్ణ రెడ్డి, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కంచిచర్లం మండల కమిటీ ఉపాధ్యక్షులు బండారు శీను, తోట కృష్ణ, ఉపుపతల శ్రీను, వెంకటకృష్ణ కంభంపాటి మాధవరాలు, పల్లె రాయప్ప, జిన్నెపల్లి స్వామి, ఎంద్రాతి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా బుక్ కీపర్ ను నిధులు నుండి తొలగించాలి....

కంచికచర్ల మే 19 ప్రభాతవార్త: తమకు రుణాలు మంజూరు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్న డ్వాక్రా బుక్ కీపర్ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ కంచికచర్ల అంబేద్కర్ వీవోకు చెందిన మహిలలు సోమవరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీ జీ ఆర్ యస్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాము కంచికచర్ల అంబేద్కర్ డ్వాక్రా వీ వో కు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల మని, ప్రభుత్వం డ్వాక్రాబుక్ కీపర్ సుశీల ప్రతి రుణానికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఎందుకు లంచాలు ఇవ్వాలని ప్రశ్నిస్తే, పై అధికారులకు ఇవ్వాలని అంటున్నారని, గట్టిగా ప్రశ్నించే బుక్ కీపర్ కుటుంబ సభ్యులు దూషణలకు దిగుతున్నారని వారు వాపోయారు. విచారణ నిర్వహించి బుక్ కీపర్ను విధుల నుంచి తొలగించాలని ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు.

## చలివేంద్రంలో వెయ్యిమందికి మజ్జిగ పంపిణీ..

ఎ కొండూరు, మే 19, ప్రభాతవార్త : ఎన్టిఆర్ జిల్లా మైలవరం వెల్వడం గ్రామ మెయిన్ సెంటర్లో లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో 1987-1992 విద్యాసంవత్సరాల్లో 6 నుండి 10వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సంఘం సాకారంతో మెయిన్ సెంటర్లో ఏర్పాట్లు చేసిన చల్లటి కూలింగ్ మంచినీటి చలివేంద్రంలో మంగళవారం పల్లెబోతుల రామకృష్ణ చిన్నకుమార్తె చిరంజీవి హర్షకేశవ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఈ కూలింగ్ మంచినీటి చలివేంద్రంలో సుమారు



వెయ్యి మంది ప్రజలు పాదచారులు ప్రయాణీకులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు విద్యార్థి సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్గెస్ట్గా స్థానిక పోస్టు మాస్టర్ జి.మౌనిక పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. గ్రామ విఆర్వో షేక్ కరీముల్లా పల్లబోతుల సాంబయ్య రామకృష్ణ వెల్లంకి శ్రీను గుర్రాల వెంకట కోటేశ్వరరెడ్డి గోపాలం మాష్టారు వేముల సూరయ్య పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు ముందుకు వస్తే ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేస్తామని పూర్వ విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. గ్రామ ప్రజలు, టిప్పర్ లారీల డ్రైవర్లు, ఆర్టీసి బస్సులు ఆటోలో ప్రయాణించే వారు ఆగి చల్లటి మజ్జిగ తాగి దాహార్తి తీర్చుకున్నారు. గూడూరు నాగిరెడ్డి పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధి, లకిరెడ్డి పాపులమ్మ జడ్పీ హైస్కూల్, ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ ట్రెజరర్లను అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్..

### - విద్యాశాఖాధికారులు ప్రజా ప్రతినిధులు

ఎ కొండూరు, మే 19, ప్రభాతవార్త :రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిపిలుస్తోంది చైతన్య విద్యారథం కార్యక్రమాన్ని ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు జీడీప హైస్కూల్లో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య ఇంకా ఇతర సౌకర్యాల గురించి ప్రజలకు ఈ అవగాహన కార్యక్రమం ద్వారా చైతన్యం చేశారు. చీమలపాడు హైస్కూల్లో విశాలమైన తరగతి గదులు ఐఎఫ్లు



ప్యానెల్ ద్వారా డిజిటల్ విద్య విశాలమైన ఆటస్థలం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ద్వారా విద్యాబోధన ద్వారా కార్పొరేట్ పాఠశాలల కంటే ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పర్చి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఈ హైస్కూలు ముందంజలో ఉందని విద్యాశాఖాధికారులు తెలిపారు. గ్రామంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉజ్వల భవిష్యత్ను తీర్చిదిద్దాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో జడ్పీటిసి మెంబర్ భూక్యా గనియా తిరువూరు డివైఇవో ఎ.శ్యామ్ సుందర్, ఎంఈవో ఎం.రాజశేఖర్, మాజీ సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు, క్లస్టర్ ఉపాధ్యాయులు చీమలపాడు క్లస్టర్ సిఆర్పి ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ మిల్క్ యూనియన్కు పాడిరైతులే శ్రీరామరక్ష.. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు వెల్లడి

ఎ కొండూరు, మే 19, ప్రభాతవార్త :పాడిరైతు సంక్షేమం మన మతం అలుపెరుగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం గన్నవరం క్లస్టర్ పరిధిలోని ఎన్టిఆర్ జిల్లా




తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కేశాతండా నూతన ఎంపిఎ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయలు సందర్శించారు. అనంతరం చీమలాడు గ్రామంలో కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతినిధులు సమితి సిబ్బందితో కలిసి గ్రామాల్లోని పాడిరైతుల ఇళ్లకు వెళ్లి రైతులను కలిసి ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్కు పాడి రైతులు శ్రీరామరక్ష పాడి రైతులకు అందిస్తున్న పాలధర బోనస్ రైతుల అభివృద్ధి పశు సంక్షేమ సేవలు పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. పాడి రైతుల సమస్యలను తెలుసుకుని మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమితి అధినేతలకు సిబ్బందికి చైర్మన్ ఆంజనేయులు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. చీమలపాడు పాలకేంద్రం వద్ద పాడిరైతులతో సమావేశమైన చైర్మన్ ఆంజనేయులు కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి పటిష్టతకు ప్రతి ఒక్కరు సహకరించాలని పాడి రైతుల సహాయ సహకారాలే కృష్ణామిల్క్ యూనియన్కు శ్రీరామరక్ష అని ఆంజనేయులు తెలిపారు. చీమలపాడు గ్రామంలో పాలకేంద్రం అధ్యక్షుడు మరీదు చలపతిరావు ఇంటికి వెళ్లి పాడి పరిశ్రమ నిర్వహణ తీరును అడిగి తెలుసుకుని అధ్యక్షుడు చలపతిని ప్రోత్సాహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఇన్చార్జ్ ఎస్.ప్రసాద్ లింగం, మేనేజర్ యశ్వంత్, వెటర్నరీ డాక్టర్ రాజేష్, సంఘ అధ్యక్షుడు మరీదు చలపతిరావు, పాలకవర్గ సభ్యులు, సూపర్వైజర్లు, పాడిరైతులు వేతన కార్యదర్శి బెజవాడ పూర్ణచంద్రరావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నీటి ప్రవాహం కోసం కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు

విజయవాడ కార్పొరేషన్,మే 18,ప్రభాతవార్త: నీటి ప్రవాహం సజావుగా సాగడానికి గాను,వర్షాకాలంలో నగరంలోని కాలువల్లో నీరు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రవహించడానికి గాను అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అధికారులు అంబాపురం పరిసర ప్రాంతాల్లోని కాలువల్లో ఉన్న గుర్రపుడెక్కలను లాంగ్ ఆర్మ్తో ప్రజారోగ్య సిబ్బందిచే తొలగింప చేశారు.

## దేవాలయ భూముల కాపాడాలంటూ ఆమరణ దీక్ష

మచిలీపట్నం, మే 19 (ప్రభాతవార్త):కృష్ణాజిల్లా గూడూరు మండలంలోని దేవాయ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ పెడన జనసేన పార్టీ నాయకులు గూడూరు గ్రామంలో మంగళవారం నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. జనసేన పార్టీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన హరిరామ్ నేతృత్వంలో జనసేన నాయకులు రాజులపాటి జమదగ్ని, సమ్మెట గణపతిరావు, చీర్ల నవీన్ కృష్ణ, ముదినేని రామకృష్ణ తదితరులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినవారిలో ఉన్నారు. గూడూరు గ్రామంలోని వెంకమ్మ పేరంటాలు దేవాలయ భూములు, కంకటావ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర వేణుగోపాల వెంకటాచల స్వామి వార్ల




దేవస్థాన భూములలోనూ మట్టి అక్రమ తవ్వకాలు చేపడతున్నారని, ఈ విషయమై దేవాదాయశాఖ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జనసేన నాయకులు బత్తిన హరిరామ్ తెలిపారు. పంటలు పండే దేవాలయ భూములలో మట్టిని తవ్వి ఎందుకు పనికిరాని భూములుగా తయారు చేస్తున్నారని, ఫలితంగా ఆలయ భూములకు రావాల్సిన కౌలు నిలిచిపోతోందని వాపోయారు. దేవాలయ భూముల నుంచి అక్రమంగా మట్టి తోలుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో దేవాదాయశాఖ అధికారులతో పాటు జిల్లా అధికార యంత్రాంగం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ విషయమై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు వివరించారు. కాగా, ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన జనసేన నాయకులకు జిల్లా కార్యవర్గం మద్దతు పలికింది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బట్టు లీలా కనకదుర్గ, పలువురు విశ్వ హిందూ పరిషత్ నాయకులు, హిందూ ప్రజా వేదిక కృష్ణాజిల్లా అధ్యక్షులు నాదెళ్ల కోటేశ్వరరావు, సభ్యులు పెద్ద ఎత్తున వచ్చి మద్దతు తెలియచేశారు.

## రైల్వేపై వంతెనల పనులు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మే 19 (ప్రభాతవార్త): రైల్వే పై వంతెనల పనులు సమన్వయంతో వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని డిఆర్వో ఛాంబర్ లో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి సంబంధిత




అధికారులతో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద పై వంతెనల నిర్మాణపనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 67 రైల్వే లెవెల్ క్రాసింగ్ లకు గాను ప్రభుత్వం 19 రైల్వే లెవెల్ క్రాసింగ్ ల వద్ద రైల్వే పైవంతనలు నిర్మాణ పనులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రెవెన్యూ, గ్రామీణ రహదారులు, రహదారులు భవనాలు, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైల్వే శాఖకు స్థలాలను అప్పగించాలన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు పై వంతెన నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడైనా మంచినీటి పైపులు వగైరా ఉంటే వాటిని కూడా పక్కకు తొలగించాలని అందుకు అయ్యే అంచనాల నివేదిక అందజేయడంతో పాటు లేదా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు. విద్యుత్ స్తంభాల మార్పిడికి విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం ఆర్డిఓ సాంబశివరావు, విద్యుత్ శాఖ ఎస్.డి.సి. పోతురాజు, రహదారులు భవనాల శాఖ ఈఈ లోకేష్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్.ఈ సోమశేఖర్, విజయవాడ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుని అరెస్ట్

### 85 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

విజయవాడ కార్పొరేషన్,మే 19,ప్రభాతవార్త:సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు క్రైం డిసిపి కె.తిరుమలేశ్వరరెడ్డి సూచనలతో క్రైం ఎడిసిపి ఎం.రాజారావు అధ్వర్యంలో క్రైం ఎసిపి వెంకటేశ్వర్లు,సిఐ ఎం.కిషోర్బాబు వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పగలు



సమయాల్లో జరిగే చోరీలను నివారించడంలో ప్రత్యేక దృష్టి సారించారు. చోరీ కేసుల్లో సంఘటనా స్థలానికి చేరుకొని, సాంకేతిక ఆధారాలను సేకరించి, అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని క్రైం ఎడిసిపి ఎం.రాజారావు తెలిపారు. ఈ నేపథ్యంలో సిసియస్ సిఐ ఎం.కిషోర్బాబు,మాచవరం క్రైం ఎస్ఐ శంకరరావులకు రాబడిన సమాచారం మేరకు వారి సిబ్బందితో కలిసి మాచవరం పోలీస్ స్టేషన్ పరిధి లోని క్రీస్తురాజపురం ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో అతని పేరు గొల్ల వెంకేష్అని వాంబేకాలనీ అని ప్రస్తుతం అతను క్రీస్తురాజపురంలో నివసిస్తున్నాడని సమాచారం రాబట్టారు. అతని వద్ద నుండి సుమారు 12.75 లక్షల విలేవైన 85 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. గొల్ల వెంకటేష్ చిన్నప్పటి నుండి చెడు వ్యసనాలకు అలవాటు పడి జల్సాలు చేయడం చేస్తుండేవాడు.న ఈ క్రమంలో ప్రతి రోజు కూలిపనులు చేసుకొనటా వచ్చిన డబ్బులు సరిపోక ఏ విధంగానైనా సులభంగా డబ్బు సంపాదించి విలాసాలు చేయడానికి చోరీలు చేయడం ఎంచుకొని తాను నివసించే ఇంటి సమీపంలోని పగలు ఇంటిలో వారు ఎవ్వరూ ఇంటిలో లేని సమయాన్ని ఆసరాగా చేసుకొని లోనికి ప్రవేశించి ఇంటిలోని బంగారపు ఆభరణాలను దొంగిలించి పరారయ్యాడు. ఈ చోరీతో పాటు మరో రెండు చోరీలు,గతంలో సత్యన్నారాయణపురం పరిధిలో చేసినట్లు వెల్లడైంది. చోరీ కేసులో నిందితుని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిపియస్ సిఐ ఎం.కిషోర్బాబు,మాచవరం క్రైం ఎస్ఐ శంకరరావు,వారి సిబ్బందిని నగర పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా సుందరయ్య వర్ధంతి

తిరువూరు, మే 19, ప్రభాతవార్త : దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎస్.నాగేశ్వరరెడ్డి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ స్వాతం



త్రం కోసం పోరాడిన మహోన్నత నేత సుందరయ్య అని నాగేశ్వరరెడ్డి అన్నారు. తన జీవితాన్ని కార్మికుల, కష్టజీవుల రాజ్యం స్థాపనకు అంకితమైన సుందరయ్య అంకితం చేశారన్నారు. అంటరాని తనానికి, కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన నేతన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సభ్యులు పి.శీనయ్య, జెవివి నాయకులు ఎం.సుధాకర్, ఎం. హరికృష్ణ, ఎం.నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## మనుబోలు శ్రీనివాసరావు పుట్టినరోజులు వేడుకలు

తిరువూరు, మే 19, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లాజనసేన పార్టీ కార్యాలయం విజయవాడలో మంగళవారం సాయంత్రం తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు పుట్టినరోజులు వేడుకలు ఘనంగా నిర్వహించిన జనసైనికులు విజయవాడలోని జిల్లా కార్యాలయంలో తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావుతో కేక్ కటింగ్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన నాయకులు తిరువూరు నియోజకవర్గ నాలుగు మండలాల అధ్యక్షులు టౌన్ నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు మనుబోలు శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## బష్ నుండి కొత్త టాప్ లోడ్ వాషింగ్ మెషీన్లు

విజయవాడ, మే 19, ప్రభాతవార్త : 10 ఇంటెలిజెంట్ వాష్ ప్రోగ్రామ్స్, రకరకాల బట్టలు ఉతికే అవసరాలకు తగ్గట్టు ప్రత్యేక సంరక్షణ అందించేలా 7నుండి 12 కిలోల వరకు కెపాసిటీతో టాప్ లోడ్ వాషింగ్ మెషీన్లు విడుదల చేసినట్లు బష్ హోమ్ అప్లిన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి అండ్ సిఈవో సైఫ్ఖాన్ తెలిపారు. జర్మన్ ఇంజనీరింగ్ తోడ్పాటుతో మా మేక్ ఇన్ ఇండియా, ఫర్ ఇండియా కోసం ఈ వాషింగ్ మెషిన్లు రూపకల్పన చేశామన్నారు.

## పేర్ని నాని, అంబటిపై ఘాటు విమర్శలు చేసిన జనసేన నాయకులు

పెనమలూరు మే 19 ప్రభాతవార్త : పెట్రోల్ పెంపుపై నిరసన వ్యక్తం చేసిన వైసీపీ నాయకులపై మంగళవారం పెనమలూరు నియోజకవర్గ జనసేన నాయకులు తీవ్రస్థాయిలో ఘాటు వ్యాఖ్యలు




చేశారు. పెనమలూరు నియోజకవర్గ జనసేన నాయకులు నెరసు కృష్ణాంజనేయులు సమ్మెట సుధాకర్ ఆధ్వర్యంలో పెనమలూరు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేర్ని నాని జనసేన కార్యకర్తలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ద్వారా కాపులను తూరపు ముక్క లాగా ఆడిస్తున్నాడని పేర్ని నాని మాట్లాడడం అతని అవగాహన లేమి కి అద్దం పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాపులందరూ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం వైసిపి జీర్ణించుకోలేకపోతుందని వాళ్లకి ప్రజా సమస్యలపై కంటే పవన్ కళ్యాణ్ కాపులపైనే ఎక్కువగా శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. బందర్ ను పరిపాలించిన పేర్ని నాని తండ్రి బందరుకు గాని కాపులకు గాని ఏం చేశారో చెప్పాలన్నారు. పేర్ని నాని రవాణా శాఖ మంత్రిగా ఉండి కూడా కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని పవన్ కళ్యాణ్ కృషి వల్లనే దేశంలోనే పంచాయతీరాజ్ శాఖకు ప్రథమ స్థానం వచ్చిందని గుర్తు చేశారు. వైసీపీ నేత అంబటి రాంబాబు నీటిపారుదల శాఖ మంత్రిగా కంటే నోటిపారుదల శాఖ మంత్రి గానే ప్రజలందరికీ సుపరిచితుడని ఎద్దేవా చేశారు. ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనగా భారతదేశమంతటా పెట్రోల్ రేటు పెరగగా అది గ్రహించలేని వైసిపి ఒక్క మన రాష్ట్రంలోనే పెరిగాయి అన్నట్లు నిరసనలు వ్యక్తం చేయడం వారి అవగాహన లేమి కి నిదర్శనమని తెలిపారు. పెనలూరు నియోజకవర్గ జనసేన నాయకులు సమ్మెట సుధాకర్ మాట్లాడుతూ రాజకీయ నిరుద్యోగుల పార్టీ ఏదైనా ఉంది అంటే వైసీపీ పార్టీయే అని ఆయన విమర్శించారు. 2014లో 200 ఉన్న గ్రీన్ టాక్స్ ను వైసిపి ప్రభుత్వం వచ్చాక మినిమం 7000 చేయడంతో ఎందరో లారీ యజమానులు వాహనాలు అమ్ముకున్న పరిస్థితి ఉందన్నారు. కౌలు రైతులకు సొంత డబ్బులు ఇచ్చినా ఘనత ఒక పవన్ కళ్యాణ్ కి దక్కుతుందని తెలిపారు పేర్ని నాని అంబటి రాంబాబు పనికట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు రాజధాని అభివృద్ధిని వారు లేక వైసిపి బురద జల్లుతోందని ఒకసారి అమరావతికి వెళ్లి చూస్తే అర్థమవుతుందని రాజధాని గురించి మాట్లాడే అర్హత వైసిపి వాళ్లకు లేదని కచ్చితంగా తెలిపారు.

## దుబాయ్ చాంబర్ ఆఫ్ కామర్స్లో భారత కంపెనీల చేరిక

విజయవాడ, మే 19, ప్రభాతవార్త : దుబాయ్ చాంబర్ ఆఫ్ కామర్స్, క్యూ1 2026లో 3,995 కొత్త భారతీయ కంపెనీలు చేరికతో మార్చి 2026 చివరి నాటికి దుబాయ్ చాంబర్ ఆఫ్ కామర్స్లో క్రియాశీల సభ్యులుగా నమోదైన భారతీయ కంపెనీల మొత్తం సంఖ్య 84,088కు చేరుకుందని దుబాయ్ చాంబర్స్ ప్రెసిడెంట్, సీఈఓ హెచ్.ఈ. మొహమ్మద్ అలీ రషీద్ లూటా తెలిపారు. రోజురోజుకీ క్లిష్టంగా మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్పష్టత విశ్వసనీయతతో పాటు వ్యాపార కార్యకలాపాలను నిరంతరంగా కొనసాగించే సామర్థ్యం అందించే మార్కెట్లకు కంపెనీలు మరింత ప్రాధాన్యం ఇస్తున్నమన్నారు.

## కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

పెనమలూరు మే 19 ప్రభాతవార్త : దక్షి ణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలు సిపిఎం పార్టీ కృష్ణాజిల్లా పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. పెనమలూరు నియోజకవర్గంలో తాడిగడప, యనమల కుదురు, వణుకూరు, యనమలకుదురు, పెనమలూరు, పలు ప్రాంతాల్లో పెనమలూరు మండల కార్యదర్శి షేక్



ఖాసిం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందర ఆశయాలుకు అనుగుణంగా పార్టీ సభ్యులు నిబద్ధతతో పనిచేయాలని కోరారు నేడు దేశంలో మతోన్మాద రాజకీయాలు కార్మిక వ్యతిరేక చట్టాలు రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేసే విధానాలు పేదలను దోచుకుని కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతున్న వైనాన్ని ఆయన వివరించారు దేశానికి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులే భవిష్యత్తు అని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు షేక్ మస్తాన్ వలి, పి లక్ష్మీ ్మనారాయణ, వీసం సోమశేఖర్, పాతాళ లక్ష్మి ్మ, పి సత్యనారాయణ,లక్ష్మీ ్మ ప్రసన్న, ప్రసాద్,సింహాచలం, మోహన్,రమణమ్మ, పాపారావు లు పాల్గొన్నారు

## ఆర్ఆర్ రాజును అసెంబ్లీ నుండి తక్షణం బర్తరఫ్ చేయాలి

విజయవాడ, మే 19, ప్రభాతవార్త క్రైస్తవ మైనార్టీలపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన ఏపి అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణం రాజును వెంటనే బర్తరఫ్ చేయాలని పాస్టర్




జెమ్స్ కుంపట్ల డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మత రాజకీయాల వల్ల అశాంతి, రాజకీయ కలకలం రేగుతున్నట్లు తాము బీమవరం కలెక్టర్కు ఫిర్యాదు చేసినా ఫలితం లేనందున మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమస్య పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చామని, క్రిస్టియన్ మైనారిటీ సొసైటీ సభ్యులతో, క్రైస్తవ సమాజ నాయకులతో చర్చలు జరపాలని కోరామన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే ఢిల్లీలో, రాష్ట్రంలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి నిరసన తెలుపుతామని, కోర్టులను కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జి అరుల్ అరుసు, కె ఈశ్వర్ డేనియల్, ఎస్. హనీ జాన్సన్ పాల్గొన్నారు.

## నా బిడ్డకు రక్షణ కల్పించాలి

విజయవాడ, మే 19, ప్రభాతవార్త తమ బాకీ తీర్చమని కోరితే రౌడీలతో కలిసి చంపేస్తామని బెదిరిస్తున్నారని, తమ కుటుంభానికి, తన బిడ్డకు రక్షణ కల్పించాలని నందిగామకు చెందిన షేక్ హసీనా కోరారు. విజయవాడ ప్రెస్క్లబ్లో ఆమె మీడియాతో మాట్లాడుతూ మొబైల్ షాపు నడుపుకునే తన కుమార్డు షేక్గౌస్ తమకుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంట్లో నగలు తాకట్టుపెట్టి రు.75 లక్షలు అప్పుగా ఇచ్చాడని, ప్రాంసరీనోట్లు, అగ్రిమెంట్, ఖాళీ చెక్కులు వారు ఇచ్చారన్నారు. తమ డబ్బులు తమకు కట్టమని అడిగితే కోరగా వారు కట్టలేదని దాంతో తాము కోర్టులు కేసు వేశామని, అప్పటినుండి చాణిక్య రెడ్డిపల్లి పండు, ప్రేమ్ అనే వ్యక్తులు కొత్త కొత్త నంబర్స్నుండి ఫోన్ చేసి తమను భయభ్రాంతులను చేస్తున్నారని వాపోయారు. తమకు ముఖేష్ కుమార్ జైన్ నుండి రక్షణ



# రూ.2.25 కోట్ల విలువైన 1125 మొబైల్స్ రికవరీ

## బాధితులకు 166 ఫోన్లు అందజేసిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

## రికవరీ రేటు 30 నుంచి 70 శాతానికి పెంపు

### ఆధారాలు లేకుండా సెకండ్ హ్యాండ్ ఫోన్ల లాక్ తీస్తే చర్యలు



బాపట్ల.మే 19: ప్రభాతవార్త ప్రతినిధి: సరైన ఆధారాలు, బిల్లులు లేకుండా మొబైల్ షాపుల నిర్వాహకులు సెకండ్ హ్యాండ్ ఫోన్ల లాక్‌లను ఓపెన్ చేయరాదని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఖీ5వ విడత మొబైల్ రికవరీ, పంపిణీఖీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక బృందాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా రికవరీ చేసిన రూ.33.20 లక్షల విలువైన 166 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ గారు బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగమైందని, వ్యక్తిగత సమాచారంతో పాటు బ్యాంకింగ్, విద్య, వ్యాపార లావాదేవీలు దీనిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. ఫోన్ పోగొట్టుకుని ఆందోళనలో ఉన్న బాధితులకు అండగా నిలిచేందుకు జిల్లాలో సీఐ స్థాయి అధికారి నేతృత్వంలో నిపుణులైన సిబ్బందితో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు 5 విడతల్లో మొత్తం రూ.2 కోట్ల 25 లక్షల విలువైన 1125 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు.గతంలో 30 శాతంగా ఉన్న రికవరీ రేటును, ప్రత్యేక చర్యల ద్వారా 70 శాతానికి పెంచగలిగామని, భవిష్యత్తులో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లోని ఫోన్లను సైతం అక్కడి పోలీసుల సమన్వయంతో ట్రేస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబరు, కొనుగోలు బిల్లు లేదా బాక్స్ వివరాలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిచిత, అనుమానాస్పద వ్యక్తుల నుంచి సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయవద్దన్నారు. పత్రాలు లేకుండా సెకండ్ హ్యాండ్ ఫోన్ల లాక్ ఓపెన్ చేయడం, దొంగిలించిన ఫోన్లను విక్రయించడం లేదా కొనడం చట్టరీత్యా నేరం. వీటివల్ల క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రత్యేక బృందానికి అభినందనలు మొబైల్ ఫోన్లను సమర్థవంతంగా రికవరీ చేసిన సోషల్ మీడియా సీఐ వి.సూర్యనారాయణ, వారి ప్రత్యేక బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# ప్రతిభను యుటిఎఫ్ ప్రోత్సహిస్తుంది




కర్లపాలెం. మే19. ప్రభాతవార్త: ప్రతిభను యుటిఎఫ్ ప్రోత్సహిస్తుందని బాపట్ల జిల్లా యుటిఎఫ్ కోశాధికారి ఎం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.మంగళవారం కర్లపాలెం మండలములో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సహిస్తూ యుటిఎఫ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైసం చేసుకున్న విద్యార్థిని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను యుటిఎఫ్ శాఖ వారు కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలోమండల యుటిఎఫ్ శాఖ అధ్యక్షులు బివి శ్రీనివాస్, కార్యదర్శి వై వి నారాయణ, సిహెచ్ ప్రభాకర్ బాబుజి రెడ్డి. అజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి ,గణపతి రెడ్డి గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

## కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను జోడించాలి




బాపట్ల.మే 19. ప్రభాతవార్త ప్రతినిధి: సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షి ంచేది లేదని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం బాపట్లలోని స్థానిక క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ఆయన సుదీర్ఘంగా నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణ, పెండింగ్ కేసుల పురోగతి, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఫోక్సో కేసులు, గంజాయి కట్టడి, స్మార్ట్ పోలీసింగ్ యాప్స్ వినియోగం, రోడ్డు భద్రత తదితర పలు అంశాలపై ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉన్న వివిధ కేసుల పురోగతిపై ఆరా తీశారు. కేసులను పారదర్శకంగా, వేగంగా విచారించి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కా సా ధారాలతో నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి, కోర్టుల్లో చార్జ్ షీట్ దాఖలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే తమ ప్రధాన లక్ష ్యమన్నారు.మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, విద్యాసంస్థల పరిసరాల్లో నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. యువత, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కేసుల ఛేదనలో, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించాలనిఇందులో భాగంగా ఖీస్మార్ట్ పోలీసింగ్ యాప్స్ఖీను సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలను నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు.

### రోరక్షప్రాణరక్షపై అవగాహన

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రవేశపెట్టిన శిరోరక్ష ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రేపల్లె, బాపట్ల, చీరాల, సిసిఎస్ డీఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, సిహెచ్.చంద్రమోళి, ఎండి.మోయిన్, శ్రీ పి.జగదీష్ నాయక్ లతో పాటు జిల్లాలోని సిఐలు, ఆర్.ఐ, ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టాటా ఏస్ వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి





గురజాల, మే 19 ప్రభాతవార్త : టాటా ఏస్ వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందిన సంఘటన గురజాల పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో గురజాల - మాచర్ల జాతీయ రహదారిపై ఉన్న గేదెలను టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి.

# 31న చలో మంగళగిరి ..

## యాదవ మహా ధర్నా.. పోస్టర్ ఆవిష్కరణ.

గుంటూరు విద్య మే 18 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ ఆధ్వర్యంలో గుంటూరు బ్రాడీపేట తాలూకా కాంపౌండ్ లో గల ప్రభుత్వ పెన్షనర్స్ హాలు నందు యాదవ మహా ధర్నా పోస్టర్ ను ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్ ను ఆవిష్కరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్ కు 6000 కోట్ల నిధులు కొరకు, రాజధాని ప్రాంతం లో 10 ఎకరాల భూమిలో 100 కోట్లతో యాదవ భవనం మరియు యాదవ విద్యార్థుల కొరకు హాస్టల్ వసతి, గృహ భవన నిర్మాణం కోసం, ఆవులు గేదెలు మేకల కొనుగోలు కోసం హామీ లేని సబ్సిడీ రుణాలు కొరకు డిమాండ్ చేస్తూ మే నెల 31వ తేదీన ఆదివారం అమరావతి రాజధాని ప్రాంతం మంగళగిరిలో యాదవ మహా ధర్మ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యాదవ హక్కులను అందరూ కలిసి ఐకమత్యంగా పోరాడి సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు ఉగ్గం సాంబశివరావు యాదవ్, అంగిరేకుల వర ప్రసాద్ యాదవ్, ఆలా రామకృష్ణ యాదవ్, కోనంకి మురళీకృష్ణ యాదవ్, లక్షీ ్మప్రసన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు అవగాహన...లో హాస్యవల్లరి

గుంటూరు కల్చరల్,మే 19,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 16సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న హాస్యవల్లరి కార్యక్రమం బుధవారం సాయంత్రం 6.30గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించబడుతుందని సంస్థ కార్యదర్శి తెలిపారు.'హాస్యమే దివ్యఔషధం అంటున్న వివిధ రంగాల ప్రముఖుల మాటల ప్రకారం ప్రతినెలా నిర్వపించబడుతున్న ఈ కార్యక్రమంలో జోక్స్,కామెడీ స్కిట్స్,మిమిక్రి,మ్యాజిక్,హాస్య,వ్యంగ్య కవితలు తదితరాలతో హాస్యప్రియులందర్ని ఆనందింపచేస్తారు.నవ్వునవ్వించే పేరుతో నిర్వహించబడే ఈ 140వ హాస్యవల్లరి కార్యక్రమానికి

# 50 శాతం పెంపుతో నైనా చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు

## - కేసన శంకరరావు



మంగళగిరి, మే 19, ప్రభాతవార్త: లోక్ సభశాసనసభల్లో ఇప్పుడున్న సీట్లను 50 శాతం పెంచుతూ బిల్లులు తీసుకురావాలని యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఓబీసీలకు కూడా వారి జనాభా దామాషా మేరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించేలా బిల్లులు ప్రతిపాదించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా వారు గతంలో జనాభా దామాషా మేరకు డీలిమిటేషన్ ప్రక్రియ తో చట్టసభల సీట్ల పెంపు,మహిళా రిజర్వేషన్ బిల్లులు ఆమోదింప చేసుకోవాలని కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం విధితమేనన్నారు. చట్టసభలలో సీట్ల పెంపు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు అమలు జరిపేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం మళ్లీ సిద్ధపడుతున్న వేళ,అన్ని రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యులందరూ ముఖ్యంగా ఓబీసీ వర్గానికి చెందిన పార్లమెంటు సభ్యులు చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లతో పాటు, ఓబీసీ మహిళకు సబ్ కోటా ఉండేలా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించేలా తోడ్పాటు నందించాలని కోరుకుంటున్నామన్నారు. రాష్ట్ర డబుల్ ఇంజన్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వ అధినేతగా, బీసీల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా పేరొందిన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధతో బాధ్యత తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటు సభ్యులందరితో ఆమోదింపజేసేలా కృషిచేసి,ఓబీసీల ఉద్యమ చరిత్ర పుటలలో శాశ్వతంగా నిలిచిపోవాలని శంకరరావు ఆకాంక్షి స్తున్నామన్నారు.. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు దోకిపర్తి శ్రీనివాసరావు, జిల్లా యువజన నాయకులు ధనుంజయ రావు, దానా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# గోవాడ సరోజినీకి దేశం తమ్ముళ్లు నివాళులు



మంగళగిరి, మే 19, ప్రభాతవార్త: మంగళగిరి ఆంజనేయ కాలనీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవాడ రవి, దుర్గారావు( గోవాడ బ్రదర్స్) మాతృమూర్తి స్వర్గీయ గోవాడ సరోజిని నాలుగో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం హాజరయ్యారు. స్వర్గీయ సరోజిని చిత్రపటానికి గుత్తికొండ, ఇబ్రహీం, టీడీపీ నాయకులు, కాపు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గుత్తికొండ మాట్లాడారు. సరోజిని భర్త స్వర్గీయ గోవాడ నాగభూషణం వారి కుమారులు గోవాడ బ్రదర్స్ వరకు గోవాడ కుటుంబం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీని అంటిపెట్టుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నంగి శివ శేషగిరిరావు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్, టీడీపీ నాయకులు షేక్ రియాజ్, అలుగూరి వీరాంజనేయులు, రంగిశెట్టి పెద్దబ్బాయి, అలుగూరి రాజశేఖర్, మల్లెల మణికంఠ, కొడాలి కామేశ్వరరావు, గోలి మోహనరావు, గోవాడ వెంకటలక్షి ్మ, కొల్లి వాణిశ్రీ, జొన్నాధుల నాగ మల్లేశ్వరరావు,యేమినేని రామ్మోహన్ గౌడ్,అద్దంకి రవికాంత్ పాల్గొన్నారు.

# కాజా గ్రామంలో ఉచిత టీకాలు, మందులతో పశువైద్య శిబిరం




మంగళగిరి, మే 19, ప్రభాతవార్త :పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాడి రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటాడని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష ్యమని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు.. ..మంత్రి స్థానిక శాసనసభ్యులు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షులు నారా లోకేష్.. ఆదేశాలతో మంగళవారం మంగళగిరి మండలం కాజ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రారంభించారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో పశువులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ, టీకాలు, గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు.అలాగే పశువుల పోషకాహారం, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు..శిబిరంలో నిపుణులైన పశువైద్యులు పశువులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, టీకాలు అందజేసినట్లు తెలిపారు. గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణతో పాటు పశువుల పోషకాహారం, గురించి రైతులకు వివరించినట్లు ఆయన చెప్పారు ..కాజ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల పాడి రైతులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని జవ్వాది కిరణ్ చంద్ తెలిపారు...ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గాదె పిచ్చిరెడ్డి, యార్డ్ డైరెక్టర్లు నైనాల లావణ్య, బైరబోయిన పద్మ , కంకణాల శంకర్, బైరబోయిన శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ సెక్రటరీ పి .ప్రభారాణి, ఎడి రాధాకృష్ణ మూర్తి,డాక్టర్ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# చింతలతండాలో పోలీసుల కార్డన్ సెర్చ్



విజయపురిసౌత్, మే 19 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ ఆదేశాల మేరకు మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో మంగళవారం ఉదయం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీస్‌బాషా నేతృత్వంలో విజయపురిసౌత్ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో 24 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలు, 1 ట్రాక్టర్, 14 గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ సీఐ మహమ్మద్ నజీర్‌బేగ్, ఆరుగురు ఎస్సైలు, 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



గురజాల, మే 19 ప్రభాతవార్త : రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలిపారు. గురజాల నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులు, తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించారు.

# రజకుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి



గురజాల, మే 19 ప్రభాతవార్త : దాచేపల్లి పట్టణంలోని భాస్కర కళానయణ మండపంలో ఈనెల 24వ తేదీన జరగనున్న రజకుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రజక సంఘ సీనియర్ నేత అక్కినపల్లి బాలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సమావవేశానికి హాజరుకావాలని కోరారు. రజక జాతి సుధీర్ఘ పోరాటం ఎస్సీ జాబితాలో చేర్చే అంశాలు, ఉమ్మడి గుంటూరు జిల్లా పదో తరగతిలో 550 మార్కులపైగా సాధించిన రజక విద్యార్థుల అభినందన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నేతలు మక్కెన శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బండి రవి, కోయ పుల్లారావు, బండి శ్రీను, కోయ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగ

గురజాల, మే 19 ప్రభాతవార్త : గురజాల మండలంలో మంగళవారం గరిష్టంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుషంగా మారాయి. ప్రజలు వేడి గాలులు, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రానున్న మూడు రోజుల్లోనూ 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4

# అధికారుల నిర్లక్ష్యానికి ఒకరు బలి

## -హెచ్చరిక బోర్డులు లేని మున్సిపల్ కుంటలోకి దూసుకెళ్లిన బైక్

## -పసుమర్తి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ అక్కడికక్కడే మృతి

## -గుంతలు తీసి 15రోజులైనా పట్టించుకోని వైనం-స్థానికుల తీవ్ర ఆగ్రహం



చిలకలూరిపేట, మే 19, ప్రభాతవార్త: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల బాధ్యతారాహిత్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. రోడ్డుపై ఎలాంటి హెచ్చరికలు, బ్యారికేడ్లు లేకుండా వదిలేసిన ఓ భారీ కుంటలో బైక్ దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం చిలకలూరిపేట పట్టణంలోని చీరాల రోడ్‌లో అర్ధరాత్రి చోటుచేసుకుంది.అర్ధరాత్రి వేళ ఘోర దుర్ఘటన ఇది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పసుమర్తి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ (40), హమీద్ (42) పట్టణంలో ముఠా పని ముగించుకుని అర్ధరాత్రి వేళ బైక్‌పై తిరిగి తమ గ్రామానికి బయలుదేరారు. చీరాల రోడ్‌లో మున్సిపల్ సిబ్బంది పైపులైన్ పనుల కోసం రోడ్డు



మధ్యలో ఒక భారీ కుంటను తవ్వారు. అయితే, అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు లేదా రాత్రి వేళల్లో కనిపించే కనీస లైట్లను కూడా ఏర్పాటు చేయలేదు. చీకట్లో రోడ్డుపై ఉన్న కుంట కనిపించకపోవడంతో వీరి బైక్ నేరుగా అందులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద తీవ్రతకు ఇద్దరూ బైక్ పైనుంచి రోడ్డుపై బలంగా పడిపోయారు. తలకు తీవ్ర గాయమవ్వడంతో షేక్ మహమ్మద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, హమీద్ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడాడు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన హమీద్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. సుమారు 15 రోజులైనా పూడ్చని వైనం! పట్టణంలో జరుగుతున్న పైపులైన్ పనుల్లో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటలు తీసి 15 రోజులవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడుతున్నారు.రోడ్డు తవ్వితే కనీస భద్రతా చర్యలు తీసుకోవాలి కదా..? అక్కడ ఒక సూచిక బోర్డైనా పెట్టి ఉంటే మా వ్యక్తి ప్రాణం పోయేదా..?" అంటూ మృతుడి బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.కాంట్రాక్టర్లు తమ ఇష్టం వచ్చినట్లు రోడ్లు తవ్వేసి, పనులు ముగిసినా ఎప్పుడో గానీ గుంటలు పూడ్చడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలోనూ పట్టణంలో ఇలాంటి గుంటల వల్లే పలువురు బైకిస్టులు, పాఠశాల విద్యార్థులు ప్రమాదాల బారిన పడ్డారని గుర్తు చేస్తున్నారు.పసుమర్తిలో శోకసంద్రం ఈ విషాద ఘటనతో పసుమర్తి గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న మహమ్మద్ అకాల మరణం చెందడంతో భార్యాపిల్లలు, బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. "అధికారుల నిర్లక్ష్యం వల్ల కుటుంబం రోడ్డున పడింది.. కోల్పోయిన ప్రాణాన్ని మున్సిపల్ అధికారులు గానీ, కాంట్రాక్టర్ గానీ తిరిగి ఇవ్వగలరా? బాధితులను ఎవరు ఆదుకుంటారు?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పట్టణంలో ప్రజల భద్రతకు సరైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

## ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు : తేళ్ల సుబ్బారావు



చిలకలూరిపేట, మే 19, ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29వ తేదీన ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కాకతీయ అన్నదాన సత్ర సంఘం (శ్రీశైలం) గౌరవాధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు తెలిపారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ మెగా వైద్య శిబిరాన్ని విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ప్రధానంగా కంటి శుక్లాల ఆపరేషన్లకు మాత్రమే పరిమితమైన సేవలను ఈసారి మరింత విస్తృత పరిధిలో అందించనున్నట్లు పేర్కొన్నారు. రెటీనా సంబంధిత వ్యాధులు, రెటీనా డిటాచ్మెంట్, చూపు కోల్పోయే ప్రమాదం ఉన్న క్లిష్ట కంటి సమస్యలకు నిపుణులైన వైద్యులచే పరీక్షలు, చికిత్సలు, అవసరమైతే శస్త్రచికిత్సలు సైతం పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణంగా లక్షల రూపాయల వ్యయం అయ్యే అత్యాధునిక కంటి వైద్య సేవలను పేద, మధ్యతరగతి ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించడం ఈ శిబిరం ప్రత్యేకత అని పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకొని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ప్రత్తిపాటి పుల్లారావు ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని, రహదారులు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందారని తేళ్ల సుబ్బారావు కొనియాడారు. ప్రజాసేవను ధ్యేయంగా తీసుకొని ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతూ సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు తేళ్ల సుబ్బారావు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# టిడిపి యువనాయకుడు గోపిదేశి పేరయ్య ఆకస్మిక మృతి



చిలకలూరిపేట, మే 19, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, 22వ వార్డు పార్టీ మాజీ అధ్యక్షులు, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ మాజీ అధ్యక్షుడు గోపిదేశి పేరయ్య సోమవారం సాయంత్రం తీవ్రమైన గుండె పోటు కారణంగా మృతి చెందారు. పేరయ్య ఆకస్మిక మృతి పట్ల పట్టణంలోని టీడీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. స్థానిక రిజిస్ట్రార్ ఆఫీసు వెనుక ఉన్న ఆయన స్వగృహంలో మృతదేహాన్ని చేర్చడం జరిగింది.

# అర్బన్ ఎస్ఐగా షేక్ సైదా బాధ్యతల స్వీకారం



చిలకలూరిపేట, మే 19, ప్రభాతవార్త: చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు రేపల్లె నగరం పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా షేక్ సైదా నియమితులయ్యారు. ఈమేరకు అర్బన్ సిఐ రమేష్ సమక్షంలో హాజరై బాధ్యతలను ఎస్ఐ షేక్ సైదా బాధ్యతలు స్వీకరించారు.

# పల్నాడు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు

## తాతపూడి వద్ద భారీ నగదు స్వాధీనం: ఎస్ఐ అనిల్



చిలకలూరిపేట, మే 19, ప్రభాతవార్త: చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ స్టేషన్ సిబ్బందితో కలిసి ది మంగళవారం రాత్రి చిలకలూరిపేట మండలంలోని తాతపూడి జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా విజయవాడ నుండి చెన్నై వెళుతున్న ఐరా ట్రావెల్స్ బస్సును సోదా చేయగా అందులో 45,30,000/ రూపాయల నగదు ఉంది. సదరు నగదును కలిగి ఉన్న నరసరావుపేటకు చెందిన షేక్ మొహమ్మద్ హనీఫ్‌ను విచారించగా తను సదరు డబ్బు తీసుకొని బంగారం కొనడానికి చెన్నై వెళ్తున్నట్లు తెలిపారు. అతని వద్ద సదరు డబ్బులకు సంబంధించిన సరైన పత్రాలుగానీ, ఆధారాలు గానీ లేనందున నగదును సీజ్ చేసి విజయవాడలోని ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్‌కు అప్పగించారు.. ఎవరైనా అక్రమంగా డబ్బులు తరలించిన ఎడల పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భూముల రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలి

## ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా




గురజాల, మే 19 ప్రభాతవార్త : రెవెన్యూ డివిజన్ పరిధిలో భూముల రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహా అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లను సర్వే వివరాలను, అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని పూర్తి చేసిన అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. పట్టణంలోని అమరలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఇటీవల సిమెంట్ రోడ్డు, కల్వర్టు నిర్మాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ దుర్గేష్, కమిషనర్ శివన్నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

# మంచికి సత్కారం



పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: మంచి చేసే వ్యక్తులను సత్కరించుకోవడం, గౌరవించుకోవడం, వారు చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని మాజీ కౌన్సిలర్ యరసాని శ్రీరామమూర్తి అన్నారు. బెంగుళూరులో సాఫ్ట్వేర్ ఇంజనీర్గా పనిచేస్తున్న ప్రియాంక వేసవి సెలవులకు తన బిడ్డతో స్వగ్రామమైన పొన్నూరు పట్టణానికి వచ్చింది. ప్రతి రోజు ఉదయాన్నే లేచి తన బిడ్డతో వాకింగ్ చేయడం అలవాటు ఉన్న ప్రియాంక, పొన్నూరులోని వాకింగ్ ట్రాక్కు వచ్చి వాకింగ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో వాకింగ్ ట్రాక్ ఉన్నటువంటి క్రీడాస్థలంలో సుమారు 200మంది నడుస్తున్నప్పటికీ గ్రౌండ్ మొత్తం ఖాళీ వాటర్ బాటిళ్ళు, కూల్డ్రింక్స్ బాటిళ్ళు, లేస్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలకు సంబంధించిన వ్యర్థాలు గ్రౌండ్లో ఉండడం చూసిన ప్రియాంక సమాజంపై బాధ్యత కలిగి పౌరురాలిగా భావించిన ఆమె గత వారం రోజులుగా ఎవరితో సంబంధం లేకుండా ప్రతి రోజూ ఉదయాన్నే ఒక ఖాళీ గోనె సంచి తెచ్చి చెత్తాచెదారాలను స్వయంగా శుభ్రం చేసింది. ప్రియాంక సేవను, ఆమె స్పందించిన విధానాన్ని చూసిన పలువురు పురప్రముఖులు మంగళవారం సంబంధిత వాకింగ్ ట్రాక్ వద్ద ప్రియాంకను, ఆమె తండ్రిని స్నేహ సర్కిల్ మిత్ర బృందం సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాసరి నరసింహారావు, షేక్ లియాఖత్, కె.సత్యనారాయణ, తాడికొండ జగన్,జనసేన పట్టణాధ్యక్షుడు షేక్ కరీముల్లా, శివప్రసద్, మయూరి అబ్దుల్లా, షేక్ యాసిన్ తదితరులున్నారు.

# రాజధాని అమరావతిపై విష ప్రచారం తగదు

## - జీడీసీ ఎమ్మెస్ ఛైర్మన్ వడ్లాణం హరిబాబు



పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: ప్రజా నయా రాజధాని అమరావతిపై విష ప్రచారం చేయించడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మానుకోవాలని జీడీసి ఎమ్మెస్ ఛైర్మన్ వడ్లాణం హరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహనరెడ్డి తన పేటిఎం బ్యాచ్ పేర్ని వెంకటేశ్వరరావు(నాని), అంబటి రాంబాబుతో రాజధానిపై లేనిపోని అసత్య ప్రచారం చేయించడం తగదన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి ఇంకా అల్లరి మూకలతో కుట్రలు, కుతంత్రాలు, విషప్రచారాలు చేయిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిస్తున్నారన్నారు. రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు శరవేగం గా జరుగుతుంటే జగన్మోహనరెడ్డి అండ్ కో సభ్యులు మూకుమ్మడిగా అసత్య ప్రచారం చేస్తున్నా రన్నారు. పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ డబ్బులు పెట్టి గెలిచాడంటూ మాట్లాడడం చూస్తే వారికి మతిభ్రమించి మాట్లాడుతున్నట్లు ఉందన్నారు.ఇంటి మాటలు మాట్లాడే అంబటి, పేర్ని నానిలకు ప్రజలు చెప్పులతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కేంద్ర మంత్రిగా పెమ్మసాని కొనసాగుతూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను త్వరితగతిన ఎలా పూర్తి చేయాలా అనే దానిపై సమీక్షలు నిర్వహిస్తూ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నారన్నారు. అతి తక్కువ సమయంలోనే కేంద్రం నుంచి అత్యధికంగా నిధులు రాబట్టి గుంటూరు నగరంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రైతుల ఇబ్బందులు పడకూడదంటూ వారికి కావలసిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను సకాలంలో అందేవిధంగా అధికారులకు సూచనలు చేస్తూ అందరికీ చేరువలో వుండే విధంగా పెమ్మసాని చేస్తుంటే ఆయనపై విమర్శలు చేయడం సత్యదూర మన్నారు. వైకాపా నాయకులు దిగజారుడు తనంతో ప్రజలు ఇప్పటికే తరిమి కొట్టినా సిగ్గులేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైకాపా నాయకులు మీకు చేతనైతే ప్రజలకు సేవ చేయండి కానీ వారి నోటి ముందు ఉన్న కూడు తియ్యకండి అంటూ వడ్లాణం హరిబాబు హితవు పలికారు.

# పథకాల అమలు బిజెపికే సాధ్యం

## - రైతు నాయకుడు పూల సుబ్రహ్మణ్యం



పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: దేశంలో పథకాల అమలు భారతీయ జనతాపార్టీకే సాధ్యమని ఆ పార్టీ రైతు నాయకుడు పూల సుబ్రహ్మణ్యం అన్నారు. గుడ్మార్నింగ్ బిజెపి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కసుకర్రు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పూల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పక్కాగా అమలు చేయడం ఒక్క బిజెపికే సాధ్యమన్నారు. వలస కూలీల నివారణకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వంద రోజుల నుంచి 125రోజులు పని దినాలకు పెంచిన ఘనత బిజెపికే దక్కుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి పిలుపు మేరకు జాతీయ, అంతర్జాతీయ దేశాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ ఇందనం, గ్యాస్, వంటనూనెలను పొదుపుగా వాడుకోవాలన్నారు. అవసరం కొద్ది గ్రామాల్లో సైకిల్ మీదనే ప్రయాణం చేయాలన్నారు. సైకిల్, నడకను ఎక్కువగా వినియోగించుకునేవిధంగా చూడాలన్నారు. మోడి పిలుపు మేరకు కూలీలు మంగళవారం సైకిల్మీద ఐదు కిలోమీటర్లు వెళ్ళి 8మీటర్ల పొడువున, 1 మీటరు లోతు తవ్వడం జరిగిందన్నారు. దీనికి గాను ఈ పథకం ద్వారా రూ.307 కూలి గిట్టుబాటైందన్నారు. ఉపాధిహామీ కూలీలకు డబ్బులను నేరుగా వారి ఖాతాల్లోనే జమ అవుతాయని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారులను సంప్రదించాలని పూల సుబ్రహ్మణ్యం కోరారు.

# నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే

-ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్బాబు

పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమై విద్య అందుతుందని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ నేతాజీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్బాబు కోరారు. విద్యార్థులను చేర్పించేందుకు మంగళవారం ఉపాధ్యాయుల బృందం టిడ్కో సముదాయంలో పర్యటించి, ఇంటింటికి తిరిగి పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అభ్యర్థించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, తదితర వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగ శ్రీనివాస్తోపాటు మరికొంతమంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వీరాంజనేయస్వామివారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామివారిని హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములు జడ్జి మల్లికార్జునరావు దంపతులకు ఘన స్వాగతం పలికారు. అర్చకస్వాములు కృష్ణమాచార్యులు తదితరులు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జడ్జి దంపతులకు అర్చకస్వాములు వేదాశీర్వచనం చేశారు.ధర్మకర్తల మండలి ఛైర్మన్ జీఎంఎస్ గుప్తా, కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు జడ్జికి ప్రసాదాలను, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కలపాల విజయలక్ష్మి తదితరులున్నారు.



# 20న మెడికల్ షాపులు బంద్

పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: దేశవ్యాప్త కెమిస్టుల బంద్కు మద్దతుగా ఈ నెల 20వ తేదీన పొన్నూరు పట్టణ, మండల పరిధిలోని మెడికల్ షాపులన్నీ బంద్ పాటిస్తున్నాయని ది.పొన్నూరు మండల్ కెమిస్ట్ స్ అండ్ డ్రగ్గిస్ట్ స్ వెల్ఫేర్ అసోసియేషన్ బంద్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కాకరపర్తి హనుమంతరావు, లింగమల్లు మోహనకృష్ణ, కోశాధికారి తాతా హరీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ, నియంత్రణ లేని ఆన్లైన్ మందుల విక్రయాలు, ప్రజారోగ్యంపై వాటి ప్రభావం, అలాగే లక్షలాది చిన్న కెమిస్టుల జీవనోపాధిపై ఏర్పడుతున్న తీవ్రమైన సమస్యలకు వ్యతిరేకంగా బంద్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని మెడికల్ షాపుల నిర్వాహకులు బంద్ పాటించాలని, తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించేందుకు ప్రతి ఒక్కరూ రావాలని కోరారు. ఈ బంద్ విషయాన్ని ప్రజలు అందరూ గుర్తించి సహకరించాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. ప్రజల అవసరార్థం అన్ని వైద్యశాలల్లో ఉన్నటువంటి మందుల షాపులు తెరచి ఉంటాయని చెప్పారు.

## అంగరంగ వైభవంగా ముగిసిన పెదనందిపాడు పోలేరమ్మ తిరునాళ్లు



పెదనందిపాడు మే 19 (ప్రభాతవార్త)పెదనందిపాడు లో మూడు రోజుల నుంచి జరుగుతున్న పోలేరమ్మ తల్లి తిరునాళ్ళు మంగళవారం రాత్రి తో వైభవంగా ముగిశాయి. తిరుణాల ముగింపు సందర్భంగా కాకతీయ యూత్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన ఎలక్ట్రికల్ ప్రభ కన్నుల పండుగ ఉంది. డి బి యూత్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభ కూడా ప్రేక్షకుల మన్ననలు పొందినది. రజక బాలలు నిర్మించిన చిన్న ప్రభ భక్తులను ఆకట్టుకున్నది. తిరునాళ్లకు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ వారు సిహెచ్ సత్య హర్ష . టి సాంబశివరావు. బి చెన్నకేశవరావు. బి హనుమంతరావు. టీ సీతారామయ్య. సుబ్బారావు తదితర గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# మహిళా రైతులపై పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయం

పొన్నూరు, మే 19,ప్రభాతవార్త: మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో మహిళా రైతులపై పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమని మునిసిపల్ మాజీ ఛైర్పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్రాణి అన్నారు. స్థానిక ఆమె కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మామిళ్ళపల్లి గ్రామంలో రైతులను పరామర్శించేందుకు వస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్ను అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. మహిళా రైతులను మహిళా పోలీసులు అడ్డుకోవాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా పురుష పోలీసులు అడ్డుకోవడం, వారిని ఎలా పడితే అలా లాగిపడేయడం చాలా బాధాకరమన్నారు. పోలీసులు మహిళల పట్ల వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అని ప్రశ్నించారు.



మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మామిళ్ళపల్లి గ్రామంలో రైతులకు సంబంధించిన గోదాములో మొక్కజొన్నలను సీజ్ చేసిన అధికారులు తక్షణమే వాటిని రైతులకు అప్పగించేవిధంగా చొరవ చూపాలన్నారు. మొక్కజొన్నలు ఎక్కువ కాలం గోదాములో ఉంటే గాలి, వెలుతురు, ఆడక బూజుపట్టే అవకాశం ఉన్నందున తక్షణమే రైతులకు అప్పగించాలన్నారు. మొక్కజొన్నలు బూజుపడితే ఎందుకు పనికిరావని, తద్వారా రైతులు నష్టపోయే ప్రమాదముంద న్నారు. ఈ విషయంలో అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులకు చెందిన మొక్కజొన్నలను రైతులకు అప్పగించాలన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ ఒక్క టిడిపి వారికి మాత్రమే కాదని, నియోజకవర్గంలోని అన్ని వర్గాల వారికి ఎమ్మెల్యే అన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ప్రతిఘటనలు, అక్రమాలు లేవని, రానున్న కాలంలో ఇలాంటి వాటికి తావులేకుండా చూడాలని కోరారు. సీజ్ చేసిన గోదాము విషయంలో తహశీల్దార్ స్పందించాలని, స్పందించని పక్షంలో జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తామని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ దీక్షలు చేయడం, వివిధ రకాలుగా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వంలో స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షేక్ నాజర్, చింతలపూడి మురళీకృష్ణ, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డక్కుమళ్ళ రవి, వైకాపా సీనియర్ నాయకులు డాక్టర్ అన్నవరపు రమేష్, అన్నవరపు శ్యామల తదితరులున్నారు.

# ఉపాధి హామీ పనులను నిధులు పెంచాలి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



పెదనందిపాడు మే19 (ప్రభాతవార్త): ఉపాధి హామీ నిధులు పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని ,బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదనందిపాడు మండలంలోని వరగాని, పెదనందిపాడు, పాలపర్రు గ్రామాల పరిధిలోని, ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, జూన్ ఒకటో తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, వి. బి .జి .రాంజీ చట్టాన్ని తీసుకువస్తుందని చెప్పారు .ఉపాధి హామీ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10600 కోట్ల రూపాయలు గతంలో కేటాయించేవని ,ప్రస్తుత సంవత్సరానికి కేవలం 837 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని తెలిపారు. దీనిలో కూడా కూలీల పనులకు కేటాయించింది 738 కోట్లు మాత్రమేనని అన్నారు .ఈ నిధులు కేవలం, రాష్ట్ర మొత్తంగా 2.46 లక్షల కుటుంబాలకు మాత్రమే సరిపోతాయని అన్నారు. గతంలో జిల్లాకు లక్ష కుటుంబాలకు పని కల్పించేవారని ,ప్రస్తుత సంవత్సరం 9461 కుటుంబాలకు మాత్రమే పని దొరుకుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, నిధులను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఉపాధి హామీ పని అడిగిన వారందరికీ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లతో ఈనెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు గ్రామ సచివాలయాలలో అర్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు .అర్జీలు ఇచ్చే కార్యక్రమంలో ఉపాధి కూలీలందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు. మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు జంపని రామారావు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

పెదనందిపాడు మే 19( ప్రభాతవార్త): పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సి.పి.ఎం.పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రాష్ట్ర వ్యాపితంగా సి.పి.ఎం.పార్టీ, సి.ఐ.టి.యు., ఇతర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా పెదనందిపాడు లోని లావువారిచెరువు వద్ద జరిగిన నిరసన కార్యక్రమం లో అప్పారావు పాల్గొని మాట్లాడారు. పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెంచబోమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అయిదు రాష్ట్రాల ఎన్నికల ముందు ప్రజలకు చెప్పి, ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ కు మూడు రూపాయలకు పైగా పెంచి, ప్రజలను మోసం చేశాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన ప్రజలపై తీవ్రమైన భారాలు పడ్డాయని అన్నారు.ఇప్పటికే పనులు లేక, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్న పేద ప్రజలు ఈ భారాల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని వలసి వస్తుందని అన్నారు. సి.పి.ఎం.మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ గారి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పేదొకటి,చేసేదొకటని అన్నారు. పేదలను పట్టించుకోవడం లేదని, కార్పొరేట్లకు దేశ సంపదనంతా దోచిపెడుతున్నారని అన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమం లో రైతు సంఘం మండల నాయకులు జంపని రామారావు, సి.ఐ.టి.యు.నాయకులు కందుల శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా కోశాధికారి నల్లమోతు రాజేంద్ర,మర్రి లక్ష్మి ్మ,కొర్రపాటి లక్ష్మి ్మ, అన్నలదాసు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



# మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య

పెదనందిపాడు మే 19(ప్రభాతవార్త) ప్రజల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు , దక్షి ణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అని సి.పి.ఎం.పార్టీ పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు.మంగళవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో సుందరయ్య వర్ధంతి సభ ను ఘనంగా నిర్వహించారు. సి.పి.ఎం.మండల నాయకులు కందుల శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ముందుగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు సుందరయ్య గారి మీద ఆయన ఔన్నత్యాన్ని కొనియాడుతూ, ఒకగేయాన్నిఆలపించారు .అనంతరంపూలమాలవేసి నివాళుల ర్పించారు.రమేష్ బాబు మాట్లాడుతూ,సుందరయ్యలాంటి మహోన్నత వ్యక్తులు చాలా అరుదుగా పుడతారని అన్నారు. కులం అడ్డువస్తుందని తన పేరులో నుండి రెడ్డి అనే పదాన్ని తొలగించు కున్నారని అన్నారు.పిల్లలు పుడితే ప్రజాసేవకు అడ్డువస్తుందని ,పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న మహనీయుడు. తన ఆస్తిని మొత్తం పేదలకు పంచిన గొప్ప మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నెల్లూరు నుండి సరుకులు తెచ్చి అసలు ఖరీదుకు పేదలకు అందించిన వ్యక్తని అన్నారు. పార్లమెంటేరియన్ గా ఉన్నప్పుడు సైకిల్ పై పార్లమెంటుకు వెళ్ళేవారని, నిరాడంబరంగా జీవించారని అన్నారు. వారి జీవితం మనందరికీ ఆదర్శనీయమని అన్నారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరా టానికి నాయకత్వం వహించి, వీరోచితంగా పోరాడిన వ్యక్తని అన్నారు. ఆయన తన జీవితాన్ని చివరి కంటా ప్రజా సేవకే అంకితం చేశారని, అలాంటి మహనీయుని జీవితం చిరస్మరనీయ మన్నారు.ఈ సంస్మరణ సభలో లక్షి ్మ,బేగం,దివ్య, ప్రవల్లిక,స్రవంతి,మల్లిక, సులోచన,మోనిక పాల్గొన్నారు.

# కిషోరి వికాసం వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి..

వట్టిచెరుకూరు, మే 19, ప్రభాతవార్త: కిషోర్ వికాసం వేసవి శిక్షణ తరగతులను కిషోర్ బాలికలు సద్వినియోగం చేసుకోవాలని వట్టిచెరుకూరు, పుల్లడిగుంట ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్లు చిన్నమ్మాయి, మాధవి పేర్కొన్నారు. మండలంలోని కోవెలమూడి యామర్రు తదితరు గ్రామాల్లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో సూపర్వైజర్లు చిన్నమ్మాయి, మాధవి పాల్గొని మాట్లాడుతూ.. కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు ఈనెల ఒకటిన ప్రారంభమై జూన్ 9వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ శిక్షణలో 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రోజురోజుకీ సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా బాలికలే లక్ష ్యంగా ప్రేమ పేరుతో పలువురు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు గర్భవతులను చేసి పారిపోతున్నారని, మరికొంతమంది రాజీ పేరుతో బాల్యవివాహాలు చేసుకుంటున్నారని వివరించారు. ఇటీవల ఇలాంటి ఘటనలు అధికంగా వెలుగులోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తుందని వెల్లడించారు. పొగాకు,మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, జూన్ 9వ తేదీన బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్యా ప్రోత్సాహం మరియు గ్రామస్థాయి నిర్ణయాలు అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. 15 నుండి 18 ఏళ్లలోపు బాలికలు, 11 నుంచి 14 ఏళ్ళ లోపు ఉన్న డ్రాపౌట్స్ ను గుర్తించి వారికి శిక్షణను

# టిడిపి పాలనలోనే

# దళితులసంక్షేమం,అభివృద్ధి టిడిపి జిల్లా అధ్యక్షులు జానీ సైదా

నరసరావుపేట, మే 19 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ పాలనలోనే సంక్షేమ దళితుల సంక్షేమం అభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు జాన్ సైదా అన్నారు. దళితులపై



వైయస్సార్సీపీకి ఉన్నది కేవలం కపట ప్రేమ మాత్రమేనని విమర్శించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జానీ సైదా, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ మరియు ఎస్సీ సెల్ నాయకులతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానీ సైదా మాట్లాడుతూ కేవలం ఓటు రాజకీయాల కోసమే జగన్మోహన్ రెడ్డి నా ఎస్సిలని ప్రబోధిస్తూ ఉంటారని విమర్శించారు. వైసీపీ హయాంలో దళితులపై ఎన్నో దాడులు జరిగాయన్నారు. రెండేళ్ళ క్రితం ఇదే రోజు వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రహ్మణ్యం అనే దళితుడిని హత్య చేసి, డోర్ డెలివరీ చేసిన సంఘటన ఎవరు మర్చిపోలేమన్నారు. డాక్టర్ సుధాకర్ ని అవమానించి, అతని చావుకి వైసీపీ ప్రభుత్వం కారణమైందన్నారు. కల్తీ మందు అమ్ముతున్నారని ప్రశ్నించినందుకు దళిత యువకుల్ని శిరోముండనం చేసిన ఘనత వైసిపిది కాదా అని ప్రశ్నించారు. ఎస్సిలు ఎస్టీలను ఏరకంగా వైసిపి నాయకులు కించపరిచారో ప్రజలందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా చిన్న సంఘటన జరిగితే, వైసీపీ నేతలు తమ రాజకీయ ఉనికి కోసండ్రామాలుఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో దళితులకు ఉన్నత స్థానం కల్పించామని, పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటూ, వారి అభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని జానీ సైదా స్పష్టం చేశారు. నల్లపాటి రాము మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ నాయకులు ప్రజల సమస్యలను రాజకీయ లాభాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, దళితుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరు కుమార్, టీడీపీ నాయుకులు ఇనగంటి జగదీష్, తిరుమల కొండ నరసింహారావు మాట్లాడారు.

# ప్రజలు బుద్ధి చెప్పినా వైయస్సార్సీపి తీరు మారలేదు

## - ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట, మే 19 ప్రభాతవార్త : : అవినీతి, దుర్మార్గాలకు వైసీపీ పార్టీ నిలయంగా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసిపి జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పిన ఇంకా తీరు మార్చుకోలేదన్నారు. ప్రజలు గత ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పినా ఇంకా వారి తీరు మారలేదని చెప్పారు. అనవసర వ్యాఖ్యలు,



సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులతో అబద్ధాన్ని నిజంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన కొనసాగుతుందని తెలిపారు. విద్యారంగంలో గణనీయమైన మెరుగుదల సాధించామని పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులవుతున్నారని ఫలితాలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అమెరికాఇరాన్ యుద్ధ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా 80 శాతం వరకు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, అమెరికాలోనూ ధరలు భారీగా పెరిగాయని అరవింద బాబు వివరించారు. అయితే ప్రధాని మోదీ దూరదృష్టి వల్ల దేశంలో కేవలం మూడు శాతం మాత్రమే ధరలు పెరిగాయని చెప్పారు. పెరిగే ఇంధన కొరతను ముందే గుర్తించి, ప్రజలను వంటగ్యాస్ వినియోగంలో అప్రమత్తం చేసినందుకు మోదీ, చంద్రబాబులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎల్లప్పుడూ సరళంగా ఒకే వాహనంలో వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల మధ్యే ఉంటానని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో తనపై 64 కేసులు నమోదు చేశారని, పోలీసులచే దాడులు చేయించారని ఆరోపించారు. ప్రజలు కుల, మత, రాజకీయాలు చూడకుండా తనను గెలిపించారన్నారు. నేను ప్రజల కోసమే పని చేస్తానుని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో పాటు వైసీపీ కార్యకర్తలు కూడా కూటమి పాలనను ఇష్టపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ శ్రేణులు దుర్మార్గపు ఆలోచనలకు మానుకొని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పిలుపునిచ్చారు. సమావేశంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, నాయకులు సత్యనారాయణ,గ్రాండ్ సుబ్బు, గూడూరు శేఖర్, మడక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యువత దురలవాట్లకు దూరంగా ఉండాలి

నిజాంపట్నం, మే 19, ప్రభాతవార్తః బాల్యవివాహాలు నేరమని, ఎవరూ చిన్నవయస్సులో వివాహాలు చేసుకోవద్దని ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండలంలోని హారీస్పేటలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏది మంచో ఏది చెడో తెలుసుకోవాలని ఆమె కోరారు. 11-18 వయస్సు ఎంతో ముఖ్యమైనదన్నారు. బాల్యవివాహాలు నేరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త శ్యామల, ఆశావర్కర్ జ్యోతిలు, కిశోరి బాలబాలికలు పాల్గొన్నారు.



# బాలికల హక్కుల చట్టాలపై అవగాహన



రేపల్లె, మే 19, ప్రభాతవార్త:పట్టణంలోని బాపూజీ పాఠశాల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది.బాలికలకు పాస్కో చట్టం,ఆర్టిఇ హక్కుల గురించి అవగాహన కల్పించారు.బాల్య వివాహాల వలన జరిగే నష్టాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సిహెచ్.హిమబిందు,బాపట్ల జిల్లా బాలికల పరిరక్షణ విభాగం అధికారులు కృష్ణ,శ్రీప్రియ, అంగన్వాడీ కార్యకర్తలు భవాని,రమాదేవి, ప్రమీల,ఆశా వర్కర్ బుజ్జి, బాలికలు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పుచ్చలపల్లి సేవలు చిరస్మరణీయం



రేపల్లె, మే 19, ప్రభాతవార్త:దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ నేతగా, పార్లమెంట్ నేతగా ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో విశిష్టసేవలు అందించిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిరస్మరణీయులని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ అన్నారు.మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో 41వ వర్ధంతి సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకుడు జి.డానియేల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ దేశ రాజకీయాలలో ప్రజల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేసిన ఘనత పుచ్చలపల్లికే దక్కిందన్నారు.పుచ్చలపల్లి సుందరయ్యకు ఉన్న ఆస్తిపాస్తులను ప్రజల కోసమే ఖర్చు చేశారని చెప్పారు.వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు చేసి కూలీల సమస్యలను పరిష్కరించారని ఆయన తెలిపారు.సుందరయ్య సేవలను ఆదర్శవంతంగా తీసుకుని సిపిఎం అనేక ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నదని మణిలాల్ వివరించారు. కార్యక్రమంలో సిపిఎం,ప్రజా సంఘాల నాయకులు పాఆశీర్వాదం, జె.ధర్మరాజు,

20-5Pg 9_20-5Pg5.qxd 20/May/26 12:14 AM Page 1



# బంగ్లాదేశ్‌కు మళ్లీ వస్తా..

## వెళ్లే తేదీ సమయం హఠాత్తుగా చెపుతా..

## మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ, మే 19:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సంచలన ప్రకటన చేశారు. 2024లో చెలరేగిన విద్యార్థి ఉద్యమం కారణంగా తన పదవిని కోల్పోయి, ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న హసీనా తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో తన భవిష్యత్తు కార్యాచరణను స్పష్టం చేశారు. తనకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించినప్పటికీ, తన పార్టీ అయిన అవామీ లీగ్ పై నిషేధం విధించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని ప్రకటించారు. నేను బంగ్లాదేశ్‌లో లేనంత మాత్రాన సైలెంట్‌గా ఉన్నానని అనుకోవద్దు. దేశం కోసం నేను నిరంతరం పోరాడుతూనే ఉన్నాను. అతి త్వరలోనే నేను మళ్లీ నా సొంత దేశానికి తిరిగి వెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా తాను దేశానికి తిరిగి వెళ్లే నిర్దిష్ట తేదీ, సమయాన్ని ఇప్పుడే వెల్లడించలేనని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, రాజకీయ హక్కులు, చట్టబద్ధమైన పాలన పునరుద్ధరించబడటమే తన ప్రాథమిక లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తన పార్టీ అవామీ లీగ్‌పై విధించిన నిషేధంపై ఆమె ఘాటుగా స్పందించారు. అవామీ లీగ్ అనేది ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ. కేవలం ఒక ప్రభుత్వ కాగితపు ఆర్డర్‌తో దానిని క్లోజ్ చేయడం ఎవరి తరం కాదు. అదే నిజమైతే అసలు బంగ్లాదేశ్ అనే దేశమే పుట్టేది కాదని గుర్తుచేశారు. గతంలో తనపై 19 సార్లు హత్యాప్రయత్నాలు జరిగాయని, అయినా తాను ఎన్నడూ భయపడలేదని, ఇప్పటికీ లక్షలాది మంది మద్దతుదారులు పార్టీ కోసం నిలబడే ఉన్నారని చెప్పారు. గతంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా వ్యవహరించిన ముహమ్మద్ యూనస్‌పై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూనస్ ప్రభుత్వం అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలపై పగబట్టి రాజకీయ నరమేధం సృష్టించిందని ఆరోపించారు. ఇప్పటివరకు తమ పార్టీకి చెందిన సుమారు 600 మందిని దారుణంగా హత్య చేశారని, 1.5 లక్షల మందికి పైగా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనగానే నాయకులంతా మళ్లీ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# పెను ఆర్థిక తుఫాను వస్తోంది!

### - పశ్చిమాసియా ఘర్షణలతో చమురు, ఎరువులకు తీవ్ర కొరత - సామాన్య ప్రజలను కాపాడటంలో మోడీ విఫలం - పొదుపు పాటించాలని చెబుతూ ప్రధాని విదేశీ టూర్లు ఏంటి?

### - లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపాటు



**లక్నో, మే 19:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో భారతదేశం ఒక పెద్ద ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఆర్థిక తుఫాను రాబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దాని ప్రభావం నుండి సామాన్య ప్రజలను కాపాడటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు. రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా మంగళవారం బచ్ఛ్రావన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, ఇరాన్, అమెరికాల మధ్య నెల కొన్న ఈ సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా చమురు, ఎరువులు, డీజిల్ కొరతకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం చెలరేగింది. ఈ ఘర్షణ సమయంలో, ప్రపంచ చమురులో అధిక భాగం ప్రయాణించే వ్యూహాత్మక ప్రదేశమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్వాధీనం చేసుకుంది. తమ పట్టును వదులుకోబోమని ప్రకటించింది. ఫలితంగా, ఇప్పుడు ప్రపంచ మంతా చమురు, ఎరువులు, డీజిల్ తీవ్ర కొరతను వేగంగా ఎదుర్కోవడం ప్రారంభించింది" అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొనసాగిస్తున్న ఐదు దేశాల పర్యటనపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బంగారం కొనవద్దని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని, విదేశాలకు వెళ్లవద్దని మోడీ పౌరులను కోరతారు, కానీ ఆ వెంటనే ఆయన విదేశీ పర్యటనకు బయలుదేరుతారు" అని విమర్శలు గుప్పించారు. "విచారకరమైన విషయం ఏమిటంటే, మన జీవితంలో ఎన్నడూ చూడని తీవ్రమైన ఆర్థిక తుఫాను రాబోతోంది, దానిని ఎవరూ ఆపలేరు," అని గాంధీ అన్నారు. ఈ ఆర్థిక ప్రభావం అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తల కంటే ఎక్కువగా రైతులు, కార్మికులు, యువత, చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలపై పడుతుందని అన్నారు. "నష్టపోయేది అంబానీ లేదా అదానీ కాదు. నాలుగు వైపులా భద్రత ఉన్న వారి రాజభవనాల్లోనే వారు ఉంటారు. నష్టపోయేది భారతదేశపు రైతులు, కార్మికులు, యువత, ఉపాధి కల్పించే చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలే," అని ఆయన అన్నారు. "తాను కొంతకాలంగా 'ఆర్థిక తుఫాను' గురించి హెచ్చరిస్తున్నానని, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతాయని చెప్పినట్లు పెట్రోల్ ధరలు పెంచారు. ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుంది. అయినా, రాహుల్ గాంధీకి అవగాహన లేదని అంటారు. ఈ రోజు కూడా మేం వారికి చెబుతూనే ఉన్నాం. చర్యలు తీసుకోండి. ప్రజలను రక్షించండి. రైతులను రక్షించండి. కానీ వారు ఏమీ చేయరు. కొన్నిసార్లు నార్వేకి, తర్వాత జపాన్‌కి, ఆపై మరెక్కడికో వెళ్ళిపోతారు. ఎందుకు?" అని రాహుల్‌గాంధీ నిలదీశారు. కార్మికులను, చిన్న వ్యాపారులను రక్షించడంలో కేంద్రం విఫలమైందని గాంధీ ఆరోపించారు. ప్రభుత్వం పెద్ద పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్య బట్టారు. "కార్మికులను, చిన్న వ్యాపారులను ఆదుకోవడం ప్రారంభించాలని తాము రోజూ నరేంద్ర మోడీని కోరుతూనే ఉన్నాము. కేంద్రం అలా చేయడంలో విఫలమైతే, దేశం అపారమైన నష్టాన్ని చవిచూడబోతోంది రాహుల్‌గాంధీ ఆందోళనవ్యక్తం చేశారు.

# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

## వచ్చే యేడాది జూన్ 14వరకూ పొడిగించిన యుఎడిఎఐ

**న్యూఢిల్లీ, మే 19:** ఆధార్ కార్డుదారులకు యూఐడీఏఐ సడలింపులు ఇచ్చింది. ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు విధించిన గడువును మరో పూర్తి ఏడాది పాటు పొడిగించింది. వాస్తవానికి ఈ అవకాశం త్వరలో ముగియనుండగా, పౌరుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఐడీఏఐ తెలిపింది. తాజా ఉత్తర్వుల ప్రకారం 2027 జూన్ 14 వరకు పోర్టల్ ద్వారా డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నెల 13న విడుదల చేసిన అధికారిక మెమోరాండం ప్రకారం యూఐడీఏఐ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సదుపాయాన్ని మరో ఏడాది, అంటే 2026 జూన్ 15 నుంచి 2027 జూన్ 14 వరకు పొడిగించాలని నిర్ణయించాం. దీని ప్రకారం ఆధార్ పోర్టల్‌లో డాక్యుమెంట్ అప్‌డేట్ సౌకర్యం 2027 జూన్ 14 వరకు ఉచితంగా కొనసాగుతుందని ఆ ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. పౌరులు తమ వివరాలను కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవడాన్ని ప్రోత్సహించడమే ఈ పొడిగింపు ఉద్దేశమని తెలిపింది. కొత్త యాప్ రాకతో పాత యాప్‌కు స్వస్తి డాక్యుమెంట్ అప్‌డేట్‌తో పాటు యూఐడీఏఐ మొబైల్ యాప్‌లో కూడా కీలక మార్పులు చేసింది. పాత యాప్‌ను త్వరలో నిలిపివేయనున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ప్రకటించింది. దాని స్థానంలో వినియోగదారుల కోసం మెరుగైన ఫీచర్లతో కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సురక్షితమైన క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధార్ షేరింగ్, మెరుగైన ప్రైవసీ నియంత్రణలు, ఇతర ఆధార్ సేవలను సులభంగా పొందేందుకు ఈ కొత్త యాప్ వీలు కల్పిస్తుంది. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ కొత్త ఆధార్ యాప్‌కు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. కేవలం మూడు నెలల్లోనే ఈ యాప్‌ను 2.1 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ యాప్ ద్వారా 28 లక్షల మంది తమ మొబైల్ నంబర్లను, దాదాపు 6 లక్షల మంది తమ చిరునామాలను అప్‌డేట్ చేసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కొత్త యాప్ ఆండ్రాయిడ్, యాపిల్ ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది.

# ట్రంప్, నెతన్యాహులను హత్యచేస్తే రూ.580 కోట్ల రివార్డు

## ప్రత్యేక చట్టంచేసేందుకు ఇరాన్ ఐఆర్జీసి కసరత్తులు



**టెహ్రాన్, మే 19:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మునుపెన్నడూ లేనంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను టార్గెట్ చేస్తూ ఇరాన్ పార్లమెంట్ (మజ్లిస్) ఒక సంచలన చట్టాన్ని తీసుకువస్తోంది. ట్రంప్, నెతన్యాహులను అంతమొందించిన వారికి రూ.580 కోట్ల భారీ రివార్డు ప్రకటించేలా ఒక ప్రత్యేక బిల్లుపై ఇరాన్ ఎంపీలు కసరత్తులుచేస్తున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం అజీజీ అధికారికంగా ధృవీకరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడుల్లో ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతోల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ దారుణ ఉదంతానికి ప్రతీకారం తీర్చుకునేందుకే తాజాగా ఇరాన్ నాయకత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ వార్తా సంస్థ ది టెలిగ్రాఫ్ నివేదిక ప్రకారం ఇరాన్ ఎంపీలు ప్రస్తుతం 'ఇస్లామిక్ రిపబ్లిక్ సైనిక, భద్రతా దళాల పరస్పర ప్రతీకార చర్య అనే పేరుతో ఒక ప్రత్యేక బిల్లును రెడీ చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం డొనాల్డ్ ట్రంప్‌ను హతమార్చిన ఏ వ్యక్తికైనా అధికారికంగా 50 మిలియన్ యూరోలు అంటే మన కరెన్సీలో సుమారు రూ.580 కోట్లు బహుమతిగా అందజేస్తారు. అలీ ఖమేనీ మరణానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, యూఎస్ సెంట్రల్ కమాండ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్‌లే పూర్తి బాధ్యులని ఇబ్రహీం అజీజీ స్పష్టం చేశారు. వీరంతా కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇటీవల ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ వైస్ ఛైర్మన్ మహమ్మద్ నబవియాన్ మాట్లాడుతూ.. ట్రంప్, నెతన్యాహులను నరకానికి పంపే వారికి 'భారీ బహుమత్తి ప్రకటించేందుకు పార్లమెంట్ అతి త్వరలోనే ఓటింగ్ నిర్వహించనుందని తెలిపారు. ఒకవేళ భవిష్యత్తులో ఇరాన్ లేదా తమ నాయకత్వంపై అమెరికా, ఇజ్రాయెల్ మళ్లీ దాడికి దిగితే, దాని పర్యవసానాలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాబోవని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యూహాత్మకంగా మద్దతు ఇస్తున్న ప్రాంతీయ అరబ్ దేశాలు, వారి ప్రభుత్వాలు కూడా ఈ తీవ్రమైన ఎదురుదాడిని ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన బాహాటంగానే హెచ్చరించారు. ఇరాన్ నుంచి ట్రంప్‌కు ఇలాంటి బెదిరింపులు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఇరాన్ టాప్ కమాండర్ ఖాసిం సులేమానీ, అలీ ఖమేనీ మరణాల తర్వాత ట్రంప్‌ను అంతమొందించేందుకు ఇరాన్‌లో వరుస ప్రచారాలు జరుగుతున్నాయి. గతంలో ట్రంప్ హత్య కోసం ప్రభుత్వం మద్దతు ఉన్న గ్రూపులు ఈ క్యాంపెయిన్ ద్వారా 27 మిలియన్ డాలర్లకు పైగా సేకరించినట్లు సమాచారం. ట్రంప్, నెతన్యాహుల చావు కోసం గతంలోనే 50 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది.

# సెప్టెంబరు 12,13 తేదీల్లో పుతిన్ భారత్ పర్యటన



**న్యూఢిల్లీ, మే 19:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం క్రెమ్లిన్ మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్‌రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో జరుగుతుంది. ఢిల్లీలో ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో ప్రపంచ భద్రతా సవాళ్ల వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు.

# రష్యా చమురు దిగుమతులకు అమెరికా తాత్కాలిక లైసెన్స్



**వాషింగ్టన్,మే 19:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేస్తున్న వేళ అమెరికా భారత్ సహా అధికంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పిస్తూ ఓ తాజా లైసెన్స్‌ను జారీ చేసింది. అయితే భారత్ ఈ లైసెన్సులపట్ల స్పష్టమైన వైఖరితో ఉంది. భారత ప్రయోజనాల ఆధారంగానే తమ దిగుమతులు ఉంటాయని ఎవరిపైనా ఆధారపడే ప్రసక్తి ఉండదని స్పష్టంచేసింది. అయితే యుఎస్ ఆంక్షల కారణంగా సముద్రంలో చిక్కుకుపోయిన రష్యా ముడి చమురు కార్గోలను స్వీకరించేందుకు 30 రోజుల పాటు అగ్రరాజ్యం అనుమతి ఇచ్చింది. హార్ముజ్ జలసంధి వద్ద నెలకొన్న ఆందోళనలతో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో ఉన్న తరుణంలో ఈ చర్య కీలకంగా మారింది. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఈ తాత్కాలిక లైసెన్స్, ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసి సముద్ర మార్గంలో ఉన్న రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను అందుకునేందుకు మాత్రమే వర్తిస్తుంది. దీని ద్వారా కొత్తగా రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకోవడానికి గానీ, కొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి గానీ అవకాశం లేదు. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలకు మద్దతుగా, సరఫరాలో అంతరాయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ సోషల్‌మీడియా హ్యాండిల్‌లో తెలిపారు. భౌతిక క్రూడ్ మార్కెట్‌ను స్థిరీకరించడం, ఇంధన అవసరాలు అధికంగా ఉన్న దేశాలకు చమురు చేరేలా చూడటం కూడా ఈ లైసెన్స్ ఉద్దేశమని ఆయన వివరించారు. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు ముఖ్యమే ఎందుకంటే తన మొత్తం చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడే భారత్, ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులో ఏ చిన్న మార్పు జరిగినా తీవ్రంగా ప్రభావితమవుతుంది.

# విజయ్ సర్కార్ ఎప్పుడైనా కూలిపోతుంది

## త్వరలోనే తమిళనాడులో మళ్లీఎన్నికలు: స్టాలిన్



**చెన్నై, మే 19:** తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ జిల్లా కార్యదర్శులతో సమావేశమైన స్టాలిన్, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తన అంచనాలను వివరించారు. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో టీవీకేకు 107, దాని మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 5 సీట్లు ఉన్నాయి. డీఎంకే మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్‌కు చెందిన 8 మంది ఎమ్మెల్యేలు బయటి నుంచి ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు. వీటికి తోడు, గత వారం జరిగిన విశ్వాస పరీక్షలో ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల మద్దతు కూడా విజయ్ ప్రభుత్వానికి ఉంది. ఈ సమీకరణాలు ఎంతకాలం నిలుస్తాయనే దానిపై డీఎంకే వర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. బయటి నుంచి మద్దతిస్తున్న పార్టీలు వైదొలిగినా, రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ లేదా కోర్టు అనర్హత వేటు వేసినా ప్రభుత్వానికి రాజకీయ అస్థిరత తప్పదని ఆ పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ తన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఓటమి తాత్కాలికమే. ప్రస్తుత ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు. సిద్ధంగా ఉండండి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మనం తిరిగి పుంజుకుని మళ్లీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓటమికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నానని, కోలత్తూరులో తన ఓటమిని కూడా అంగీకరిస్తున్నానని తెలిపారు. తమిళనాట సూర్యుడు (డీఎంకే గుర్తు) అస్తమించడని ఆయన వ్యాఖ్యానించారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించేందుకు, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించేందుకు 36 మంది సభ్యులతో ఒక కమిటీని కూడా స్టాలిన్ ఏర్పాటు చేశారు.

# మద్రాస్ హైకోర్టుకు 19మంది జడ్జిలు

### - 10మంది న్యాయవాదులు, 9 మంది న్యాయాధికారులు

### - సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు

**న్యూఢిల్లీ, మే 19:** మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా 19 మందిని నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. కొలీజియం సిఫార్సు చేసిన 19 పేర్లలో 10 మంది న్యాయవాదులు, 9 మంది న్యాయాధికారులు ఉన్నారు. న్యాయవాదులు పి. మురుగన్, ఎం.డి. సుమతి, ఎస్. అల్లి, సి. తిరుమగళ్ చంద్రశేఖర్, ధర్మలింగం లింగేశ్వరన్, కార్తికేయన్ బాలదండాయుధం, నటరాజన్ రమేష్, జి.కె. ముత్తుకుమార్, రామకృష్ణన్ రాజేష్ వివేకానందన్, శంకరనారాయణన్ రవీకుమార్, నాగరాజన్ దిలీప్ కుమార్, ఎల్లప్పన్ మనోహరన్‌ల మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసింది. అలాగే, న్యాయాధికారులు కృష్ణస్వామి గోవిందరాజన్, రజనీష్ పాతియిల్, కె. అప్పదురై అలియాస్ కందవేల్ అప్పదురై, రామస్వామి అనిత, షణ్ముగం కార్తికేయన్, బాలుస్వామి మురుగేశన్, ఎన్. గుణశేఖరన్ న్యాయమూ ర్తులుగా పదోన్నతి కల్పించడానికి సిఫార్సు చేశారు. నవంబర్ 4, 2025, నవంబర్ 21, 2025, డిసెంబర్ 7, 2025, డిసెంబర్ 10, 2025 తేదీలలో వచ్చిన నాలుగు ప్రతిపాదనలను సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలించి ఈ మేరకు సిఫార్సులు చేసింది.

# గల్ఫ్‌దేశాల విజ్ఞప్తితో ఇరాన్‌పై దాడిని నిలిపివేసాం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,మే 19:** ఇరాన్‌పై జరపాల్సిన సైనిక దాడిని చివరి నిమిషంలో వాయిదా వేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. గల్ఫ్ దేశాల నేతలు చేసిన విజ్ఞప్తి మేరకు దౌత్యపరమైన చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం ఇరాన్‌పై చాలా పెద్ద దాడికి మేం సిద్ధమయ్యాం. కానీ సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాల నేతలు నన్ను సంప్రదించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరేందుకు చర్చలు చాలా దగ్గరగా ఉన్నాయని, రెండు మూడు రోజుల సమయం ఇవ్వాలని కోరారు. దీంతో దాడిని కొంతకాలం పాటు వాయిదా వేశానని వివరించారు. ఈ వాయిదా శాశ్వతంగా ఉండాలని ఆశిస్తున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఇరాన్ చేతికి అణ్వాయుధం వెళ్లకుండా నిరోధించగలిగితే, అదే మాకు సంతృప్తినిస్తుంది. వారిపై బాంబుల వర్షం కురిపించకుండానే ఈ పని పూర్తయితే నేను చాలా సంతోషిస్తానుఅని ట్రంప్ స్పష్టం చేశారు. దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు తాము సిద్ధంగానే ఉన్నామని హెచ్చరించారు. దాడి వాయిదా విషయాన్ని ఇజ్రాయెల్, ఇతర మిత్రదేశాలకు ఇప్పటికే తెలియజేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ తమ సైనిక చర్యలతో ఇరాన్ సైన్యాన్ని, మొదటి స్థాయి నాయకత్వాన్ని ఇప్పటికే పూర్తిగా నాశనం చేశామని సంచలన వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే పూర్తిస్థాయి దాడికి సిద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌ను ట్రంప్ ఆదేశించినట్లు తెలిసింది.

# సైనిక సామర్థ్యం పెంపుకోసం అమెరికాతో ఒప్పందాలు

### అపాచీ హెలికాప్టర్లు, హోవిట్జర్ల నిర్వహణకు భారీ నిధులు

**న్యూఢిల్లీ,మే 19:** భారత్‌అమెరికా రక్షణ సంబంధాలు మరింతగా బలపడినట్లు తాజా ఒప్పందం స్పష్టంచేస్తోంది. భారత సైనిక సామర్థ్యాన్ని పెంచే దిశగా అమెరికా మద్దతు ఇచ్చింది. అపాచీ హెలికాప్టర్లు, ఎం777 హోవిట్జర్ల నిర్వహణ మద్దతు కోసం సుమారు 428.2 మిలియన్ డాలర్ల విలువైన రెండు సైనిక ఒప్పందాలకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మే 18న అమెరికా కాంగ్రెస్‌కు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ ఒప్పందాల్లో మొదటిది ఎం777ఎ2 అల్ట్రాలైట్ హోవిట్జర్ల దీర్ఘకాలిక నిర్వహణకు సంబంధించింది. దీని విలువ 230 మిలియన్ డాలర్లు. ఈ ప్యాకేజీలో విడిభాగాలు, మరమ్మతులు, శిక్షణ, సాంకేతిక సాయం, ఫీల్డ్ సర్వీస్ వంటివి ఉంటాయి. ఈ ఒప్పందానికి బీఏఈ సిస్టమ్స్ ప్రధాన కాంట్రాక్టర్‌గా వ్యవహరించనుంది. రెండో ఒప్పందం ఎహెచ్64ని అపాచీ హెలికాప్టర్ల నిర్వహణకు సంబంధించినది. దీని విలువ 198.2 మిలియన్ డాలర్లు. ఇంజినీరింగ్, సాంకేతిక, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బందికి శిక్షణ వంటి సేవలు అందిస్తారు. బోయింగ్, లఖీడ్‌మార్టిన్ సంస్థలు ఈ ఒప్పందానికి ప్రధాన కాంట్రాక్టర్లుగా ఉన్నాయి. ఈ ఒప్పందాలు ఇండోపసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించడానికి దోహదపడతాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది.

# సంక్షిప్తంగా..

## భారత్‌లో లేని ఎయిర్‌బేస్‌లపై పాకిస్థాన్ దాడి చేసిందట!

**ఇస్లామాబాద్, మే 19:** గతేడాది భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా తాము 'బునియాన్ ఉల్ మర్సూస్' ఆపరేషన్‌ను చేపట్టామని పాకిస్థాన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆ సమయంలో భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్ బేస్‌లను తమ క్షిపణులు తాకినట్లుగా గొప్పలు చెప్పారు. అయితే అక్కడ అసలు ఎయిర్ బేస్‌లే లేవనే విషయాన్ని మాత్రం గ్రహించలేకపోయారు. రాజౌరీ జమ్మూకాశ్మీర్‌లోని ఓ జిల్లా. అక్కడ ఎటువంటి భారత వైమానిక దళ ఎయిర్‌బేస్ లేదు. మామూన్ పంజాబ్‌లోని పఠాన్‌కోట్ సమీపంలో ఉన్న ఓ కంటోన్మెంట్ ప్రాంతం.

ఈ విషయం కూడా తెలుసుకోకుండా వాటి పేర్లు ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు ఆయనను ట్రోల్ చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో తమకు భారత్‌లోని రాజౌరీ, మామూన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాక్ అధికారి పేర్కొన్నారు.

## పంజాబీ గాయని ఇందర్‌కౌర్ హత్య



**మోగా(పంజాబ్), మే 19:** ప్రముఖ పంజాబీ గాయని ఇందర్ కౌర్ దారుణ హత్యకు గురైంది. పెళ్లికి అంగీకరించలేదని ఓ మృగాడు అత్యంత దారుణంగా చంపేసి మృతదేహాన్ని కాలువలో పడేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఇందర్ కౌర్ ప్రముఖ పంజాబ్ గాయని. మోగాలోని భలూర్ గ్రామానికి చెందిన సుఖ్వీందర్ సింగ్ అనే వ్యక్తి బలవంతంగా పెళ్లి చేసుకవడానికి తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. కానీ అందుకు ఇందర్ కౌర్ నిరాకరిస్తూ వస్తోంది. దీంతో సుఖ్వీందర్ సింగ్ పగ పెంచుకున్నాడు. ఈ నెల 13న రాత్రి 8:30 గంటలకు కారులో సరుకులు తేవడానికి ఇందర్ కౌర్ బయటకు వెళ్లింది. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటికి రాకపోవడంతో భయాందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## గోట్ చిత్రం నంబర్‌ప్లేట్‌ను సిఎం విజయ్‌కు బహూకరించిన దర్శకుడు




**చెన్నై, మే 19:** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ నటుడు విజయ్‌ను దర్శకుడు వెంకట్ ప్రభు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ గోట్ చిత్రంలో విజయ్ పాత్ర నడిపిన కారుకు ఉపయోగించిన టిఎన్07 సీఎం2026 అనే ఐకానిక్ నంబర్ ప్లేట్‌ను ఆయనకు బహూకరించారు. ఈ ఘటనతో 2024లో విడుదలైన ఆ చిత్రంలోని ఓ సన్నివేశం మరోసారి వార్తల్లోకి వచ్చింది. గోట్ చిత్రంలో విజయ్ టిఎన్07 సీఎం 2026 నంబర్ ప్లేట్ ఉన్న కారులో కనిపిస్తారు.

అప్పట్లో ఈ సన్నివేశంపై పెద్దగా చర్చ జరగకపోయినా, విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసి, ముఖ్యమంత్రి కావడంతో ఇప్పుడు ఈ నంబర్ ప్లేట్ ఒక జోస్యంలా మారిపోయింది.

## ప్రభాకరన్ వర్ధంతి రోజున టివికె విజయ్ నివాళి

**చెన్నై, మే 19:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత జోసెఫ్ విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌టీటీఈ వ్యవస్థాపకుడు వేలుపిళ్లై ప్రభాకరన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు విజయ్ తన ఎక్స్ ఖాతాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. శ్రీలంక సైన్యం చేతిలో ప్రభాకరన్ మరణించిన ముల్లివైకల్ ఘటనను విజయ్ గుర్తుచేసుకున్నారు. ముల్లివైకల్ చేదు జ్ఞాపకాలను మేం ఎప్పటికీ గుండెల్లో మోస్తూనే ఉంటాం అని పేర్కొన్నారు. శ్రీలంకలో తమిళ హక్కుల కోసం ఎప్పుడూ అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. 1991లో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో ప్రభాకరన్ ప్రధాన నిందితుడు. ఈ కారణంగానే భారతదేశంలో ఎల్‌టీటీఈ సంస్థపై నిషేధం కొనసాగుతోంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మపై విచారణ - లోక్‌సభ స్పీకర్‌కు నివేదిక అందజేత

**న్యూఢిల్లీ, మే 19:** హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై నియమించిన విచారణ కమిటీ, తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. ఈ నివేదికను పార్లమెంట్ హౌస్‌లో, న్యాయమూర్తుల విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ లాంఛనంగా అందజేశారు. కమిటీ సభ్యులు బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్య కూడా ఆయనతో పాటు ఉన్నారు. కమిటీ కార్యదర్శి గణపతి భట్, కన్సల్టెంట్ న్యాయవాదులు కరణ్ ఉమేష్ సాల్వీ, సమీక్ష దువా కూడా హాజరయ్యారు. విచారణ పెండింగ్‌లో ఉండగానే జస్టిస్ వర్మ ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ వర్మను తొలగించాలని కోరుతూ 146 మంది లోక్‌సభ సభ్యులు సంతకం చేసిన అభిశంసన తీర్మానాన్ని అనుసరించింది.

## పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించండి

● ముఖ్యమంత్రి సిపిఎం నేత బి.వి.రాఘవులు లేఖ



**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ జిల్లా పంచగ్రామాల భూ సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు లేఖ రాశారు. దీనికి సంబంధించిన ప్రకటనను సీపీఎం రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం విజయవాడలో విడుదల చేశారు. గత మూడు దశాబ్దాలుగా విశాఖ జిల్లా పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కాకపోవడంతో సుమారు 2 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రభుత్వం 2014లో విశాఖలో జరిపిన మొట్టమొదటి కేబినెట్ సమావేశంలో ఈ సమస్య వంద రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నేటికి 12 సంవత్సరాలు పూర్తయ్యాయి. అయినా ఇంకా పరిష్కారం కాలేదు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించే చర్యలు చేపట్టాలని, ఈలోగా నిర్మాణాలను, రిపేర్లను అనుమతించాలని, క్రయ విక్రయాలను, రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని కోరుతున్నాను అని బివి.రాఘవులు లేఖలో పేర్కొన్నారు.

## పెదపేట దళితవాడపై నిర్బంధం తొలగించండి

● సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పెదపేట దళితవాడపై నిర్బంధం తొలగించాలని సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేసారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం లేఖ రాశారు. దీనికి సంబంధించిన ప్రకటనను విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం పెదపేట దళిత వాడను ఈనెల 16వ తేదీన మాపార్టీ స్థానిక కార్యకర్తలతో కలిసి సందర్శించాను. బలహీనులుగా అణచివేతకు గురయ్యే దళితులకు రక్షణ కల్పించి వారు గౌరవంగా జీవించేందుకు మన రాజ్యాంగం అనేక హక్కులను కల్పించింది. వాటిని అమలు చేసి, దళితులకు పేదలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఈ విషయాలు మీకు తెలుసు. కానీ ఆ గ్రామంలో శ్రీరామనవమి రోజున గొంతేనమ్మ గుడిలో బలవంతంగా శంకుస్థాపన చేసి స్థానిక దళితవాడపై దాడిచేశారు. దళితవాడ మీదకు దాడికి వచ్చిన వారిని వదిలేసి ప్రశ్నించిన వారిని, అవమానాన్ని ప్రతిఘటించిన వారిని అక్రమంగా అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో యువకులను లాఠీలతో కొట్టారు. తీవ్రంగా హింసించారు. పోలీసు కస్టడీలో యువకులను హింసించిన అధికారులపై విచారించి చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు నిన్న పెదపేట దళితవాడలో యధాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలను జిల్లా కలెక్టర్ అమలు చేయాలి. పెదపేట దళితులపై నిర్బంధాన్ని ఆపండి. ప్రాథమిక హక్కులను కాపాడండి. పోలీసు కస్టడీలో యువకులను హింసించిన అధికారులపై విచారించి చర్య తీసుకోవాలి అని డి.రమాదేవి లేఖలో పేర్కొన్నారు.

## పాదయాత్రలు చేసినంతమాత్రాన ప్రజల మన్నన అందరికి లభించదు

● ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పాదయాత్రలు చేస్తే ప్రజలు మన్నన అందరికి లభించిందని, జగన్‌లాంటి వారిని జనం విశ్వసించరని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. మంగళవారం పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల, కీలకం వైసిపి కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరందరి కండువా కప్పి షర్మిల పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రత్న భవనం(విజయవాడ) వేదికగా షర్మిల మీడియాతో మాట్లాడారు. నేటికి వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ప్రజలకు అపారమైన అభిమానం, ప్రేమ ఉన్నాయని వ్యాఖ్యానించారు. భూతద్దం పెట్టి వెతికినా వైఎస్ లాంటి వారు పుట్టరని అన్నారు. వైఎస్ పేరు చెప్పుకుని జగన్ ఒక్క ఛాన్స్ అంటూ పాదయాత్ర చేశారని షర్మిల అన్నారు. ఆయన సీఎం అయ్యాక స్విచ్‌లు నొక్కడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం స్విచ్‌లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు అవరనేది కొంతమంది తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ మధ్య నాయకులు సీఎం అవగానే ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ రెండో సారి సీఎం అయ్యాక ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయించారని, ఈ క్రమంలో రచ్చబండకు వెళ్తుండగా చనిపోయారని ప్రస్తావించారు. తండ్రి ఆశయాలను సాధిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న వారు ఆ తర్వాత ఆయన ఆశయాలనే నాశనం చేశారని షర్మిల దుయ్యబట్టారు. నిన్న సిగ్గులేకుండా వైసీపీ నేతలు ధర్నాలు చేశారని సెటైర్లు గుప్పించారు. వాళ్ల ప్రభుత్వంలో భారాలు మోపిన విషయాలు మరిచారా? అని ప్రశ్నించారు. జగన్ సీఎం అయ్యాక కూడా ప్రధాని మోదీ చెప్పినట్లుగా తల ఆడించారని విమర్శించారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల ఎద్దేవా చేశారు.

## తుడా చైర్మన్ దివాకర్ రెడ్డికి ఎస్వియు డాక్టరేట్

**తిరుపతి, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తుడ చైర్మన్, టిటిడి బోర్డు సభ్యుడు సి.దివాకర్‌రెడ్డికి తిరుపతి ఎస్వీయూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగంపై ఆయన పరిశోధన చేశారు. ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య జి. సవరయ్య పర్యవేక్షణలో, కో రీసెర్చ్ సూపర్‌వైజర్ ఆచార్య ఆర్.సునీత మార్గదర్శకత్వంలో దివాకర్ రెడ్డి తన పరిశోధనను పూర్తి చేశారు. 'కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు: చిత్తూరు జిల్లాలో ఒక కేస్ స్టడీ' ప్రాధాన్యత కలిగిన అంశంపై సుదీర్ఘ పరిశోధన చేసి, రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు కంట్రోలర్ వివరించారు. పరిశోధనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సుమారు 312 మంది కౌలు రైతుల కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను దివాకర్ రెడ్డి నిశితంగా విశ్లేషించారు. దివాకర్ రెడ్డికి పిహెచ్‌డి డిగ్రీ ప్రధానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి.రాజమాణిక్యం తెలిపారు.

# గన్నవరంలో సీ-డాక్ కేంద్రం ఏర్పాటు

● మంత్రి లోకేష్‌తో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ చర్చలు

**గన్నవరం, మే 19 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ, వీఎల్ఎస్ఐ వంటి ఆధునిక సాంకేతిక విభాగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గన్నవరంలో సీ-డాక్ కేంద్రం (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) ఏర్పాటును వేగవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి చేసారు. మంగళవారం ఉండవల్లిలో నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసిన యార్లగడ్డ సీ-డాక్ కేంద్రం ఏర్పాటు పై చర్చలు జరిపారు. ఈసందర్భంగా గన్నవరంలో సీ-డాక్ బృందం పర్యటించిన కేంద్రం ఏర్పాటు కోసం తనతో చర్చలు జరిపిన సంగతిని లోకేష్‌కు వివరించారు. ఈకేంద్రం సత్వరమే ఏర్పాటు చేసేలా కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్‌తో మాట్లాడాలని కోరారు. దేశంలోనే 13వ సీ-డాక్ కేంద్రం గన్నవరంలో ఏర్పాటు కానుండగా, ఈప్రాజెక్టు కోసం రాష్ట్రప్రభుత్వంపై ఏవిధమైన భారం పడదని, కేంద్రప్రభుత్వం నుండి రూ.200 కోట్ల నిధులు మంజూరవుతాయని వివరించారు. ఈకేంద్రం ఏర్పాటు అయితే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సత్వరమే స్పందించి కేంద్రమంత్రితో మాట్లాడాలని యార్లగడ్డ కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ కేంద్రమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి ప్రాజెక్టు మంజూరు ప్రక్రియను వేగవంతం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.



# దేవాలయాల్లో బయోగ్యాస్, పైప్డ్ గ్యాస్ ప్లాంట్లు

● దేవాదాయశాఖ ఎక్స్ అఫీషియో సభ్యుడు హరి జవహర్‌లాల్ ● సమాజానికి దేవాలయాలు భారం కాకూడదని సూచన



**ఇంద్రకీలాద్రి, మే 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రాష్ట్రంలోని దేవాలయాల్లో బయోగ్యాస్, పైప్డ్ గ్యాస్ ప్లాంట్లు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ ఎక్స్ అఫీషియో డా ఎం హరిజవహర్‌లాల్ ఆదేశాలిచ్చారు. మంగళవారం విజయవాడలోని దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు చెందిన 22 మంది ఇఓలతో సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో జీరో వేస్ట్ డిస్పోజల్ పాలసీ అమలు చేయాలన్నారు. భక్తులకు ఆన్‌లైన్‌సేవలను విరివిగా అందుబాటులో వుంచాలన్నారు. సమాజానికి దేవాలయాలు భారం కాకూడదు, దేవాలయాలే సమాజ భారాన్ని మోసేలా వుండాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా దేవాలయాల చెత్తను వేస్ట్ డంపింగ్ యార్డులకు పంపకుండా జీరో వేస్ట్ డిస్పోజల్ పాలసీ అమలు చేయాలన్నారు. పారిశుధ్యంలో మెరుగైన విధానలు అవలంభించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం సక్సెస్ మంత్రను అమలు చేయాలన్నారు. భూగర్భ జలాల పెంపుకోసం రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ అమలు చేయాలన్నారు. నీటిశుద్దికోసం సూయజ్, సట్లేజ్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటిని శుద్ది చేయాలన్నారు. సోలార్ విద్యుత్తును గరిష్టంగా వినియోగించాలన్నారు. దేవాలయాల్లోని సేవకుల ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాల వ్యాప్తతో పాటు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రచారం నిర్వహించాలన్నారు. పర్యావరణ అనుకూల హరిత ఆలయాలుగా ఏపిలో దేవాలయాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కమీషనర్ రామచంద్రమోహన్, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాల అభివృద్ది పనుల పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు.



## జలధార పనులు వేగవంతం చేయాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త:** జిల్లాలో జలధార పనులు వేగవంతం చేసి చెరువుల్లో పూడికతీత, గట్లు బలపరచటం, కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో జిల్లాలో జలధార పనులు జరుగుతున్న తీరుపై జలవనరులశాఖ, డ్వామా అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసంద్భంగా జలధార పనుల పురోగతిపై ఆరా తీసిన కలెక్టర్ చెరువుల అభివృద్ధితోపాటు గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భజలాల పెంపు కోసం జలధార కార్యక్రమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 766 పనులు మంజూరు కాగా 578 పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పూర్తిచేసి మిగిలిన పనులు పూర్తిచేయాలని సూచించారు.

### టిమ్ ఎన్‌టిఆర్ కృషితో మ్యూజియం డే విజయవంతం

ఎన్‌టిఆర్‌జిల్లాలోని వివధ ప్రభుత్వశాఖల అధికారుల సమిష్టి కృషితో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలను విజయవాడలో విజయవంతం చేసామని ఇందులో పాల్గొన్న ప్రతిఒక్కరిని అభినందిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. సోమవారం బాపు మ్యూజియంలో నిర్వహించిన కార్యక్రమాల పట్ల ప్రజల నుండి విశేషస్పందన లభించినట్లు కలెక్టర్ పెర్కొన్నారు. భవిష్యత్‌లోనూ ఇటువంటి చారిత్రక, వారసత్వ పరిరక్షణకు ఇటువంటి కార్యాక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ప్రకటించారు.

## హైకోర్టు న్యాయవాది అంజన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ వర్గీయులు దాడి

**అనంతపురం, మే 19 ప్రభాతవార్త బ్యూరో:** హైకోర్టు న్యాయవాది అంజన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ వర్గీయులు దాడి చేశారు. గత ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయలేదని కారణంతో పాటు మంత్రి సత్యకుమార్‌పై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని కారణంతో దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. నీతో మాట్లాడాలంటూ ధర్మవరం ఆస్పత్రిలో సిసి కెమెరాలు లేని ప్రాంతానికి తీసుకెళ్లి అంజిరెడ్డి పై దాడి చేశారు. అడ్వకేట్ అంజన్ రెడ్డి పై దాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి వర్గీయులు తెలిపారు. ధర్మవరం మండలం, తిప్పేపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ అంజన్ రెడ్డి స్థానిక ఆసుపత్రికి వెళ్లి, సూపరింటెండెంట్‌తో మాట్లాడుతుండగా, మంత్రి అనుచర వర్గం ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగారని అంజిరెడ్డి బంధువులు చెబుతున్నారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితుడికి పూర్తి రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా అంజన్ రెడ్డి పై దాడి విషయం తెలిసిన వెంటనే శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కూడా స్పందించి న్యాయవాది అంజిరెడ్డి తో ఫోన్లో మాట్లాడినట్లు, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.



# పొదల మధ్య ఎలక్ట్రీషియన్ మృతదేహం.. హత్య? లేక ఆత్మహత్య?

● పాల వాగు సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యం

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐ సుబ్బారావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు

**వింజమూరు (నెల్లూరు), మే 19 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా వింజమూరు నైరుతి దిక్కున ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వింధ్య పరమేశ్వరి అమ్మవారి ఆలయ మార్గంలో తీవ్ర కలకలం రేగింది. పాల వాగు సమీపంలోని పొదల మధ్య ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే కలిగిరి సీఐ పి.సుబ్బారావు, వింజమూరు ఎస్సై ఎం.ఉమా మహేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

పొదల మధ్య మూడు రోజుల క్రితం నాటి శవం. పోలీసులు ఘటనా స్థలంలో విస్తృతంగా గాలించగా, పొదల మధ్య కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యమైంది. ఆ వ్యక్తి సుమారు మూడు, నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉండటాన్ని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మృతదేహం వద్ద ఉన్న ఆధార్ కార్డు, బైక్ నంబర్ ఆధారంగా.. మృతుడు కలిగిరి మండలం వీర్నకొల్లు గ్రామానికి చెందిన మేదరమెట్ల వెంకటేశ్వర్లు కుమారుడు మేదరమెట్ల శ్రీకాంత్(32)గా గుర్తించారు. ఇంటికొస్తాడనుకుంటే.. అనంత లోకాలకు మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్ అయిన శ్రీకాంత్ శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎక్కడైనా కరెంటు పని చేసుకుంటూ ఉండి ఉంటాడని శని, ఆదివారాలు కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఎంతకీ రాకపోవడంతో సోమవారం కలిగిరి పోలీసు స్టేషన్‌లో శ్రీకాంత్ కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు.

అంతలోనే వింజమూరు కొండ దారిలో పాల వాగు సమీపంలో శవమై తేలడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**మిస్టరీగా మారిన మృతి:** శ్రీకాంత్‌కు ఎవరితోనూ గొడవలు లేవని, ఎలాంటి దురుసు ప్రవర్తన లేని పద్ధతి గల యువకుడని తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించారు. అసలు వింజమూరు కొండ ప్రాంతానికి శ్రీకాంత్ ఎందుకు వచ్చాడు..? ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా ఇక్కడికి రప్పించి అంతమొందించారా..? అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. వింజమూరు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయరాజు, కానిస్టేబుల్ సుభాన్‌లు ఉన్నారు.

## తిరుమలలో విషాదం

### నిర్మాణ భవనంపై నుండి పడి కార్మికుడి మృతి

**తిరుమల, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పాపనవినాశనం మార్గంలోని అవధూత దత్తపీఠం ప్రాంగణంలో ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి క్రిందపడి కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. తిరుమలలోని దత్తపీఠం భవనంపై నాల్గవ అంతస్థులో నీళ్ళట్యాంక్ ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకు గాను కాంట్రాక్టర్ కొందరు కూలీలను రప్పించుకున్నాడు. వారిలో తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు వానియంబాడికి చెందిన మణికంఠన్ (35) ఉన్నాడు. భవనంపై ఉన్న వాటర్ ట్యాంక్‌ను మరమ్మతు (రిపేర్) చేస్తున్న సమయంలో మణికంఠన్ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. భవనం పైనుంచి పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న తోటి కార్మికులు, పీఠం సిబ్బంది వెంటనే స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మణికంఠన్ ప్రాణాలు కోల్పో యాడు, మృతునికుటుంబం కూడా తిరుమలలోనే కార్మికులుగా ఉన్నారు. దీంతో తిరుమల కొండపై మంగళవారం విచారకరమైన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు ప్రారంభించారు.

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మే 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మే 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను స్కూల్ లాగిన్‌లలో పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డా.కేవీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మనమిత్ర వాట్సప్ నంబర్ 95523 00009 ద్వారా నేరుగా ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఎగ్జామ్ హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా, తమ అధికారిక వెబ్‌సైట్‌లోనూ హాల్‌టికట్లను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ మార్చి 2026 రోల్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలు పొడిగింపు

**విజయవాడ, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొడిగించింది. 123 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 120 మంది కంప్యూటర్ టీచర్ల సేవలను పునరుద్ధరించింది. 2026 జూన్ 1వ తేదీ నుంచి 2027 ఏప్రిల్ 30వ తేదీ వరకు 11 నెలల పాటు సేవలకు అనుమతి ఇచ్చింది. అకడమిక్ ఇయర్ 2026- 27 కోసం కాంట్రాక్ట్ సిబ్బందికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక నెల విరామంతో సేవల కొనసాగింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీఓ ఆర్టీ నంబర్51ను స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఫైనాన్స్ శాఖ అనుమతితో ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఆచార్య రాచపాలెంకు అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం



**అనంతపురం, మే 19 ప్రభాతవార్త బ్యూరో:** ప్రసిద్ధ అభ్యుదయకవి అడిగోపుల వెంకటరత్నం పేరు మీద ఆయన కుటుంబ సభ్యులు నెలకొల్పిన "అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం 2026" కు సుప్రసిద్ధ అభ్యుదయ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు అవార్డు వ్యవస్థాపకులు, అడిగోపుల కుటుంబ సభ్యులు వెల్లడించారు. జులై నెల రెండవ వారంలో తిరుపతిలో జరగనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని రాచపాలెంకు అందజేయనున్నట్లు ఆస్ట్రేలియా నుంచి "తెలుగుసందడి" సాహిత్య, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకుడు అడిగోపుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, తెలుగు; పిహెచ్.డి (197077) చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయాలలో 38 ఏళ్ళు తెలుగు అధ్యాపకుడుగా పని చేశారు. 102 విమర్శ, పరిశోధన, కవిత్వ, సంపాదక పుస్తకాలు ప్రచురించారు. 45 మంది పరిశోధకులకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

# రూ.1 కోటి విలువైన 500 మొబైల్ ఫోన్లు రికవరీ

● ఇతర రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి స్వాధీనం



**తిరుపతి, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పోలీసులు 'మొబైల్ రికవరీ మేళా' కార్యక్రమంలో 14వ దశలో భాగంగా సుమారు కోటి రూపాయలు విలువైన 500 మొబైల్ ఫోన్లను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశారు. ఆ మొబైల్ ఫోన్లన్నీటినీ బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు నిర్వహించిన 13 దశల్లో మొత్తం 10.52 కోట్లు విలువైన 4,785 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడం జరిగిందని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగంగా మారిందన్నారు. అలాంటి ఫోన్ పోగొట్టుకున్నప్పుడు ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటి నుంచే సిఇఐఆర్ సేవల ద్వారా ఫిర్యాదు నమోదు చేసి తమ మొబైల్ ఫోన్లను తిరిగి పొందే అవకాశం కల్పించామని తెలిపారు. తిరుపతి జిల్లా పోలీసులు ఆంధ్రప్రదేశ్‌తో బాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి కూడా మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు సిఇఐఆర్ సేవలను పొందేందుకు 9490617873 వాట్సాప్ నంబర్‌కు హై అని మెసేజ్ పంపడం ద్వారా సిఇఐఆర్ లింక్‌ను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ నంబర్ ద్వారా సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడానికి అవసరమైన పూర్తి మార్గదర్శకం మరియు సాంకేతిక సహాయం అందించబడుతుందని వివరించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా ఫోన్ రికవరీ అవకాశాలు పెరుగుతాయి. సైబర్ మోసాలు డిజిటల్ నేరాల నుండి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ బలమైన పాస్‌వర్డు ఉపయోగించడంతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దు. ప్రజల ఆస్తుల రక్షణకు తిరుపతి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తారు. కేంద్ర ప్రభుత్వ సేవ అయిన సిఇఐఆర్ పోర్టల్ (హెచ్‌టిటిపిఎస్://డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సిఇఐఆర్.జివొవి.ఇన్) ద్వారా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన సందర్భంలో ఆన్లైన్లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌లు రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ సిబ్బందికి ప్రశంస పత్రాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటరావు, సైబర్ సెల్ సిఐ వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీలం సంజీవరెడ్డి పదవులకే వన్నె తెచ్చారు!

● అనంతలో ఘనంగా నీలం 113వ జయంతి వేడుకలు

**అనంతపురం, మే 19 ప్రభాతవార్త బ్యూరో:** గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎన్నో పదవులు అనుభవించాడని, దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన వ్యక్తి నీలం సంజీవరెడ్డి అని ఎడిసిసి మాజీ ఛైర్మన్ తరిమెల కోనా రెడ్డి కొనియాడారు. మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి 113వ జయంతి సందర్భంగా అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపిఐడిసి మాజీ ఛైర్మన్ నల్లపరెడ్డి, అగ్రికల్చర్ అడ్వైజరీ మాజీ ఛైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, తదితర నీలం సంజీవరెడ్డి అభిమానులు సంజీవరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో సాగునీటి సౌకర్యాలకు ఎంతో కృషి చేశారని, రాజకీయ పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి నీలం సంజీవరెడ్డి అని తరిమెల కోనా రెడ్డి, నల్లపురెడ్డి, రామచంద్రారెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. పార్టీలో పిసిసి, ఎఐసిసి పదవులను అధిరోహించి రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా తెలుగు ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన నేత నీలం అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.

రైతు బిడ్డ రాష్ట్రపతి కావడం సాధారణమైన విషయం కానప్పటికీ ఆ పదవిని ఏకగ్రీవంగా చేజిక్కించుకోవడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయడంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో రాణించడంతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆయన ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. నేటి యువతీ యువకులు నీలం సంజీవరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా గార్లదిన్నె మండలం కల్లూరులో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విగ్రహం వద్ద ఘనంగా సంజీవరెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అభిమానుల మధ్య కేక్ కూడా కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూడా ఎడిసి బ్యాంకు మాజీ అధ్యక్షుడు కోనారెడ్డి, ఎపిఐడిసి మాజీ చైర్మన్ నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# కూటమి ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం

## ● టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి

**తిరుపతి హెల్త్, మే 19 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం జరిగిందని మాజీ కేంద్రమంత్రి, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి మండిపడ్డారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలనలో దళితులపై 56వేల దాడులు, 250కి పైగా హత్యలు జరిగాయని అన్నారు. ఒక ఎమ్మెల్సీ తన కారు డ్రైవర్ దళితుడైన సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేయడం నుండి డాక్టర్ సుధాకర్ మరణం వరకు ఎన్నో ఆకృత్యాలు వైసిపి ప్రభుత్వం లో జరిగాయని ధ్వజమెత్తారు. ఎస్సీలకు చెందిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేయడం, ఎస్సీ కార్పొరేషన్ నిధులను వేరే వాటికి బదిలీ చేసి ఎస్సీల కడుపు కొట్టిన ఘనత కూడా జగన్ దే అన్నారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. అదే 2024 ఎన్నికల్లో కూటమి తరపున ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో 80శాతం నెరవేర్చారన్నారు. ఈరోజు మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం లక్ష మందికి 20వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం అన్నారు. తిరుపతిలో ఉన్న మాజీ టీటీడీ చైర్మన్ గత రెండేళ్లుగా పని పాట లేకుండా తిరుమలపై ఆరోపణలు చేయడమే పెట్టుకున్నారని దుయ్యబట్టారు. తిరుమలలో అన్ని రంగాలలో అవినీతి ఏదైనా జరిగిందంటే అది వైసీపీ పాలనలో నేనని, దానికి కర్త, కర్మ, క్రియ భూమన కరుణాకర్ రెడ్డి అని ఆరోపించారు. శ్రీ వాణి టికెట్లలో అవినీతి జరిగిందని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీటీడీ పారదర్శకంగా ఆన్లైన్ లో టికెట్లు కేటాయిస్తే భక్తులు బుక్ చేసుకోవడం జరుగుతోందన్నారు. అవతల వారిపై ఒక వేలు చూపిస్తే మన వైపు 3 వేళ్ళు చూపిస్తాయి అనే నగ్న సత్యాన్ని భూమన కరుణాకర్‌రెడ్డి గుర్తు ఎరగాలని హితవు పలికారు. అనంతరం యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ గత ఐదేళ్ల పాలనలో అతను అన్ని వర్గాలను మోసం చేశాడని మండిపడ్డారు. కూటమి పాలనలోని టీటీడీ పాలకమండలి పారదర్శకంగా ఉంటూ తిరుమలను అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల రూపంలో వస్తున్న ఆదాయం మొత్తం దేశవ్యాప్తంగా 5వేల ఆలయాలను నిర్మించడానికి శ్రీకారం చుట్టిందన్నారు. నేడు ఓటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ లకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా వారి అభివృద్ధి, సంక్షేమం కోసం వేలకోట్లను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా పార్లమెంట్ అధ్యక్షురాలిగా దళితురాలైన పనబాక లక్ష్మికి ఇవ్వడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అదేవిధంగా పార్లమెంట్ కమిటీలో కానీ, రాష్ట్ర స్థాయి కమిటీలో కానీ, జాతీయస్థాయి కమిటీలో గాని ఎస్సీలకు అన్నగారిన వర్గాలకు సముచితకు స్థానం కల్పించిన పార్టీ ఏదైనా ఉందంటే అది టిడిపి అన్నారు. ఆఖరుగా ఆయన మాట్లాడుతూ ఇదేవిధంగా రాబోవు రోజుల్లో సైతం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని వర్గాల వారికి సముచిత గౌరవం కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# బాలుపల్లి వద్ద రెండు వాహనాలు ఢీ

## ● మంటలో కాలిపోయిన వాహనాలు... తప్పిన ప్రాణాపాయం



**రైల్వేకోడూరు రూరల్, మే 19 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలంలోని బాలుపల్లె అటవీశాఖ తనిఖీ కేంద్రం వద్ద మంగళవారం ఉదయం రెండు వాహనాలు ఢీకొని పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చెక్‌పోస్ట్ వద్ద వద్ద ఉదయం తిరుపతి వైపు నుంచి కడప వైపు వెళుతున్న కారు మరమ్మతులతో ఆగిపోయిన లోడు లారీ వెనుక భాగంలో ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొద్ది గంటల సమయంలో ప్రమాదం జరిగిన ప్రదేశానికి మరొక కారు వచ్చి ఇంజన్లో పొగలు రావడంతో ప్రమాదానికి గురైన కారు పక్కనే ఆపివేయడంతో కొద్దిసేపటికి ఆ కారులో మంటలు చెలరేగి లారీని ఢీకొన్న కారుకు మంటలు వ్యాపించి రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. లారీ వెనుక టైర్లు కూడా కాలడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే రెండు కార్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇప్పటివరకు కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు, గాయపడిన వారి పేర్లు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ అన్నారు. బాలుపల్లె చెక్ పోస్ట్ వద్ద జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో వాహనాల రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# సినిమా అవకాశాల పేరుతో యువతిపై అత్యాచారం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 19, ప్రభాతవార్త:** సినిమా షూటింగ్ ఆశ చూపి యువతిపై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకా రం.. జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్ సమీపంలో ఇద్దరు అనాథ యువతులు నివసిస్తూ సినిమా షూటింగ్‌లో చేస్తున్నారు. కాగా ఈ నెల 13న మెట్రో స్టేషన్ వద్ద ఉన్న యువతికి సినిమా షూటింగ్‌లో అవకాశం కల్పిస్తా నంటూ ఒక యువకుడు సికిందరాబాద్‌లోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ స్నేహి తుడితో కలిసి రెండు రోజులపాటు లైంగిక దాడికి పాల్ప డ్డారు. అనంతరం ఆమెను ఉబెర్ వాహనం బుక్‌చేసి పంపాడు. కాగా స్నేహితురాలి వద్దకు వెళ్లిన యువతి ఒంటిపై గాయాలు ఉండటంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నార్డిక్ కూటమితో భారత్ బంధం మరింత పటిష్ఠం

## నార్వేలో ప్రధాని మోడీ
## భారత్ వైఖరి స్పష్టీకరణ



**ఓస్లో, మే 19:** భారత్ నార్వే సంబంధాలు అనేక అవకాశాలతో నిండి ఉన్నాయని ప్రపంచ శాంతిని రెండు దేశాలు కాంక్షిస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. నార్వే పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ మాట్లాడుతూ భారతదేశంతో సంబంధాలు, వాణిజ్యం, ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఉగ్రవాదం విషయంలో తాను రాజీపడబోనని మోడీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన, బహుపాక్షికవాదం పట్ల మన పరస్పర నిబద్ధత మనల్ని సహజ భాగస్వాములుగా చేస్తుందన్నారు. అదే సమయంలో సాంకేతికత, సుస్థిర అభివృద్ధి విభిన్న రంగాల్లో మన ఉమ్మడి ప్రాధాన్యతలు కలిసి పని చేయడానికి అపారమైన అవకాశాలను అందిస్తున్నా యని గుర్తుచేసారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నార్డిక్ దేశాలతో మన సంబంధాలను వేగవంతం చేయడానికి, బలోపేతం చేయడానికి ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ ఫార్మాట్‌ను రూపొందించామని అన్నారు. కొన్నేళ్లుగా రెండు దేశాలేకాకుండా నార్డిక్ దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి సాధించామని, పదేళ్లలో మన ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు నాలుగు రెట్లు పెరిగిందన్నారు. భారతదేశ వేగవంతమైన వృద్ధి లో నార్డిక్ దేశాల పెట్టుబడి నిధులు కూడా ముఖ్యమైన భాగస్వాములుగా మారుతున్నాయని, గడచిన దశాబ్దంలో భారతదేశంలోకి నార్డిక్ దేశాల పెట్టుబడులు దాదాపు 200 శాతం పెరిగాయని మోడీ తెలిపారు. నార్వే, ఐస్‌లాండ్, ఇతర ఈఎఫ్‌టీఏ దేశాలతో కలిసి అక్టోబర్ 2025 నుంచి వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని అమలు చేశాం. అంతేకాక కొన్ని నెలల క్రితమే భారత్‌యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పం దంపై సంతకం చేశాం. ఇందులో డెన్మార్క్, ఫిన్లాండ్, స్వీడన్ కూడా భాగస్వా ములుగా ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక వాణిజ్య ఒప్పందాలతో, భారత్‌నార్డిక్ దేశాల మధ్య సంబంధాలలో ఒక కొత్త స్వర్ణయుగాన్ని ప్రారంభించ బోతున్నా మని చెప్పుకొచ్చారు. ప్రపంచ ఉద్రిక్తత లు, సంఘర్షణలు నెలకొన్న ఈ యుగంలో భారతదేశంనార్డిక్ దేశాలు నియమాల ఆధారిత ప్రపంచ వ్యవస్థను బలోపేతం చేయడం కొనసాగిస్తాయి. అది ఉక్రెయిన్ అయినా పశ్చిమాసియా అయినా సంఘర్షణలకు త్వరితగతిన ముగింపు పలికి శాంతిని నెలకొల్పే ప్రయత్నాలకు మేము మద్దతు ఇవ్వడం నిరంతరం కొనసాగిస్తాం. బహుళపక్ష సంస్థల సంస్కరణలు అవసరమని, అత్యవసరమని మేము అంగీకరిస్తున్నాము. ఉగ్రవాదం విషయంలో కూడా మాకు స్పష్టమైన, స్థిరమైన వైఖరి ఉంది. రాజీ లేదు. ద్వంద్వ ప్రమాణాలు లేవు. ఈ రోజు నేను సంబంద్ అనే పదాన్ని చాలాసార్లు ఉపయోగించాను. అనేక నార్డిక్ భాషలలో సంబంద్ అనే పదానికి అనుబంధం, సంబంధం, బంధం అని అర్థం. హిందీలో కూడా సంబంధ్‌కు అదే అర్థం ఉంది. ఇది కేవలం పదాల సారూప్యత మాత్రమే కాదు. ఇది మన ఆలోచనల సాన్నిహిత్యాన్ని ప్రతిబింబిస్తుందని మోడీ పేర్కొన్నారు.

# జాతీయ రహదారుల లీజు.. రూ.35వేల కోట్ల సమీకరణ లక్ష్యం

## హైవే అథారిటీస్, కేంద్రం కొత్త నిర్ణయం



**న్యూఢిల్లీ, మే 19:** దేశంలో రవాణా వ్యవస్థను ప్రపంచ స్థాయికి చేర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహ దారుల ద్వారా నిధులు సమీకరించి, వాటితో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 28 ప్రధాన హైవేలను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా రూ.35వేల కోట్లు సమీకరించాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రభుత్వ ఆస్తులను విక్రయించకుండా నిర్ణీత కాలానికి ప్రైవేట్ సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి, దాని ద్వారా నిధులు పొందడాన్నే అసెట్ మోనెటైజేషన్ అం టారు. ఈ విధానంలో భాగంగా సుమారు 1,800 కిలో మీటర్ల పొడవైన 28 హైవేలను టోల్ ఆపరేట్‌ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ ఇన్విట్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తారు. ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వానికి ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి, ఆ రహదారులపై టోల్ వసూలు చేసుకునే హక్కును పొందుతాయి. ఈ నిధులను ప్రభుత్వం కొత్త ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి వినియోగిస్తుంది. ప్రస్తుతం ఎన్‌హెచ్‌ఏఐ రూపొం దించిన జాబితాలో హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎక్కువ హైవేలు ఉన్నాయి. ఈ మార్గాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేట్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు.

విదేశీ పెన్షన్ ఫండ్‌లు, సావరిన్ వెల్త్ ఫండ్‌లు కూడా భారత రోడ్డు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా నిబంధనలను సరళీకరించడం ఈ ప్రక్రియకు మరింత ఊతమిస్తోంది. నాలుగు రాష్ట్రాల్లోని 260 కిలోమీటర్ల రోడ్ల ద్వారానే ప్రభుత్వం రూ.9వేల కోట్లు సమీకరించడం ఈ రంగంలో ఉన్న సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. ఈ భారీ ప్రణాళిక వల్ల సామాన్యులకు రెండు రకాలుగా ప్రయోజనం చేకూర నుంది. ఒకటి, ప్రభుత్వానికి నిధులు అందుబాటులోకి రావడం వల్ల కొత్త రహదారులు వేగంగా పూర్తవుతాయి. ఇది ప్రయాణ సమయాన్ని తగ్గించి, రవాణా ఖర్చులను అదుపులో ఉంచుతుంది. రెండవది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ఇన్విట్‌ల ద్వారా సాధారణ ప్రజలు కూడా ఈ హైవే ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టే అవకాశం లభిస్తుంది. స్టాక్ మార్కెట్ ద్వారా ఈ ట్రస్టులలో ఇన్వెస్ట్ చేస్తే, టోల్ ద్వారా వచ్చే ఆదాయంలో డివిడెండ్ రూపంలో వాటా పొందవచ్చు. ఇది సురక్షితమైన పెట్టుబడి మార్గంగా నిలుస్తోంది. ఈ మొత్తం ప్రణాళిక నేషనల్ మోనె టైజేషన్ పైప్‌లైన్ 2.0లో భాగంగా జరుగుతుండగా, దీని కింద ఐదేళ్లకాలంలో రహదారులనుంచే రూ.4.42 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లపై కేసు

## గోల్‌మాల్ వెనుక విదేశాల్లోని రవి అనుచరుల పాత్రపై అనుమానాలు?

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక భాషలకు చెందిన కొత్త సినిమాలను రిలీజ్ అయిన గంటల వ్యవధిలోనే ఉచితంగా చూపుతున్న ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్లపై సైబర్‌క్రైం పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. అధునాతన టెక్నాలజీని వాడి, విదేశాల నుంచి ఈ రెండు వెబ్ సైట్లను సైబర్ నేరగాళ్లు నడుపుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

గతంలో ఈ రెండు వెబ్‌సైట్లను నిర్వహించిన ఇమంది రవికి తాజా వ్యవ హారంలో సంబంధం లేదని పోలీసులు అంచనాకు వచ్చారు. ఇదే విషయమై రవిని సైబర్ క్రైం పోలీసులు విచారించి ఈ నిర్ణయానికి వచ్చారు. నాలుగు నెలల క్రితం రవిని సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశాక ఈ రెండు వెబ్‌సైట్లు మూతపడడం తెలిసిందే. అయితే వారం రోజులుగా ఈ వెబ్‌సైట్లు మళ్లీ ఇం టర్నెట్‌లో ప్రత్యక్షమవడం, అనేక భాషలకు చెందిన కొత్త సినిమాలు వస్తుండంతో సినీ వర్గాలు ఆందోళనకు గురై దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఫిలిం ఛాంబర్ తరపున అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేసి ఈ వెబ్‌సైట్లకు అందుతున్న సర్వర్లు ఎక్కడ వున్నాయని ఆరా తీయగా దీని మూలాలు విదేశాల్లో వుందని తేలింది. గతంలో వీటిని నిర్వహించిన రవి కూడా విదేశాల నుంచే కార్య కలాపాలను సాగించడం విదితమే. తాజా ఘటనలో తన ప్రమేయం లేదని రవి పోలీసులకు చెప్పగా విదేశాల్లో గతంలో ఇతనితో కలిసి ఈ గోల్‌మాల్‌లో పాలు పంచుకున్న నేరగాళ్ల పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రవితో కలిసి పనిచేసిన విదేశీయుల వివరాలను సైబర్ క్రైం పోలీసులు సేకరిస్తున్నారు.

# భార్యను కత్తితో పొడిచి హత్య

## కుటుంబకలహాలే కారణమని ప్రాథమిక నిర్ధారణ

## అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన భర్త

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 19, ప్రభాతవార్త:** భార్యను భర్త కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగి దెబోరా (26)కు 2018లో రాజు అనే వ్యక్తితో ప్రేమ వివాహం జరగగా వారికి శివకుమార్(8), రాజేష్(5) అని ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు సంవత్సరాలుగా దెబోరా, రాజుల మధ్య గొడవలు జరుగుతూ ఉండటంతో గత సంవత్సరం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజు తనను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయటంతోపాటు, విడాకుల కోసం కోర్టులో కేసు వేసింది. రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ అత్తాపూర్‌లో నివాసం ఉంటూ ఉండగా, దెబోరా కిషన్‌బాగ్‌లో పిల్లలతో కలసి ఉంటోంది. దెబోరా కవాడిగూడలోని రత్నదీప్ భవనంలోని నాలుగో అంతస్థులో ఒక స్పా సెంటర్‌లో పనిచేస్తూ ఉన్నది. మధ్యమధ్యలో రాజు భార్య వద్దకు వచ్చి, పిల్లలను చూసే వంకతో దెబోరాకు దగ్గర కావాలని ప్రయత్నించాడు. దెబోరా అతనిని నమ్మకపోవటంతో ఆమెపై రాజు కక్ష పెంచుకున్నాడు. భార్యపై అనుమానం ఉన్న రాజు ఆమెను ఎలాగైనా హత్య చేయాలనే పథకం ప్రకారం, మంగళవారం ఉదయం స్పా సెంటర్‌కు బయలుదేరిన దెబోరాను వెంబడించాడు. ఆటోలో స్పా సెంటర్ వద్ద దిగిన దెబోరాతోపాటు, ఆమె వెనకే వచ్చిన రాజు ఆమెతోపాటు లిఫ్ట్‌లో ఎక్కి, ఆమెతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ పెరగటంతో రాజు ఆమెను కత్తితో పలుచోట్ల పొడిచి, ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, క్లూస్‌టీం సాయంతో సీసీ ఫుటేజీల ఆధారంగా ఘటన వివరాలను సేకరించారు. హత్యకు ప్రధాన కారణం కుటుంబ కలహాలేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. భార్యను హత్యచేసిన నిందితుడు రాజు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం అందటంతో గాంధీనగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దెబోరా తల్లి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. తమ కుమార్తెను అనుమానంతో వేధించి, హత్య చేసిన రాజును కఠినంగా శిక్షించాలని దెబోరా తల్లి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ హైకోర్టు మహిళా జడ్జిపై అనుచిత పోస్టులు

## విచారణకు జాయింట్ సిపి నేతృత్వంలో సిట్

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ ఉదంతంలో హైకోర్టు మహిళా న్యాయమూర్తిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు వుంచిన విషయమై పూర్తిస్థాయిలో విచారించేందుకు నగర ఉత్తర జోన్ జాయింట్ సిపి శ్వేత నేతృత్వంలో సిట్ ఏర్పాటయ్యింది. భగీరథ్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను మహిళా న్యాయమూర్తి ఆధ్వర్యం లోని స్పెషల్ బెంచ్ విచారించడం తెలిసిందే. శుక్రవారం అర్థరాత్రి వరకు దీనిపై విచారణ జరగగా అంతకు ముందు, ఆ తరువాత సోషల్ మీడియాలో న్యాయమూర్తిని ఉద్దేశించి ఈ పోస్టులు వచ్చాయి. దీనిపై హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు మొదట చార్మినార్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆ తరువాత దీనిని సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌కు బదలీ చేశారు. ఈ కేసులో ఎపికి చెందిన దామోదర్ అనే వ్యక్తిని అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు. మరో 15 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. కొత్తగా ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయడానికి ప్రత్యేక ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యులు, వారిపై ఆధారపడిన వారికి సంబంధించిన సమగ్ర సమాచా రాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 31 లోపు తప్పనిసరిగా ఐఎఫ్‌ఎంఐఎస్–హెచ్‌ఆర్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశిస్తూ ఆర్థిక మంగళవారం మెమో జారీ చేసింది.

# సిఐ కాదు.. కామాంధుడు!

## మోసపోయిన యువతి ఫిర్యాదుతో కేసు నమోదు, ముందస్తు బెయిల్

### ఆరోపణలు నిర్ధారణతో డిజిపి ఆఫీస్‌కు అటాచ్



**ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త:** కాపాడాల్సిన రక్షక భటుడే.. కామంతో కాటు వేసాడు. కంచే చేను మేసిన చందంగా.. న్యాయం కోసం అని తన దగ్గరకు వచ్చిన మహిళను లోపరుచుకుని గర్భవతి చేసాడు. భర్తతో బలవంతంగా విడాకులు ఇప్పించి అన్ని విధాలుగా మహిళను వాడుకుని చివరకు మొహం చాటు వేయడం తో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. 2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చు కున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దా టవేస్తుండటంతో విసిగిపోయిన ఆమె ఈ నెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు బి.ఎన్.ఎస్ సెక్షన్ 69 ప్రకారం కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావడం తో సీఐ రాజునాయక్ పరారీలోకి వెళ్లి, ఇటీవల ముందస్తు బెయిల్ పొందినట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనపై జరిగిన అంతర్గత విచారణలో సీఐ వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు అతడిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

# కొడుకు తప్పు చేస్తే తండ్రికి సంబంధమేంటి?

## బిజెపి నేతలు పదవి తమకు వస్తుందని ఆశపడుతున్నారు

## రేవంత్ దూకుడు అడ్డుకొనేందుకు అరవింద్ యత్నం

### పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** సంజయ్‌ను పదవి నుండి దించాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారుకానీ, కొడుకు తప్పు చేస్తే తండ్రికి ఏం సంబంధం ఉంటుంది? అని పిసిసి క్రమశిక్షణ కమి టీ చైర్మన్ ప్రశ్నించారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సంజయ్ పదవిపోతే తమకి పదవి వస్తుందని పలువురు బి జెపి నేతలు ఆశపడుతున్నారనీ ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో చట్టం తన పని తాను చేస్తుందనీ ఆయన తెలిపారు. మనది వెస్ట్‌బెంగాల్, బీహార్ కాదు ఇక్కడ సిఎంగా ఉన్నది రేవంత్‌రెడ్డి తానే మళ్లీ సిఎం అవుతానని ప్రకటించే శక్తి ఉన్నవాడు మీ విన్యాసాలు ఏవి కూడా ఇక్కడ పనిచేయవని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. రేవంత్ ఎత్తుకు పైఎత్తులు వేసి మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలడని ధీమా వ్యక్తం చేశారు. సౌత్ ఇండియాలో పార్టీ బలోపే తానికి సిఎం రేవంత్ పని చేస్తున్నారని, ఆయన దూకుడు అడ్డుకోవడానికే ధర్మపురి అరవింద్ ప్రయత్నం చేస్తున్నారని రవి ఆరోపించారు. డిఎస్ జీవితకాలంలో 90 శాతం కాంగ్రెస్ పార్టీలోనే పనిచేశారని డిఎస్ కొడుకు అరవింద్ తెలంగాణ సిఎం రేవంత్‌పై ఇష్టమున్నట్టు మాట్లాడుతు న్నా రని, వైఖరి మార్చుకోవాలని హితవు చెప్పారు. సిఎం రేవంత్ ఇమేజ్ చెడగొట్టాలని చాలామంది ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందారు. పిసిసి క్రమశిక్షణ కమిటీ, అనంతుల శ్యామ్‌మోహన్, ఈరవత్రి అనిల్ చైర్మన్, చరణ్ కౌశిక్‌యాదవ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

## ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** వానాకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు మేలు చేసేందుకు పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం భారి రాయితీతో అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిం చాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో మంగళవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచేం దుకు పచ్చిరొట్ట పంటలను ఎక్కువగా సాగు చేయాలన్నారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా భూమిని కాపాడుకుంటూనే అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షి ంచారు. కాగా.. నిస్సారంగా మారిన నల్లబీడు భూములను తిరిగి సాగులోకి తెచ్చేందుకు, వాటి పునరుద్ధరణకు రైతులు జిప్సంను వినియోగించాలని మంత్రి తుమ్మల సూచించారు. అదేవిధంగా సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు అన్నదాతలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

### ఆధునిక గిడ్డంగుల నిర్మాణం..

ఆధునిక గిడ్డంగుల నిర్మాణం కోసం టీజీ ఆగ్రోస్, టీజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమక్షంలో ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా 23 ఎకరాల ప్రభుత్వ భూమిలో టీజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ సొంత నిధులతో 85 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆధునిక గిడ్డంగులను నిర్మించనుంది. ఈ నిర్మాణ పనులను 15 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

రైతులు తమ పంట ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గిడ్డంగులు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలిపారు. మార్కెట్ పరిస్థితులను అనుసరించి రైతులు సరైన సమయంలో తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భూముల మార్పిడి ద్వారా ప్రభుత్వ ఆస్తులు సమర్థవంతంగా వినియోగంలోకి రావడంతోపాటు రైతులకు మరిన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

రాష్ట్రంలో వ్యవసాయ మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలను

20-05pg10exHMNWJQEV 12 GNT_20-05pg10exHMNWJQEV.qxd 20/May/26 12:18 AM Page 1



# అఫ్ఘాన్‌తో టెస్ట్, వన్డేలకు టీమిండియా ఎంపిక

*టెస్ట్, వన్డేలకు కెప్టెన్‌గా గిల్
*బుమ్రా, జడేజాలకు విశ్రాంతి
*రోహిత్, హార్దిక్‌లకు కండిషన్
*ప్రిన్స్ , గుర్నూర్‌లకు పిలుపు
*రెండు ఫార్మాట్లలోనూ నితీష్





**ముంబై, మే 19:** ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్, వన్డే సిరీస్‌లకు టీమిండియాను భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలో జరగిన సెలెక్షన్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండు ఫార్మాట్లకు భారత జట్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వ్యవహరిస్తాడు. జూన్ 6నుంచి అఫ్గానిస్థాన్‌తో ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది.

**టెస్ట్ వైస్ట్ కెప్టెన్‌గా రాహుల్**

టెస్ట్ జట్టుకు రిషబ్ పంత్ స్థానంలో కేఎల్ రాహుల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రిషబ్ పంత్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా జట్టులో కొనసాగుతాడు. అలాగే పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలకు విశ్రాంతి కల్పించిన సెలెక్టర్లు.. వారి స్థానాల్లో గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబ్‌లను ఎంపికచేశారు. వీరిద్దరితో పాటు ప్రిన్స్ యాదవ్, మానవ్ సుతార్ తొలిసారిగా మెన్ బ్లూ జట్టులో చోటు దక్కించుకున్నారు. అక్షర్ పటేల్, ఆకాశ్ దీప్‌లకు చోటు దక్కలేదు.

**వన్డే వైస్ కెప్టెన్‌గా శ్రేయాస్**

ఇక వన్డే జట్టుకు శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య ఎంపికయినా, వారు ఫిట్‌నెస్ నిరూపించు కుంటేనే జట్టులో కొనసాగుతారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలతో పాటు ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్‌లకు చోటు దక్కింది. ఐపీఎల్‌లో వికెట్ల పంట పండించిన మహ్మద్ షమి గురించి చర్చించలేదని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పేర్కొన్నాడు.

**రెండుఫార్మాట్లకు నితీష్**

హైదరాబాద్ సూపర్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్‌రెడ్డి రెండు ఫార్మాట్లకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్న నితీష్.. టెస్ట్, వన్డే జట్టులోనూ చోటు సంపాదించాడు. ఇక హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్... టెస్ట్ జట్టులో స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. వన్డే జట్టులోకి మాత్రం సిరాజ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.

**టెస్ట్ జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్‌కెప్టెన్), యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

**వన్డే జట్టు :** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, , కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

**మ్యాచ్‌ల షెడ్యూల్**

**ఏకైక టెస్టు:** జూన్ 6-10 (ముల్లాన్‌పూర్)
**తొలి వన్డే:** జూన్ 14 (ధర్మశాల)
**రెండో వన్డే:** జూన్ 17 (లక్నో)
**మూడో వన్డే:** జూన్ 20 (చెన్నై)

# రెండో టెస్ట్‌లోనూ ఓటమి దిశగా పాకిస్థాన్

**షెల్హెట్, మే 19:** బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ పాకిస్థాన్ ఓటమి దిశలో కొనసాగుతోంది. 437 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్.. నాలుగో ఆట ముగిసేసరికి ఏడు వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఇంకా ఒక రోజు ఆటమిగిలి ఉంది. ఇంకా 121 పరుగులు చేయాల్సి ఉండగా చేతిలో మూడు వికెట్లు మాత్రమే ఉన్నాయి. స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ రూపంలో మహ్మద్ రిజ్వాన్(135 బంతుల్లో 75 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు.

నాలుగో రోజు ఆట ఆరంభంలోనే పాకిస్థాన్ వేగంగా వికెట్లు కోల్పోయింది. నవిద్ రాణా, తైజుల్ ఇస్లాం... పాక్ టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ పనిపట్టారు. దీంతో 162 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సల్మాన్ అఘా(102 బంతుల్లో 71), మహ్మద్ రిజ్వాన్ ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 134 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. సల్మాన్ అఘాను తైజుల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. మహ్మద్ రిజ్వాన్ క్రీజ్‌లో నిలదొక్కుకుని ఆడుతున్నాడు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం నాలుగు వికెట్లు, నవీద్ రాణా రెండు వికెట్లు పడగొట్టారు. ఢాకాలో జరిగిన తొలి టెస్ట్‌లో బంగ్లా ఘనవిజయం సాధించింది.

# రాయల్స్ వైభవం

## బ్యాటింగ్ వండర్ సూర్య వంశీ
## 38 బంతుల్లో 93 రన్స్
## 10 సిక్స్‌లు, 7 ఫోర్లు



జైపూర్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ అద్భుతం వైభవ్ సూర్య వంశీ మరోసారి తనదైన శైలిలో రెచ్చిపోయాడు. అయితే మునుపటి వైభవ్‌లా కాకుండా అనుభవజ్ఞుడైన ఆటగాడిగా, తను క్రీజ్‌లో నిలవడడం జట్టుకు ఏ స్థాయిలో అవసరమో తెలిసిన వాడిగా కనిపించాడు. తన సహజ శైలిలో తొలి బంతికి సిక్స్‌కు పోకుండా ఎదుర్కొన్న మూడో బంతికి అదీ సింగిల్స్‌తో ఖాతా తెరిచాడు. మొదటి పది బంతుల్లో వైభవ్ చేసింది కేవలం అయిదు పరుగులే. జైస్వాల్ ఆడుతున్నంత సేపు మరో ఎండ్‌లో ప్రేక్షకుడిగానే ఉన్నాడు.

ఎదుర్కొన్న 11వ బంతికి సిక్స్‌తో మొదలుపెట్టిన వైభవ్... ఆ తర్వాత కూడా ఆచితూచే ఆడాడు. ఆరో ఓవర్ నుంచి శివాలెత్తడం మొదలు పెట్టాడు. ప్రిన్స్ వేసిన మొదటి బంతికి సిక్స్‌తో స్టార్ట్ చేసి మరో రెండు బౌండరీలు బాది 15 రన్స్ సాధించాడు. ఇక 9వ ఓవర్లో నైతే ఆకాశ్‌కు చుక్కలు చూపాడు. మొదటి బంతికి సిక్స్, ఆ తర్వాత 4,4,6,4తో మొత్తం 22 రన్స్ చేశాడు. 23 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అదే జోరులో రాఠీ బంతికి సిక్స్, ప్రిన్స్ బంతులకు బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, మయాంక్ ఓవర్లో వరుస రెండు సిక్స్‌లు, రాఠీ మరో ఓవర్లో సిక్స్, ఫోర్‌తో సెంచరీకి సమీపించాడు. 93 పరుగుల వద్ద అవుటై శతకం మిస్సయ్యాడు. పది బంతులకు 5 రన్స్ చేసిన వైభవ్.. ఆతర్వాత 28 బంతుల్లో 88 రన్స్ సాధించాడు. జురెల్‌తో కలిసి శతకం భాగస్వామ్యం అందించాడు. తనలోని మరో వైభవ్‌ను చూపెట్టి క్రికెట్ అభిమానులను ఉర్రూత లూగించాడు.

# తొలి రౌండ్‌లో భారత్ జోడీ సంచలనం




**కౌలాలంపూర్:** మలేషియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జోడీ సంచలనం సృష్టించింది. హరిహరన్-అర్జున్ జోడీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్ జోడీ క్రిస్టో పొపొవ్-థామస్ పొపొవ్‌పై గెలుపొందారు. తొలి సెట్‌ను 21-19తో నెగ్గిన భారత్ జోడీ.. రెండో సెట్‌ను మరింత అలవోకగా 21-15తో ముగించింది. కేవలం 36 నిమిషాల్లోనే ఫ్రాన్స్ జోడీని ఓడించింది. గత థామస్ కప్ సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో ఎదురైన పరాజయానికి భారత్ షట్లర్లు స్వీట్ రివేంజ్ తీర్చుకున్నారు.

కాగా మోచేతి గాయంతో థామస్ కప్‌కు దూరమైన లక్ష్యసేన్.. తొలి రౌండ్‌లో మోహ జాకీ ఉబైదిల్లా(ఇండోనేసియా)తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో తరుణ్ మానేపల్లి.. జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్), కిరణ్ జార్జ్.. అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్), హెచ్.ఎస్. ప్రణయ్.. క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో పోటీపడతారు.

మహిళల సింగిల్స్‌లో తన్వీ శర్మ.. పిచ్చామోన్ ఓపట్నిపుత్ (థాయ్‌లాండ్)తో, ఉన్నతి హుడా.. హాన్ కియాన్స్ క్సీ (చైనా)తో, మాళవిక బన్సోద్.. వైవోస్ లీ (జర్మనీ)తో, అన్మోల్ ఖర్బ్.. లైన్ హోజ్ మార్క్ కెర్స్‌ఫెల్డ్ (డెన్మార్క్)తో తలపడనున్నారు. ఈ నెల ఆరంభంలో డెన్మార్క్‌లోని హార్సెన్స్‌లో జరిగిన థామస్ కప్ సెమీస్‌లో ఇండియా 0-3తో ఫ్రాన్స్ చేతిలో ఓడింది. అయితే ఆ మూడు సింగిల్స్‌లో ఆడిన ప్లేయర్లు ఇప్పుడు ఈ టోర్నీలోనూ ఇండియన్స్‌తో తలపడుతున్నారు. దాంతో వీళ్లపై గెలిచి థామస్ కప్ ఓటమికి బదులు తీర్చుకోవాలని భావిస్తున్నారు.

## భారీ స్కోర్ల మ్యాచ్‌లో లక్నోపై విజయం
# గెలిచి నిలిచిన రాజస్థాన్ రాయల్స్

**జైపూర్:** ఐపీఎల్ 2026లో భాగంగా సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ గెలిచి నిలిచింది. ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా నిలుపుకుంది. లక్నో ఉంచిన 221 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులుండగానే మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. మొదట యశస్వీ జైస్వాల్(23 బంతుల్లో 43), ఆ తర్వాత వైభవ్(38 బంతుల్లో 93), చివరకు ధృవ్ జురెల్(38 బంతుల్లో 53 నాటౌట్) మెరుపులు మెరిపించారు. చివరి మ్యాచ్‌లోనూ రాజస్థాన్ రాయల్స్ గెలుపొందితే నాలుగో జట్టుకు ప్లే ఆఫ్‌కు చేరుకుంటుంది.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓపెనర్లు ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. జోష్ ఇంగ్లిస్(29 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిచెల్ మార్ష్(57 బంతుల్లో 96; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు).. రాజస్థాన్ బౌలర్లపై చెలరేగారు. బౌండరీలు, సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. క్రేజీ షాట్లతో స్కోరు బోర్డును పరిగెత్తించారు. కేవలం 29 బంతుల్లోనే 60పరుగులు చేసి ప్రమాదకరంగా మారుతున్న ఇంగ్లీస్‌ను యశ్ రాజ్ అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 109 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇంగ్లీస్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (16) ఎక్కువ సేపు నిలవలేదు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్(35) కూడా పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డాడు. మార్ష్‌తో కలిసి 64 పరుగులు జోడించాడు. ఆయుష్ బదానిని ఆర్చర్ డకౌట్ చేశాడు.

**మిచెల్ సెంచరీ మిస్ :** ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్ లో ఓపెనర్ మిచెల్ మార్ష్ విధ్వంసకర బ్యాటింగ్‌ను కొనసాగించాడు. రాజస్థాన్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడిన మార్ష్.. 57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. అయితే ఇన్నింగ్స్ చివరి ఓవర్ అయిదో బంతికి దురదృష్టవశాత్తూ రనౌట్ కావడంతో కేవలం 4 పరుగుల తేడాతో సెంచరీ చేసే సువర్ణావకాశాన్ని చేజార్చుకున్నాడు. అయినప్పటికీ మార్ష్ ధాటికి లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగుల మార్కును అందుకుంది. రాజస్థాన్ బౌలర్లలో యశ్‌రాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# స్వల్పనష్టాలకు పరిమితమైన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, మే 19:** స్టాక్ మార్కెట్లు వారంలో రెండోరోజు స్వల్పనష్టాలకు గురయ్యాయి. భారత్‌రూపాయి భారీగా క్షీణించింది. గ్లోబల్‌సెంటిమెంట్ బలహీనపడటంతో ఆరంభ లాభాలు ముగిసే సమయానికి ఆవిరయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 114.19 పాయింట్లు క్షీణించి 75,200.85వద్ద స్థిరపడగా నిఫ్టీ 31.95 పాయింట్లు క్షీణించి 23,618వద్ద ట్రేడింగ్ ముగించింది. అమెరికా బాండ్లపై రిటర్నులు పెరగడం, ప్రపంచ మార్కెట్‌ధోరణులు మిశ్రమంగా ఉన్న తీరు భారత్ మార్కెట్లపూ చూపింది. రంగాలవారీగాచూస్తే ఐటి స్టాక్స్ కొంత కొనుగోళ్లమద్దతిచ్చాయి.

ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థలషేర్లు మాత్రం ఒత్తిడికి లోనయ్యాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.73శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.17శాతం చొప్పున లాభపడ్డాయి. బిఎస్‌ఇలో 2590 షేర్లు ముందుకు కదిలితే 1596 షేర్లు క్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.58వద్ద ముగిసింది. ఒకదశలో 96.61వద్దకుచేరిన రూపాయి చివరకు 96.58వద్ద ట్రేడింగ్ ముగించింది. భారత్‌లో పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.29శాతం క్షీణించి 7.100కి రిటర్నులుచేరాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ 5 సెటిల్‌మెంట్‌దరలు రూ.1,59,950కి చేరాయి. అమెరికా పదేళ్ల బాండ్లు కూడా 4.608శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్లలో జులై నెల సెటిల్‌మెంట్ ధరలు 1.86 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 110.24 డాలర్లుగా ఉన్నాయి. నిఫ్టీలో ఐటిసూచీ 3.23శాతంపెరిగింది.

మూడు సెషన్లలోను ఈ సూచీ 7.12వాతం ర్యాలీ తీసింది. ఆదాని గ్రూప్‌స్టాక్స్ రివ్వున ర్యాలీ తీసాయి. అమెరికా జస్టిస్ విభాగం ఆదానికేసులు మొత్తం ఉపసంహరించి నట్లు ప్రకటించడంతో కంపెనీ గ్రూప్‌షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. ఆదాని గ్రీన్ ఎనర్జీ 0.64శాతం, ఆదాని టోటల్‌గ్యాస్ 2.16శాతం, ఆదాని ఎంటర్ ప్రైజెస్ 1.31శాతం, ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 0.09శాతం చొప్పున పెరిగాయి. హెచ్‌పిసిఎల్ 3.37శాతం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 2.42శాతం, బిపిసిఎల్ 2.01శాతం చొప్పున పెరిగాయి. అపోలో మైక్రోసిస్టమ్స్ 9.55శాతంపెరిగింది. ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా మాత్రం 0.57శాతం దిగజారింది. ఆస్ట్రాల్‌కంపెనీ 6.26శాతం క్షీణిస్తే డూమ్స్ ఇండస్ట్రీస్ కూడా 2.05శాతం నెగిటివ్‌లో ఉంది. జెకె పేపర్ 6.60శాతం పెరిగింది. ఇంద్రప్రస్థ గ్యాస్ కూడా 3.77శాతం పెరిగింది. అలాగే త్రివేణి టర్బైన్ 6.94శాతం, సోమాని సిరమిక్స్ కూడా 12.60శాతం చొప్పున పెరిగాయి. మొత్తంగాచూస్తే కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు కొన్ని కంపెనీలకు సానుకూలం అయితే మరికొన్నింటికి ప్రతికూలంగా మారాయి.

## అమెరికా కోర్టుల్లో
# అదానీకి శాశ్వత ఊరట



**వాషింగ్టన్, మే 19:** బిజినెస్‌మ్యాన్ బిలియనీర్ గౌతమ్ అదానీ, ఆయన సోదరి కుమారుడు సాగర్ అదానీలకు అమెరికా న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. న్యూయార్క్‌లో వారిపై నమోదైన హైప్రొఫైల్ సెక్యూరిటీస్, వైర్ ఫ్రాడ్ క్రిమినల్ కేసులను అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ శాశ్వతంగా ఉపసంహరించుకుంది. అదానీలపై మోపిన ఆరోపణలను నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని, ఈ కేసులో అమెరికాకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధాలు కనపడలేదని ప్రాసిక్యూటర్లు తేల్చిచెప్పారు. దీంతో అదానీ గ్రూప్‌పై అమెరికాలో సాగుతున్న అన్ని రకాల చట్టపరమైన విచారణలకు పూర్తిగా తెరపడింది. ఈ కేసును విత్ ప్రిజుడీస్ కింద కోర్టు కొట్టివేసింది. అంటే ఈ కేసును భవిష్యత్తులో మళ్లీ రీఓపెన్ చేయడానికి వీలుండదు. అమెరికా క్రిమినల్ నిబంధనల్లో ఇలాంటి ఉపసంహరణలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఈ కేసులో మరింత సమయాన్ని, వనరులను వృథా చేయదలచుకోలేదని న్యాయస్థానానికి సమర్పించిన పత్రాల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ పేర్కొంది.

2024 చివరలో నమోదైన ఈ కేసు అదానీ గ్రూప్ అంతర్జాతీయ విస్తరణ ప్రణాళికలకు పెద్ద అడ్డంకిగా మారిన తరుణంలో ఈ తీర్పు రావడం గ్రూప్‌నకు కలిసొచ్చే అంశం. భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం అదానీ రూ.2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, ఆ విషయాన్ని అమెరికా ఇన్వెస్టర్ల వద్ద దాచారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు పూర్తిగా క్లోజ్ కావడానికి ముందు అదానీ గ్రూప్ అమెరికా ప్రభుత్వ విభాగాలతో కొన్ని సివిల్ సెటిల్‌మెంట్లు చేసుకుంది. సోలార్ ప్రాజెక్టుల డిస్‌క్లోజర్ల వివాదంలో గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించడానికి యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌తో ఒప్పందం కుదుర్చుకొన్నారు. ఇరాన్ నుంచి ఎల్‌పీజీ దిగుమతుల ద్వారా అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణలపై అదానీ ఎంటర్‌ప్రైజెస్ యూఎస్ ట్రెజరీ విభాగానికి 275 మిలియన్ డాలర్లు చెల్లించి ఆ వివాదాన్ని కూడా పరిష్కరించుకుంది. ఈ సెటిల్‌మెంట్లు అన్నింటిలోనూ అదానీ గ్రూప్ తమ తప్పును అంగీకరించకుండానే వివాదాలను ముగించడం గమనార్హం. అదానీ తరఫున రంగంలోకి దిగిన సలివన్ క్రామ్‌వెల్ వంటి ఐదు టాప్ అమెరికన్ న్యాయ సంస్థలు ఈ కేసు అమెరికా పరిధిలోకి రాదని గట్టిగా వాదించాయి. నిందితులు భారతీయులు, ప్రాజెక్టులు భారతదేశంలోనే జరిగాయి. బాండ్ల వల్ల ఇన్వెస్టర్లకు ఎలాంటి నష్టాలు రాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. లంచం ఆరోపణలను మోపడానికి తగిన ఆధారాలు లేకపోవడంతోనే ప్రాసిక్యూటర్లు దీనిని సెక్యూరిటీస్ ఫ్రాడ్‌గా మార్చారని అదానీ లాయర్లు వాదించారు.



## ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి
# డాలర్ వర్సెస్ రూపీ 96.58

న్యూఢిల్లీ, మే 19: భారత్‌రూపాయి మరోసారి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరుకుంది. మంగళవారం ఇంటర్‌బ్యాంకు ఫోరెక్స్ కౌంటర్లలో డాలరుతో చెలామణి మరింత బలహీనపడింది. రూ.96.58వద్ద ట్రేడింగ్ ముగిసినతర్వాత మొత్తం 23 పైసలు క్షీణించినట్లు తేలింది. వరుసగా 12వ రోజుకూడా భారత్‌రూపాయి అంతర్జాతీయ మార్కెట్‌లో క్షీణతను ఎదుర్కొంది. ఇంట్రాడేలో రూపాయి 96.61 వరకూ క్షీణించింది. తర్వాత క్రమేపీ బలపడి 96.58వద్దకు చేరింది. ముందు రోజు కూడా భారత్ రూపాయి 96.36వద్ద ఊగిసలాడింది. ఇప్పటివరకూ ఈ ఏడాది భారతరూపాయి డాలర్ మారకంలో ఏడుశాతం క్షీణించింది. కౌంటర్‌ప్రారంభంలో 96.37వద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 96.61కి చేరాక కొంతమేర నెమ్మదించి చివరకు 96.58వద్ద స్థిరపడింది. ప్రారంభంతో పోలిస్తే 25పైసలు పతనం అయినట్లు తేలింది. ముడిచమురు ధరలు పెరగడం, డాలర్ చెల్లింపులకు భారీ డిమాండ్ ఏర్పడటంతో రూపాయి భారీగా క్షీణించిందని నిపుణులు చెపుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారకపోవడం కూడా ఇందుకు మరికొంతకారణం అయింది. అమెరికా ఫెడ్‌రిజర్వుకూడా డాలర్ పటిష్టతను కొనసాగించే నిర్ణయాలనే ప్రకటించడంతో ఇతర కరెన్సీలు బలహీనపడటం ప్రారంభించాయి. వీటిలో రూపాయి కూడా ఉంది. డాలర్ పటిష్టం అవుతుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. దీనివల్ల కార్పొరేట్ రంగానికి కూడా తీవ్రస్థాయిలో మార్జిన్ ఒత్తిడులు ఉండే అవకాశం ఉంది. ఎగుమతి ఆధారిత విభాగాలు కొంతప్రభావిం అవుతాయి. ముడిచమురుధరలు దిగిరానంత వరకూ కూడా రూపాయి క్షీణత కొనసాగుతూనే ఉంటుందని కరెన్సీ నిపుణులు పేర్కొంటున్నారు.

# మెటా, స్టాండర్డ్ చార్టర్డ్ సంస్థల్లో ఉద్యోగులకు లేఆఫ్

## 15వేల మందికిపైగా ఇంటికే!

**ముంబయి, మే 19:** కార్పొరేట్ బ్యాంకింగ్ సోషల్‌మీడియా రంగాల్లో కూడా కృత్రిమమేధ పెట్టుబడులు భారీగా పెరుగుతుండటంతో మానవవనరుల సంఖ్య రానురాను తగ్గుతోంది. కంపెనీలు కూడా ఉద్యోగులపై అత్యధిక శాతం వేటువేస్తున్నాయి. తాజాగా మెటా సంస్థ పదిశాతం మందిపై లేఆఫ్ ప్రకటిస్తోంది. ఏడు వేలమందిని ఎఐ విధుల్లోకి మారుస్తున్నట్లు చీఫ్ మేనేజర్ జానెల్లె గేల్ తెలిపింది. ఈ లేఆఫ్‌లు, బదలీలు ఈనెల 20నుంచే అమలులో ఉంటాయని తెలిపారు. అలాగే ఎంట్రీలెవెల్‌లో ఎఐ విభాగానికి ఆరువేల కొత్తరోల్స్ తీసుకుంటామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మెటాకు 78వేలమంది ఉన్నారు. పదిశాతం అంటే 8వేలమందికి ఉద్వాసన చెపుతోంది. ఇక బదలీలు, లేఆఫ్‌ల పరంగా మొత్తం 20శాతం సిబ్బందిపై ప్రభావం ఉంటుంది. 2022చివరిలో 11 వేలమందిని తొలగించి తర్వాత ఏడాది 10వేలమందికి ఉద్వాసన చెప్పింది. రెండేళ్లలో డేటా సెంటర్ల ఏర్పాటుకు 600 బిలియన్ డాలర్లు వెచ్చించే ప్రణాళిక ఉందని కంపెనీ తెలిపింది. అదేతీరులో స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు కూడా ఏడువేల మంది ఉద్యోగులపై వేటువేస్తోంది. కృత్రిమమేథ, యాంత్రీకరణ పెద్ద ఎత్తున అమలవుతుండటంతో మానవ వనరుల సేవలు కుదిస్తున్నట్లు సిఇఒ బిల్ వింటర్స్ తెలిపారు. లండన్‌కేంద్రంగా ఉన్న ఈ బ్యాంకు 15 శాతం ఉద్యోగులను కుదిస్తోంది. 52వేల మంది ఉన్న ఉద్యోగుల్లో ఇపుడు ఏడువేలమందిని ఇంటికి పంపిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా 82వేలమంది పనిచేస్తున్నారు. బ్యాంకుకు భారత్‌లో చెన్నై, బెంగళూరులతోపాటు కౌలాలంపూర్, వార్సా వంటి ప్రాంతాల్లో కేంద్రాలున్నాయి. కృత్రిమమేధ ఆటో మేషన్ వైపు బ్యాంకులు మళ్లుతుండటం వల్లనే ఈ ఉద్వాసన చోటుచేసుకుంటున్నట్లు తేలింది. బ్యాంకు ఎక్కువ మార్జిన్ బిజినెస్‌పై ఫోకస్ పెంచిందని, రిటైల్ బ్యాంకింగ్, వెల్త్‌మేనేజ్‌మెంట్లను కుదించుకుంటూ స్థూల ఆర్థికవ్యవస్థల్లో ఎదురయిన అనిశ్చితి పరిస్థితులను సమతుల్యత కోసమే ఈ లేఆఫ్‌లు ఉంటాయని ప్రకటించింది.

# బిపిసిఎల్‌కు క్షీణించిన లాభాలు!



**ముంబయి, మే 19:** ప్రభుత్వరంగంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ నికరలాభం నాలుగో త్రైమాసికంలో 58శాతం క్షీణించింది. ఆయిల్‌మార్కెటింగ్‌కంపెనీ నికరలాభం రూ.7545 కోట్ల నుంచి రూ.3191 కోట్లకు క్షీణించింది. వన్‌టైమ్ నష్టం కింద రూ.4349.13 కోట్లు కంపెనీపై భారం పడింది. ఆయిల్ గ్యాస్ బ్లాకుల్లో తన పూర్తి అనుబంధ సంస్థ భారీగా తగ్గించింది. బిపిఆర్‌ఎల్ ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గాస్ బ్లాక్‌ల్లో పెట్టుబడులుపెట్టింది. ప్రత్యక్షంగా కానీ, తన అనుబంధ సంస్థలనుంచి కానీ పెట్టుబడులు ఉంటాయి. కొన్ని బ్లాకుల్లో పెట్టుబడులను పెట్టింది. అదే ప్రభావం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్‌పైనా చూపించింది. దానితో బిపిఆర్‌ఎల్‌కు 4349.13 కోట్ల నష్టం వచ్చింది. మూడో త్రైమాసికంలో 1.19 లక్షల కోట్లనుంచి స్వల్పంగా తగ్గింది. ఎబిడిటా 14శాతం క్షీణించి 10,061కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో 11,677 కోట్లుగా ఉంది. నిఫ్టీలో బిపిసిఎల్ షేర్లు రెండుశాతంపెరిగి రూ.286.45వద్ద ముగిసింది.

# భారత్‌లో పెప్సీకో 5700 కోట్ల పెట్టుబడులు



**న్యూఢిల్లీ, మే 19:** శీతల పానీయాల ఉత్పత్తిలో బహుళజాతి సంస్థ పెప్సికో భారత్‌లో వచ్చే ఐదేళ్లలో రూ.5700 కోట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. 2025 డిసెంబరునాటికి 12నెలల్లోను పెప్సికో ఇండియా నికరలాభం రూ.905 కోట్లు పెట్టుబడులు పెట్టాలనినిర్ణయించింది. కంపెనీ రాబడులు కూడా రూ.9789 కోట్లుగా ఉంటాయి. మధ్యప్రదేశ్, అస్సాం, తమిళనాడు కేంద్రాల్లోని యూనిట్లలో ఈ పెట్టుబడులు ఉంటాయని కంపెనీ ప్రకటించింది. పెప్సికోకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 13 మార్కెట్లలో భారత్ ప్రధానమైదని అందువల్లనే భారత్‌లో మరింత విస్తరించదలిచినట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని కాన్సెన్‌ట్రేట్స్ ప్లాంట్, అస్సాం, తమిళనాడుల్లోని స్నాక్స్ ప్లాంట్లలో పెట్టుబడులుంటాయని తెల్పారు. పెప్సికో దక్షిణాసియా సిఎఫ్‌ఒ సవితా బాలచంద్రన్ మాట్లాడుతూ కంపెనీ గత ఏడాది శరవేగంగా వృద్ధిని నమోదుచేసిందని, ఆహార ఉత్పత్తుల సెగ్మెంట్‌మరింతగా వృద్ధినమోదుచేసి వాణ్యిం 11శాతంపెరిగిందన్నారు. ప్రస్తుతం క్యాష్ ఆన్ రికార్డ్ రూ.1600 కోట్లవరకూ ఉందని, అందుకే విస్తరణపెట్టుబడులపై ఫోకస్ పెంచినట్లు తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14